


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి


ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 22 ఆదివారం | జూన్, 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 277
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Gunturt,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatnam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

## ‘యోగాంధ్ర’కు గిన్నిస్ రికార్డు

- ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ఘనత
- ఫలించిన ఏపీ యోగాంధ్ర యజ్ఞం
- అందరి కృషి, భాగస్వామ్యానికి బోనస్‌గా 2 గిన్నిస్ బుక్ రికార్డులు వశం
- ఏపీలో విశాఖ సాగర తీరాన 3 లక్షల మందికి పైగా ప్రజలు యోగా ఆసనాలు
- ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, లోకేశ్ ఆసనాలు



2

**విశాఖపట్నం–నవభూమిబ్యూరో**
నెలన్నర రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న యోగాంధ్ర యజ్ఞం ఫలించింది! యోగాంధ్ర పేరుతో విశాఖలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 11వ అంతర్జాతీయ యోగాడే కార్యక్రమం దిగ్విజయమైంది! యంత్రాంగమంతా మోహరించి చేసిన కృషి క్షేత్రస్థాయిలో సత్ఫలితాన్నచ్చింది. ప్రభుత్వం చేసిన కృషికి ఫలితంగా లక్షలాది మంది ప్రజలు తెల్లవారుజాము నుంచే స్వచ్ఛందంగా తరలివచ్చి యోగాడే వేడుకల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమానికి తిరుగులేని విజయాన్ని కట్టబెట్టారు. అందరి కృషి, భాగస్వామ్యానికి బోనస్‌గా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులు యోగాంధ్ర వశమయ్యాయి.
ఏపీలో విశాఖ సాగర తీరాన 3 లక్షల మందికి పైగా ప్రజలు యోగా ఆసనాలు వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, లోకేశ్ సహా రాష్ట్ర మంత్రులతోపాటు లక్షలాది మంది ప్రజలు యోగా గురువులు, ప్రావీణ్యుల ఆధ్వర్యంలో తనువు, మనసును ఏకం చేస్తూ యోగా ముద్రలు వేశారు.
ఆసీనులపై ఉత్సాహంగా పాల్గొని : ‘యోగా ఫర్ వన్ ఎర్త్ –వన్ హెల్త్ ‘ నినాదంతో 11వ ఇంటర్నేషనల్ యోగాడే కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం విశాఖలో నిర్వహించింది. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై యోగాసనాలు వేశారు. ఈ ఉదయం 7 గంటల నుంచి 7 గంటల 45 వరకు, 45 నిమిషాలపాటు, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, లోకేశ్ సహా మంత్రులు, ప్రజలు

## ఇజ్రాయెల్ దాడుల్లో టాప్ కమాండర్లు హతం

- ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయిన ఇరాన్
- ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు గట్టి దెబ్బ
- మృతి చెందిన కమాండర్లలో బెహ్నామ్ షాహ్‌రియారీ
- ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షణలో కీలకవ్యక్తి



**టెహ్రాన్–నవభూమి:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలు, అణు శాస్త్రవేత్తలను కోల్పోయిన ఇరాన్ తాజాగా మరో ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయింది. దీంతో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఈ దాడుల్లో మృతి చెందిన కమాండర్లలో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధ సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహ్‌రియారీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ ఇరాన్‌లో బెహ్నామ్ షాహ్‌రియారీ నడుపుతున్న వాహనంపై బాంబు దాడి జరపడంతో అతను హతమైనట్టు ఐడీఎఫ్ ధ్రువీకరించింది. ప్రాక్సీలకు ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడంలో ఇతను కీలకవ్యక్తిగా ఉన్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్‌బుల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హౌతీ మిలీటియాకు నేరుగా ఆయుధాల సరఫరాలో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్ పౌరులు, సైనిక బలగాలపై ప్రయోగించిన రాకెట్లు, క్షిపణులను సరఫరా చేయడంలో సాహ్‌రియారీ పాత్ర కీలకమని ఐడీఎఫ్ తెలిపింది.కాగా, ఇజ్రాయెల్ శనివారం ఉదయం జరిపిన మరో దాడిలో ఖుద్స్ ఫోర్స్ పాలస్తీనా డివిజన్ హెచ్ సయీద్ ఇజాదీ మరణించాడు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న మమాస్ మారణహోమానికి పాల్పడడానికి ముందు ఈ ఘటనకు ప్లానింగ్, వనరుల సరఫరా వంటివి ఇజాదీ చేసినట్టు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంనాడే ఇరాన్‌కు చెందిన మరో కమాండర్ అమిన్ పౌర్ జోడకీ కూడా హతమైనట్టు పేర్కొంది. ఐఆర్‌జీసీ సెకెండ్ డ్రోన్ యూనిట్‌కు ఇతను డిప్యూటీ కమాండర్‌గా ఉన్నట్టు తెలిపింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఈ దాడులు చేపడుతోంది.

## ఇరాన్‌లో భూకంపం

- ఉత్తర ఇరాన్‌లోని సెమ్నాన్ ప్రాంతంలో 5.1 తీవ్రతతో భూకంపం
- అంతరిక్ష, క్షిపణి కేంద్రానికి సమీపంలో భూమి కంపించడంతో ఆందోళన
- ఇరాన్ అణుపరీక్ష చేపట్టిందనే ఊహాగానాలు వ్యాప్తి
- ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు

2




### గత ప్రభుత్వహయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ



2 మంత్రి పొంగులేటి

### స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



మరింత తగ్గే అవకాశం ఉందన్న మార్కెట్ నిపుణులు

### ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే.. ఏడేళ్ల జైలు-శిక్ష




2 10 లక్షల ఫైన్

### రేషన్ కార్డు కోసం లంచమడిగాడు



2 ఏసీబీ వలలో తహశీల్దార్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్!

### 27న కృష్ణా యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం



2 ఏపీ,తెలంగాణ నీటి కేటాయింపులపై నిర్ణయం

### వివాహేతర సంబంధం: ఒకరిని చెట్టుకు కట్టేసి కొట్టి చంపారు..



2 నకిరేకల్ మండలం నోముల ఘటన

## గేట్లు ఎత్తారు


- 10 గేట్లు ఎత్తివేత- శ్రీశైలానికి భారీ వరద
- కర్నాటకలో కురుస్తున్న వర్షాలకు భారీ వరద
- ఇప్పటికే నిండిపోయిన ఆల్మట్టి,నారాయణపూర్
- నిండుకుండలా మారిన జూరాల ప్రాజెక్టు
- శ్రీశైలం ప్రాజెక్టువైపు కృష్ణమ్మ పరుగులు



2

**జోగుళాంబ గద్వాల–నవభూమిబ్యూరో:** కర్ణాటక సహా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాల వల్ల కృష్ణానది జలకళను సంతరించుకుంది. వరదనీటితో పోటెత్తుతోంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. గరిష్ఠస్థాయి నీటిమట్టాన్ని అందుకుంది. దీనితో 10 గేట్లను ఎత్తివేశారు అధికారులు. వరద నీటిని దిగువకు వదులుతున్నారు. దీని ప్రభావం నంద్యాల జిల్లా శ్రీశైలం రిజర్వాయర్‌పై భారీగా పడుతోంది. శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఈ భారీ రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తోంది.మహారాష్ట్ర, కర్ణాటకల్లో కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తోన్న విషయం తెలిసిందే. దీని ప్రభావంతో అటు గోదావరి, ఇటు కృష్ణానదికి వరద పోటుకు గురయ్యాయి. భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. కృష్ణా ఉపనదులు ఘటప్రభ, మలప్రభ, భీమా, తుంగ, భద్ర సైతం పొంగిపొర్లుతున్నాయి. కర్ణాటకలోని ఉత్తర కన్నడ, బెళగావి, హావేరి, విజయపురా, బాగల్‌కోటె, కలబురగి, బళ్లారి.. వంటి జిల్లాల్లో అతి భారీగా వర్షాలు కురిశాయి. ఆయా ప్రాంతాలన్నీ కూడా కృష్ణా బేసిన్ పరిధిలోకి వచ్చేవే. అటు మహారాష్ట్రలోనూ కృష్ణా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షాలు పడుతున్నాయి. ఫలితంగా కృష్ణానది ఉరకలేస్తోంది. కర్ణాటకలో దీనిపై నిర్మించిన ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఆలమట్టి, నారాయణ్‌పూర్ ప్రాజెక్టులు గరిష్ఠ నీటి

## కౌశిక్‌రెడ్డి అరెస్ట్



**షరతులతో బెయిల్ మంజూరు**
**నేడు విడుదలయ్యే అవకాశం**

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట: బెయిల్ మంజూరు
- క్వారీ యజమానిని బెదిరించారన్న కేసులో అరెస్ట్
- కౌశిక్ రెడ్డి రిమాండ్‌ను తిరస్కరించిన న్యాయస్థానం
- 41ఏ నోటీసు ఇవ్వలేదని న్యాయవాది వాదన
- వరంగల్‌లో కాజీపేట కోర్టులో బెయిల్ మంజూరు

2

**కాజీపేట–నవభూమి:** హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. ఒక క్వారీ యజమానిని బెదిరించారన్న ఆరోపణలతో అరెస్టయిన ఆయనకు న్యాయస్థానం శనివారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. పోలీసులు ఆయన రిమాండ్ కోరగా, కోర్టు దానిని తిరస్కరించడం గమనార్హం.వివరాల్లోకి వెళితే, ఒక క్వారీ యజమాని పట్ల బెదిరింపులకు

## జగన్ వాహనం ఢీకొనడం వల్లే సింగయ్య మృతి

- కీలక మలుపు తిరిగిన వైసీపీ కార్యకర్త మృతి
- సత్తెనపల్లి జగన్ పర్యటనలో అపశృతి
- జగన్ కాన్వాయ్ ఢీకొని ఓ కార్యకర్త మృతి
- జగన్ వాహనం ఢీకొనే కార్యకర్త సింగయ్య మృతి చెందినట్లు వీడియోలను బయటపెట్టిన పోలీసులు

2



**గుంటూరు–నవభూమిబ్యూరో:** మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా వాహనం ఢీకొని సింగయ్య అనే కార్యకర్త మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. తాజా వీడియోల్లో ఆసక్తికర విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. జగన్ రెడ్డి వాహనం ఢీకొనే సింగయ్య మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు.ఏటూకురు బైపాస్ వద్ద జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని సింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ఈ ప్రమాద సమయంలో వీడియోలో కనిపిస్తున్న వారి నుంచి పోలీసులు సమాచారం సేకరిస్తున్నారు. జగన్ పర్యటన రోజు సింగయ్యను ఢీకొన్న వాహనాన్ని ఎస్పీ నంబర్‌తో సహా చెప్పినట్లు తెలుస్తోంది.

## తగ్గనున్న ఎంపీటీసీ స్థానాలు

- స్థానిక సంస్థల ఎన్నికలకు పీఆర్ శాఖ కసరత్తు
- 566 జెడ్పీటీసీ,ఎంపీపీ స్థానాల్లో ఎన్నికలు
- రిజర్వేషన్ల ఖరారుపైనే అధికారుల దృష్టి
- కొత్త మున్సిపాల్టీల ఏర్పాటు,కార్పొరేషన్ల సమీప గ్రామాల విలీనంతో తగ్గిన ఎంపీటీసీ సభ్యుల సంఖ్య

2

**హైదరాబాద్–నవభూమిబ్యూరో**
రాష్ట్రంలోని 566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు పంచాయతీ రాజ్ శాఖ తుది జాబితా ఖరారు చేసింది. ఎన్నికల నిర్వహణ, రిజర్వే షన్ల అమలుకు అవసరమైన కసరత్తులో భాగంగా ఈ ప్రక్రియకు తుది రూపు ఇచ్చే పనిలో ఆ శాఖ సిద్ధమైంది. వీటితో పాటు ఎంపీటీసీల స్థానాల సంఖ్య సైతం ఫైనల్ చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటి వరకు తెలంగాణలో 5,817 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య తగ్గుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం, కార్పొరేషన్ సమీపంలోని గ్రామాలను వాటిలో విలీనం చేయడం, మేడ్చల్ జిల్లా మొత్తాన్ని అర్బన్ ప్రాంతంగా మార్చడం, ఔటర్ రింగ్ రోడ్డు లోపలి మండలాలన్నిం టినీ మున్సిపాలిటీలుగా మార్చడంతోఎంపీటీసీ సభ్యుల సంఖ్య తగ్గనుందని పేర్కొంటున్నారు.
566 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు: 2019లో 32 జిల్లా పరిషత్ చైర్మన్లు, 539 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సారి 31 జిల్లా పరిషత్, 566

## పాక్ గొంతు ఎండేలా చేస్తాం


- సింధూ నదీ జలాలను రాజస్థాన్‌కు మళ్లిస్తాం
- సింధూ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తి లేదు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ



**న్యూఢిల్లీ–నవభూమిబ్యూరో:** పాకిస్థాన్‌కు భారత్ నుంచి ప్రవహించే నీటిని నిలిపివేసి, ఆ నీటిని రాజస్థాన్‌కు మళ్లించడం ద్వారా పాక్ గొంతు ఎండేలా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తిరిగి పునరుద్ధరించే ప్రసక్తి లేదని ఆయన తేల్చి చెప్పారు. పాకిస్థాన్.. భారత దేశ శాంతి భద్రతలను, అభివృద్ధిని నిరంతరం నాశనం చేసేందుకు ప్రయత్నించడం వల్లే ఈ ఒప్పందాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. ఇటీవల కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు మరోసారి గుర్తు చేశారు.ముఖ్యంగా మీడియాతో మాట్లాడిన అమిత్ షా.. అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేమని, కానీ వాటిని నిలిపి

## చెవిరెడ్డికి అస్వస్థత

- తీవ్ర అస్వస్థతకు గురైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి
- విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో చికిత్సలు
- చికిత్సల అనంతరం జిల్లా జైలుకు తరలింపు
- మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి



**విజయవాడ–నవభూమి బ్యూరో:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన ఆయన జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే శనివారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్ప డంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుగా జైలులో ఉన్న వైద్యులతో పరీక్షలు చేయించారు. ఆపై ముందస్తు జాగ్రత్తగా ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోథెరపీలో మాజీ ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహించారు డాక్టర్లు. వైద్య పరీక్షలు పూర్తి అయ్యాయి. సాయంత్రం వరకు వైద్యుల పర్యవేక్షణలోనే మాజీ ఎమ్మెల్యే


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | ఆదివారం | 22 । జూన్ । 2025

# యోగా డేలో తొక్కిసలాట.. స్పృహకోల్పోయిన యువతి



**హైదరాబాద్-నవభూమి:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన యోగా డే వేడుకల్లో స్వల్ప తోపులాట జరిగింది. గేట్ నెంబర్ 2 వద్ద బ్రేక్ ఫాస్ట్ పంపిణీ చేస్తుండగా ఒకరినొకరు తోసుకున్నారు. ఈ ఘటనలో ఓ యువతి స్పృహకోల్పోయింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. యువతిని హుటాహుటిన అంబులెన్స్‌లో కొండాపూర్ ఏరియా హాస్పటల్‌కు తరలించారు. యువతికి చికిత్స అందజేసిన వైద్యులు.. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. యువతి గాంధీ హాస్పిటల్ మెడికల్ కాలేజ్ నర్సింగ్ విద్యార్థినిగా గుర్తించారు.యోగా డే సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో యోగా దినోత్సవ వేడుకల కోసం పెద్ద సంఖ్యలో నగర ప్రజలు హాజరయ్యారు. యోగా పూర్తి చేసిన తర్వాత గేట్ నెంబర్ 2 వద్ద బ్రేక్ ఫాస్ట్ పంపిణీ కోసం స్టాల్స్ ఏర్పాటు చేశారు. అల్పాహారం పంపిణీ చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా ప్రజలు గేట్ నెంబర్ 2కు వెళ్లడంతో తోపులాట, తొక్కిసలాట జరిగింది. ఈ తోపులాటలో గాంధీ ఆస్పత్రి మెడికల్ కాలేజ్ నర్సింగ్ విద్యార్థిని స్పృహ కోల్పోయి కింద పడిపోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. యువతి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే అనుకున్న దాని కంటే ఎక్కువ మంది రావడం వల్లే తొక్కిసలాట జరిగిందని పోలీసులు స్పష్టం చేశారు.

## నవ వార్త



# నీటి రక్షణకు కుట్టి రోబోలు



**హైదరాబాద్-నవభూమి:** నీటి వనరుల నిర్వహణ అంశంలో ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య లీకేజీ.. కిలోమీటర్ల మేర భూగర్భంలో విస్తరించి ఉండే పైపులైన్లలో నీళ్లు ఎక్కడ లీకవుతున్నాయి ? అనేది గుర్తించడం, మరమ్మతులు నిర్వహించడం చాలా పెద్ద పని. ఈ పని కోసం పెద్ద ఎత్తున మానవ వనరులతోపాటు యంత్రాలను వాడాల్సి ఉంటుంది. కొన్ని సార్లు రహదారులను మూసేసి అనుమానిత ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టాల్సి వస్తుంది. భారీ ఖర్చుతో కూడుకున్న ఈ పనులు పూర్తవ్వడానికి ఒక్కోసారి రోజులు, వారాలు కూడా పడతాయి. ఈ క్రమంలో వేల లీటర్ల నీళ్లు వృథా అవుతుంటాయి. పోనీ ఇంత శ్రమించినా సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందా ? అంటే గ్యారంటీ లేదు. వీటన్నింటికీ చెక్ పెట్టేలా.. లీకేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా.. ఇంగ్లండ్‌లోని షెఫీల్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్, ఏరోస్పేస్, సివిల్ ఇంజనీర్లు బర్మింగ్‌హమ్, బ్రిస్టల్, లీడ్స్ విశ్వవిద్యాలయాల పరిశోధకులతో కలిసి అద్భుతమైన ఆవిష్కరణ చేశారు.రజనీకాంత్ నటించిన రోబో 2.0 సినిమాలో చిట్టి సృష్టించిన 'కుట్టి' మాదిరిగా 'పైప్‌బాట్స్' పేరిట చిట్టిచిట్టి రోబోలను తయారు చేశారు. 40 మిల్లీమీటర్ల వెడల్పు మాత్రమే ఉండే ఈ పైప్‌బాట్స్ చూడడానికి బొమ్మ కారులా ఉంటాయి. ధ్వని తరంగాలను కచ్చితంగా గుర్తించేందుకు వినియోగించే అత్యాధునిక అకుస్టిక్ సెన్సార్లు, కెమెరాలు చిన్నచిన్నవి ఈ పైప్‌బాట్స్‌కు అమర్చబడి ఉంటాయి. పైప్‌బాట్‌లను ఏదైనా పైప్‌లైన్‌లోకి పంపిస్తే... అంతా గాలించి లీకేజీలను గుర్తించి.. పైన ఉన్న ఇంజనీర్లకు సమాచారం ఇవ్వడమే కాక... మరమ్మతు పనులు కూడా పూర్తి చేసేస్తాయి. అంతేనా.. నిర్దేశిత దూరంలో ఉన్న మరో పైప్‌బాట్‌తో సమాచారాన్ని పంచుకుని కలిసి పనిని పూర్తి చేసే సామర్థ్యం కూడా ఈ పైప్‌బాట్స్ సొంతం. ఈ పైప్‌బాట్స్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తే డబ్బు, సమయంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల లీటర్ల నీరు ఆదా అవుతాయి. ఈ పైప్‌బాట్స్‌ను మంచినీటి పైప్‌లైన్లలోనే కాక గ్యాస్ పైప్‌లైన్లు, డ్రైనేజీ పైపులు, మనుషులు చేరుకోలేని ప్రమాదకర ప్రాంతాలకు కూడా పంపి పని చేయించుకోవచ్చునని యూకే ఇంజనీర్లు చెబుతున్నారు.

ఇకపై ఏటా 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఇక నుంచి ఏడాదికి 500 మందికి అవకాశం కల్పించనున్నారు. అందుకు సంబంధించిన ఫైలుపై తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, గిరిజన అభివృద్ధి, దివ్యాంగుల, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ తొలి సంతకం చేశారు.

# ఇకపై ఏటా 500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విదేశీ విద్య



**హైదరాబాద్-నవభూమి:** అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఇక నుంచి ఏడాదికి 500 మందికి అవకాశం కల్పించనున్నారు. అందుకు సంబంధించిన ఫైలుపై తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, గిరిజన అభివృద్ధి, దివ్యాంగుల, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ తొలి సంతకం చేశారు. సచివాలయంలో 2వ అంతస్తులోని తన చాంబర్‌లో మంత్రిగా శనివారం ఉదయం ఆయన బాధ్యతలను స్వీకరించారు.అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 844 మంది దివ్యాంగులకు రూ.5 కోట్లతో స్వయం ఉపాధి కల్పించే యూనిట్ల మంజూరు, అదేవిధంగా దివ్యాంగులకు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి తద్వారా 2367 మందికి 3.50 కోట్లను పంపిణీ చేసే ఫైలుపై సంతకం చేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్ ద్వారా ఇప్పటివరకు ఏటా 210 మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నతవిద్యా అభ్యాసానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యను 500 లకు పెంచారు.అందుకు సంబంధించిన ఫైలుపై కూడా మంత్రి సంతకం చేశారు. అదేవిధంగా మేడారం జాతరలో ఏర్పాట్లకు సంబంధించిన రూ.45 కోట్ల పనులకు, రూ.79.61 కోట్లతో గిరిజన విద్యాలయాల మరమ్మతు పనులకు, మినీ గురుకులాల నిర్వహణకు 17.18 కోట్లను, అదేవిధంగా ఐఐటీ, నీట్‌లో ర్యాంకులను సాధించిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించేందుకు ఆమోదం తెలిపారు. అనుమతులు మంజూరు చేశారు.బాధ్యతలను స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, సంజయ్‌కుమార్, ధర్మపురి నియోజకవర్గ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

# వివాహేతర సంబంధం... చెట్టుకు కట్టేసి చితక్కొట్టిన చంపారు

**నల్గొండ-నవభూమి:** నకిరేకల్ మండలం నోముల గ్రామంలో నిన్న దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం నెపంతో ఓ వ్యక్తిని అమానుషంగా హింసించి హత్య చేసిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనకర వాతావరణం నెలకొంది. నోముల గ్రామానికి చెందిన నర్సింగ్ జానయ్య (34) అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో గత కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంపై గతంలో జానయ్యపై పోలీసు కేసు కూడా నమోదైందని సమాచారం. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలుస్తోంది.ఈ క్రమంలో, నిన్న జానయ్యను అదే గ్రామానికి చెందిన నాగరాజు, ధనలక్ష్మి అనే ఇద్దరు వ్యక్తులు అడ్డగించి, ఓ చెట్టుకు కట్టేశారు. అనంతరం కళ్లల్లో కారం చల్లి, మర్మాంగాలపై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. రక్తం కారుతూ, స్పృహ కోల్పోయేవరకు జానయ్యను చితకబాదారని వారు కన్నీరుమున్నీరవుతు న్నారు. విషయం తెలుసుకున్న జానయ్య బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని, చెట్టుకు కట్టేసి ఉన్న అతడిని విడిపించారు. వెంటనే 108 అంబులెన్సులో నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు, జానయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నల్గొండ జిల్లా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అయితే, నల్గొండకు తీసుకెళు తుండగా మార్గమధ్యలోనే జానయ్య మృతి చెందాడు.

### మందు బాబులకు దిమ్మ తిరిగే షాక్..

# మద్యం తాగితే రూ.లక్ష జరిమానా



**కామారెడ్డి-నవభూమి:** తెలంగాణలోని కొన్ని గ్రామాలు మద్యపాన నిషేధం దిశగా కఠిన చర్యలు తీసుకున్నాయి. కామారెడ్డి జిల్లాలోని కొండాపూర్, గుడి తండా, షేర్ శంకర్ తండా గ్రామస్తులు మద్యపానానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుని.. ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మినా, తాగినా లక్ష రూపాయల జరిమానాతో పాటు ఏడు చెప్పు దెబ్బలు విధిస్తారు. మద్యపానం వల్ల యువత చెడిపోతున్నారని, కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.
మద్యపానం.. సమాజాన్ని నాశనం చేసే మహమ్మారుల్లో ముందు వరుసలో ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా మద్యం బాధితులు కోట్లలో ఉన్నారు. నేడు మన సమాజంలో జరిగే అనేక నేరాలు, దారుణాలకు మద్యమే ప్రధాన కారణం. ఈ సంగతి తెలిసి కూడా ప్రభుత్వాలు మద్యపాన నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవు. మద్యం తాగడం వల్ల తామేకాక కుటుంబంలోని అందరి జీవితాలు నాశనం అవుతాయని తెలిసి కూడా చాలా మంది ఆ దురలవాటును మార్చుకోలేరు.మద్యం విషయంలో ఎవరికి వారే స్వయం నియంత్రణ కలిగి ఉండాలి. అయితే మద్యపాన నిషేధం కోసం కొన్ని సందర్భాల్లో గ్రామాలే స్వయంగా ముందుకు వచ్చి.. దీనిపై నిర్ణయం తీసుకుంటాయి. తాజాగా తెలంగాణలోని కొన్ని గ్రామాలు మద్యపాన నిషేధం నిర్ణయం తీసుకున్నాయి. నియమాలను ఉల్లంఘించి ఎవరైనా మందు తాగితే వారికి 7 చెప్పుదెబ్బలతో పాటుగా లక్ష రూపాయలు జరిమానా విధించాలని నిర్ణయించుకున్నారు ఆయా గ్రామాలప ప్రజలు. ఆ వివరాలు..మద్యపాన నిషేధం కోసం నిజామాబాద్‌లోని కొన్ని గ్రామాలు కఠినమైన నిర్ణయాలు తీసుకుని మిగితా ఊర్లకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆ వివరాలు.. కామారెడ్డి జిల్లా, రాజంపేట్ మండలంలోని కొండాపూర్, గుడి తండా, షేర్ శంకర్ తండా గ్రామస్తులు తమ ఊర్లలో మద్యపానంపై నిషేధం విధించారు. ఇది తెలిసి.. ఈ గ్రామాలను ఆదర్శంగా తీసుకుని.. చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాలు కూడా తమ ఊర్లలో మద్యపాన నిషేధాన్ని విధించాయి.ఈక్రమంలో ఆయా గ్రామాల పజలు.. ఊర్లో ఒక చోట సమావేశమై మద్యపాన నిషేధంపై చర్చించుకున్నారు. తమ గ్రామాల్లో పూర్తి స్థాయిలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని భావించారు. దీనిలో భాగంగా గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మితే లక్ష రూపాయల జరిమానాతో పాటుగా ఏడు చెప్పు దెబ్బలు విధిస్తామని గ్రామ పెద్దలు ప్రకటించారు. అంతేకాకుండా ఊరి ప్రజలు ఎవరైనా మద్యం పట్టిస్తే.. వారికి రూ. 20 వేలు బహుమతిగా అందిస్తామని తీర్మానించారు.ఇక ఈ నియమాలను ఉల్లంఘించి ఎవరైనా దొంగచాటుగా మద్యం కొని తాగితే ఏడు చెప్పు దెబ్బలు ఉంటాయని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. మద్యపానం వల్ల యువత చెడిపోతున్నారు. మందు తాగడం కోసం భారీగా అప్పులు చేసి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. మద్యపానం వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.వీటన్నింటిని పరిశీలించిన తర్వాతే.. మాగ్రామాల్లో మద్యపాన నిషేధ నిర్ణయం తీసుకున్నాము. దీన్ని పటిష్టంగా అమలు చేసేందుకు గ్రామానికి ఇద్దరి చొప్పున తీసుకొని కమిటీని ఏర్పాటు చేసినట్లుగా వారు వెల్లడించారు. గ్రామాల సరిహద్దుల్లో మద్యం సేవించిన వారికి కూడా శిక్షలు విధిస్తామని తెలిపారు.

# సొంతిల్లులేని వారికి తీపి కబురు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో గత ప్రభుత్వం చేపట్టి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న 69 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులే స్వయంగా పూర్తి చేసుకునేలా రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. గత ప్రభుత్వం అరకొరగా పూర్తిచేసిన ఇళ్లకు కనీస వసతులు కల్పించేందుకు తమ ప్రభుత్వం అదనంగా రూ. 640 కోట్లు ఖర్చు చేసిందని ఆయన తెలిపారు. ఇప్పటికే 98 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించామని, మిగిలినవి కూడా త్వరలో అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. దీనికి తోడు, అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల గృహాల పంపిణీలో కూడా కదలిక వచ్చింది. ఇటీవల పెద్దపల్లి పట్టణ సమీపంలోని చందపల్లిలో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పగించారు. మిగతా ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో చేపట్టి, వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వచ్చే ఆగస్టులోగా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.ఆగస్టులోగా రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిధుల సమస్యతో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు, ప్రస్తుతం నిధులు అందుబాటులో ఉన్నందున వేగం పుంజుకోనున్నాయి. అంతర్గత పనులకు వర్షాలు కురిసినా పెద్దగా ఆటంకం ఉండదని అధికారులు భావిస్తున్నారు. మరో రెండు నెలలు గడువు ఉండటంతో ఈలోగా పనులను పూర్తి చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించి వదిలేసిన రెండు పడక గదుల ఇళ్లకు ఇందిరమ్మ పథకంలో రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గ్రామాల్లో గుంట భూమి సైతం లేని నిరుపేదలను గుర్తించి లాటరీలో ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

# గత ప్రభుత్వహయాంలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ

- రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- 3 విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 10,725 రెవెన్యూ సదస్సులు
- మొత్తంగా 8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 67 వేల వినతులు
- దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్-నవభూమి:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, దానిని ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో శనివారం ఆయన హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఏప్రిల్ 14న 'భూ భారతి' చట్టాన్ని ఆవిష్కరించారని, ఈ చట్టాన్ని దశలవారీగా అమల్లోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మూడు విడతల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వివరించారు.
మొదటి విడత ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టగా, రెండో విడతలో మే 5 నుంచి 28 వరకు 28 మండలాల్లో, మూడో విడతలో జూన్ 3 నుంచి 20 వరకు మిగిలిన ప్రాంతాల్లో సదస్సులు విజయవంతంగా పూర్తి చేశామన్నారు.
ఈ మూడు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులను నిర్వహించామని, వీటి ద్వారా ప్రజల నుంచి 8.58 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రి వెల్లడించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేల దరఖాస్తులు రాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్గొండ జిల్లాలో 42 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ఒకరోజు ముందే ఆయా గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉచితంగా దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశామని మంత్రి తెలిపారు. ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వెళ్లి ఎలాంటి రుసుము తీసుకోకుండా దరఖాస్తులు స్వీకరించారని వివరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు కూడా అందజేశామన్నారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తుల్లో 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

# ఏసీబీ వలలో తహశీల్దార్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్!



**బూర్గంపహాడ్-నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు.వివరాల్లోకి వెళితే, బూర్గంపహాడ్ మండల తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరే టర్‌గా పనిచేస్తున్న చిట్టెంశెట్టి నవక్రాంత్, ఒక వ్యక్తి బంధువుకు సంబంధించిన రేషన్ కార్డు దరఖాస్తును ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి, కొత్త కార్డు జారీ కోసం ఉన్నతాధికారు లకు పం పించేందుకు సహాయం చేస్తానని నమ్మబలికాడు. ఈ పని చేసిపెట్ట డానికి రూ.2,500 లంచం డిమాండ్ చేశాడు.బాధితుడు ఈ విషయాన్ని తెలంగాణ ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాడు. వారి సూచన మేరకు, నవక్రాంత్‌కు రూ. 2,500 ఇస్తుండ గా ఏసీబీ అధికారు లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు నవక్రాంత్ తరచూ రేషన్ కార్డు దరఖాస్తుదారుల నుంచి డిజిటల్ చెల్లిం పుల రూపంలో కూడా లంచాలు స్వీకరిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని ఏసీబీ అధికారులు తెలిపారు.

# 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

**న్యూఢిల్లీ-నవభూమి:** తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఒక కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 27వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఖరీఫ్ సీజన్ అవసరాల నిమిత్తం నీటి విడుదలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుత సంవత్సరంలో ఇరు రాష్ట్రాల వాటాలు, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు పోను సాగునీటికి ఎంత కేటాయించాలనే అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చించనున్నారు.ఈ మేరకు కేఆర్ఎంబీ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చింది.

# 'యోగాంధ్ర'కు గిన్నిస్ రికార్డు

(1వపేజీ తరువాయి)యోగాసనాలు, యోగముద్రలు వేశారు. ఉదయం 5 గంటల నుంచే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం సహా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ప్రజలు విశాఖ తీరానికి చేరుకున్నారు. తమకు కేటాయించిన స్థలంలో ఆసీనులై ఉత్సాహంగా ఎదురుచూశారు.

**'యోగాంధ్ర' గిన్నిస రికార్డు - ప్రధాని మోదీ సమక్షంలో ఘనత**

విశాఖ వేదికగా 3 లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొన్న యోగంధ్ర కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో పాగా వేసింది. ఇదే అంశంలో 2023లో సూరత్ యోగా నెలకొల్పిన రికార్డును విశాఖ యోగాంధ్ర బద్ధలుకొట్టింది. గతంలో సూరత్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో లక్షా 47 వేల మంది పాల్గొనగా, 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి వేదికైన విశాఖలో 3 లక్షల వెయ్యి మంది భాగస్వాములయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో యోగాంధ్ర ఈ గిన్నిస్ రికార్డును ఘనత సాధించింది.

**మనంగా మారుతుంది :** మనిషి ఈ విశ్వంలో ఒంటరి కాదని, ప్రకృతిలో భాగస్వామి అన్న విషయాన్ని యోగా గుర్తుచేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యోగా ద్వారా "నేను" అన్న భావన "మనం"గా మారుతుందన్నారు. ఈ భావన సామాజిక హితానికి దోహదపడుతుందని భారత సంస్కృతి కూడా ఇదే విషయాన్ని సమర్థిస్తుందని పేర్కొన్నారు.

# ఇరాన్‌లో భూకంపం..

**టెహ్రాన్-నవభూమి:** ఇరాన్‌లో శుక్రవారం సంభవించిన భూకంపం పలు అనుమానాలకు దారితీసింది. దేశం అణుపరీక్ష నిర్వహించి ఉండవచ్చనే ఊహాగానాలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే, భూకంప శాస్త్రవేత్తలు ఈ వాదనలను తోసిపుచ్చారు, ఇది సహజ భూకంపమేనని స్పష్టం చేశారు.జూన్ 20న ఉత్తర ఇరాన్‌లోని సెమ్నాన్ ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 5.1 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం సంభవించింది. ఈ ప్రకంపనలు సెమ్నాన్ నగరానికి నైరుతి దిశలో 27 కిలోమీటర్ల దూరంలో, భూమికి 10 కిలోమీటర్ల లోతున కేంద్రీకృతమైనట్లు తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.ఈ భూకంపం సంభవించిన ప్రాంతానికి సమీపంలో ఇరాన్ సైన్యం నిర్వహిస్తున్న సెమ్నాన్ అంతరిక్ష కేంద్రం, సెమ్నాన్ క్షిపణి సముదాయం ఉండటంతో, ఇరాన్ రహస్యంగా అణ్వాయుధ పరీక్ష చేపట్టి ఉండవచ్చనే అనుమానాలు బలపడ్డాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. శనివారం తెల్లవారుజామున కూడా ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇటువంటి ఉద్రిక్త పరిస్థితుల్లో తమ అణు కార్యక్రమంపై ఎలాంటి చర్చలకు తావులేదని ఇరాన్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ భూకంపం రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.
అయితే, ఈ భూకంపం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, కేవలం స్వల్ప నష్టం మాత్రమే వాటిల్లిందని ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ ప్రకటించింది.భూగర్భంలో అణు కార్యకలాపాలు నిర్వహించినప్పుడు జరిగే విస్ఫోటనాలు, సమీపంలోని టెక్టోనిక్ ఒత్తిడిని విడుదల చేయడం ద్వారా కొన్నిసార్లు భూకంపాలను ప్రేరేపించగలవు. అయినప్పటికీ, భూకంప తరంగాలను (సీస్మిక్ వేవ్స్) విశ్లేషించడం ద్వారా, అది సహజ భూకంపమా లేక కృత్రిమ విస్ఫోటనమా అనేది భూకంప శాస్త్రవేత్తలు తేల్చగలరు. తాజా భూకంపంపై అందిన భూకంప సమాచారం (సీస్మిక్ డేటా) విశ్లేషణ ప్రకారం, ఇది సహజ ప్రక్రియ వల్ల సంభవించిన భూకంపమేనని తెలుస్తోంది.

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్

(1వపేజీ తరువాయి)పాల్పడ్డారనే ఆరోపణలపై పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసు కున్నారు. అరెస్టు అనంతరం, వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత కౌశిక్‌రెడ్డిని కాజీపేట రైల్వే కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయస్థానంలో విచారణ సందర్భంగా, కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది తమ వాదనలు వినిపించారు. అరెస్టుకు ముందు పోలీసులు చట్టప్రకారం 41ఏ నోటీసులు జారీ చేయలేదని, నిబంధనలకు విరుద్ధంగా అరెస్టు చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి, కౌశిక్ రెడ్డి రిమాండ్‌ను తిరస్కరిస్తూ, కొన్ని షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# చెవిరెడ్డికి అస్వస్థత

(1వపేజీ తరువాయి)ఉండనున్నారు. అయితే ప్రాణాపాయం ఏమీ లేదని.. సాయంత్రం వరకు పర్యవేక్షణలో ఉంచి మందులు ఇచ్చి పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఈరోజు సాయంత్రానికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అధికారులు జిల్లా జైలుకు తరలించనున్నారు. ఇక ఈ కేసుకు సంబంధించి శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేశారు. చెవిరెడ్డిని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.
మరోవైపు అదే సమయంలో చెవిరెడ్డి తరఫు న్యాయవాదులు కూడా బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ వేశారు. అలాగే తనకు జైలు భోజనం పడటం లేదని ఇంటి నుంచి తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటికి సంబంధించి సోమవారం (ఈనెల 23) విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు రానుంది.

# తగ్గనున్న ఎంపీటీసీ స్థానాలు

(1వపేజీ తరువాయి)జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎలక్షన్స్. జరగనున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 33 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా నిజామాబాద్లో 31. సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల్లో 26, కామారెడ్డిలో 25 స్థానాలు ఉన్నాయి. అతి తక్కువగా పంచా యతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రాతినిధ్యం' వహిస్తోన్న ములుగు జిల్లాలో కేవలం 10. జెడ్పీటీసీ స్థానాలే ఉన్నాయి.

# పాక్ గొంతు ఎండేలా చేస్తాం

(1వపేజీ తరువాయి)వేసే హక్కు తమకు ఉందని చెప్పారు. ఆ హక్కును ఉపయోగించుకునే సింధూ నదీ జాలల ఒప్పందాన్ని రద్దు చేసినట్లు వివరించారు. "ఇకపై నీళ్లు రాజస్థాన్‌కు వెళ్తాయి. భారతదేశానికి రావాల్సిన నీటిని మేము ఉపయోగిస్తాము. పాకిస్థాన్ అన్యాయంగా పొందుతున్న నీటిని ఆపేస్తాము" అని ఆయన ఉద్ఘాటించారు. ముఖ్యంగా ఓ కాలువను నిర్మించి మరీ పాక్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తామని చెప్పారు. అలా పాక్‌కు చుక్క కూడా నీరు వెళ్లనీయకుండా.. దాయాది దేశాన్ని ఎండేలా చేస్తామన్నారు. అలాగే కాశ్మీర్‌లో శాంతిని భగ్నం చేయడానికి పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని ఆయన తీవ్రంగా ఖండించారు.భవిష్యత్తులో జరిగే ఏదైనా ఉగ్రదాడిని యుద్ధంగా పరిగణిస్తామని అమిత్ షా హెచ్చరించారు. "మోదీ పదే పదే చెప్పారు, దీని గురించి ఎటువంటి సందేహం ఉండకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. పౌరులకు నష్టం కలిగించకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేశాయన్నారు.

## నినాదాలు ఇచ్చే కళలో ప్రధాని మోదీ మాస్టర్ డిగ్రీ చేశారు.. కానీ..!



న్యూఢిల్లీ–నవభూమి:ప్రధానినరేంద్రమోదీ నినాదాలు ఇచ్చే కళలో మాస్టర్ డిగ్రీ చేశారని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రధాని తీసుకొచ్చిన 'మేకిన్ ఇండియా కార్యక్రమంపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మేకిన్ ఇండియా గురించి ప్రధాని మోదీ గొప్పలు చెప్పారని, దేశంలోని తయారీరంగంపై దాని ప్రభావం పెద్దగా కనిపించడం లేదని అన్నారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. మేకిన్ ఇండియాతో దేశంలో తయారీరంగ పరిశ్రమ కొత్తపుంతలు తొక్కుతోందని ప్రధాని హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు తయారీ రంగంలో తిరోగమన అభివృద్ధి కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. మేకిన్ ఇండియా ప్రభావం ఉంటే తయారీరంగ పరిశ్రమ రికార్డు స్థాయిలో ఎందుకు పడిపోయిందని, నిరుద్యోగ యువత సంఖ్య భారీగా ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు.ప్రస్తుతం తయారీరంగ పరిశ్రమ వాటా దేశ ఆర్థికవ్యవస్థలో 14 శాతానికి పడిపోయిందని రాహుల్‌గాంధీ చెప్పారు. ఇది రికార్డు స్థాయి పతనమని, 2014 తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీరంగం వాటా ఇంతగా పడిపోవడం ఇదే తొలిసారని అన్నారు. అంతేగాక చైనా నుంచి భారత్‌కు దిగుమతులు రెండింతలు పెరిగాయని తెలిపారు. ప్రధాని మోదీ నినాదాలు ఇచ్చే కళలో మాస్టర్ డిగ్రీ చేశారు కానీ.. సమస్యల పరిష్కారంలో మాత్రం వెనుకబడ్డారని రాహుల్‌గాంధీ విమర్శించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
ఆదివారం
22 । జూన్ । 2025

## చరిత్రలో నాటిన విత్తనాలు.. ఈరోజు ఉక్రెయిన్ రక్తరేఖలు

ఉక్రెయిన్‌పై రష్యా దాడి కేవలం భౌగోళిక విస్తరణ కోసం మాత్రమే కాదు. ఇది శతాబ్దాల చరిత్ర, సామ్రాజ్యవాదపు మిగులు, నాటో విస్తరణ భయాలు, మరియు జాతి గుర్తింపు కోసం ఉక్రెయిన్ చేస్తున్న పోరాటం నడుమ జరిగిన ఓ భారీ సాయుధ సంఘర్షణ. సోవియట్ కాలంలో నుంచీ అణచివేతకు గురైన ఉక్రెయిన్ ం ఇప్పుడు తన స్వతంత్రతను, భవిష్యత్తును నిలబెట్టుకునే కృషిలో ఉంది. ఈ పోరాటం వెనుక చరిత్ర ఎంత లోతుగా ఉందో తెలుసుకోవాల్సిన సమయం ఇది.

2022, ఫిబ్రవరి 24 ఈ తేదీ ప్రపంచ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. అదే రోజు రష్యా ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి సైనిక దాడి ప్రారంభించింది. కానీ ఈ యుద్ధం నిజంగా ఆ రోజే మొదలైంది కాదు. దాని ముళ్లు శతాబ్దాల చరిత్రలోనే నాటబడ్డాయి. ఉక్రెయిన్–రష్యా సంబంధాల చరిత్రను చూస్తే ఈ ఘర్షణ ఒక ప్రమాదకరమైన అనివార్యతలా కనిపిస్తుంది. ఈ వ్యాసం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి వెనుక ఉన్న చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాన్ని త్రవ్వి బయటపెడుతుంది.

18వ శతాబ్దంలో ఉక్రెయిన్ రష్యా సామ్రాజ్యంలో భాగమైంది. అప్పటినుంచి ఉక్రెయిన్‌పై రష్యా విధానాలు దమనకారకంగా మారాయి. ఉక్రెయిన్ భాష, సంస్కృతి అణచివేయబడింది. 1917లో స్వల్పకాలిక స్వాతంత్ర్యం వచ్చినా, 1920 నాటికి సోవియట్ యూనియన్‌లో బలవంతంగా విలీనమైంది. స్టాలిన్ హయాంలో ఈ నిరంకుశత మరింత పెరిగింది. 1932%–%33లో జరిగిన 'హెూలోడోమోర్' అనే కృత్రిమ కరువు ఉక్రెయిన్ చరిత్రలో అత్యంత దారుణమైన ఘట్టంగా నిలిచింది. కోట్లాది మంది ఆకలితో మృతి చెందారు. సోవియట్ వ్యవస్థ తాలూకు సమిష్టి వ్యవసాయ విధానాలు, భయానకమైన ధాన్య సేకరణలు, ప్రజల ఆకలితో ప్రాణాలు కోల్పోవడాన్ని చైతన్యంగా అణచివేతకు హథంగా వినియోగించడాన్ని చరిత్ర మరిచిపోలేదు. 1991లో సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ఉక్రెయిన్ మళ్లీ స్వతంత్ర దేశంగా అవతరించింది. కానీ ఆ తర్వాత కూడా ఉక్రెయిన్–రష్యాల మధ్య సంబంధాలు ప్రశాంతంగా సాగలేదు. సరిహద్దు వివాదాలు, ఇంధన రాజకీయాలు, భాషా ప్రాధాన్యత వంటి అంశాలు కొనసాగుతూనే వచ్చాయి. 2014లో రష్యా క్రిమియాను ఆక్రమించడం, తూర్పు ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్, లుహాన్స్క్ ప్రాంతాల్లో రష్యా మద్దతుతో వేర్పాటువాద ఉద్యమాల ఎదుగుదల ఈ ఉద్రిక్తతకు ఆరంభ సంకేతాలు. ఉక్రెయిన్ యూరోపియన్ యూనియన్, నాటో వైపు మొగ్గుచూపడంతో మాస్కో తీవ్రంగా స్పందించింది. వ్లాదిమిర్ పుతిన్ 2022 ఫిబ్రవరి 21న ఉక్రెయిన్‌ను 'సార్వభౌమ దేశంగా గుర్తించబోమని' ప్రకటించారు. సోవియట్ యూనియన్ సృష్టి మాత్రమేనని పేర్కొన్నారు. మూడు రోజుల్లోనే ఆయన 'ప్రత్యేక సైనిక చర్య' పేరుతో యుద్ధాన్ని ప్రారంభించారు. రష్యా దాడి బెలారస్, క్రిమియా, తూర్పు సరిహద్దుల నుంచి ఒకేసారి పలు నగరాలపై దాడులతో సాగింది. పుతిన్ దృష్టిలో ఉక్రెయిన్ నాటోలో చేరడం అంటే రష్యా భద్రతకు ముప్పు. ఇది జియోపాలిటికల్ వ్యూహాన్ని నిలబెట్టుకోవడం కోసం చేస్తున్న దాడిగా ఆయన పేర్కొంటున్నారు. అన్నే యాపిల్బామ్, రాబర్ట్ కాన్క్వెస్ట్ వంటి చరిత్రకారుల రచనలు ఉక్రెయిన్ ప్రజల మానసిక పరిణతిని బయటపెడతాయి. వాళ్లకు ఆకలితో చావు, భయంతో జీవితం అలవాటు అయింది. కానీ హింస అనుభవించిన వారు తమ స్వాతంత్ర్యం కోసం ఎంతగా పోరాడతారో ప్రపంచానికి చరిత్రే నిదర్శనం. ఈ యుద్ధం లక్షల మందిని నిరాశ్రయులను చేసింది. వేలాది ప్రాణాలు బలయ్యాయి. కానీ ఉక్రెయిన్ ప్రజలు వెనక్కి తలవంచలేదు. మద్దతుగా నిలుస్తున్న పశ్చిమ దేశాలు నైతికంగా ఎంతో చేస్తున్నా... మిలటరీ స్థాయిలో ఈ యుద్ధం ఒక కాస్త నిశ్చల స్థితిలోనే ఉంది. పరిష్కారం ఎక్కడ? ఈ యుద్ధానికి పరిష్కారం స్థానికంగా కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా రాజకీయ శక్తుల మానసిక నిర్మాణాన్ని మార్చేంతగా ఉంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ వాదాల వెనుక ఉన్న లక్ష్యాలు, రష్యా భద్రతా ఆందోళనలు, చరిత్రలోని వేదన కలగలిపి ఈ సంఘర్షణని అంతుచిక్కని సమస్యగా మార్చాయి. ఉక్రెయిన్ నాటోలో చేరితే రష్యా మూర్ఛపడుతుందని పుతిన్ స్పష్టంగా చెప్పారు. అయితే అది దాని భద్రతా వ్యూహానికి కీలకమైతే.. ఉక్రెయిన్‌కు తన భవిష్యత్తును ఎంచుకునే హక్కు లేదన్నదేనా? సోవియట్ యుగం చీకటి చరిత్ర, హెూలోడోమోర్ వేదన, 21వ శతాబ్దపు జియోపాలిటికల్ అసమతులత ం ఇవన్నీ కలసి ఈ యుద్ధాన్ని నడిపిస్తున్నాయి. గాట్లు ఉన్న ప్రజలు, గర్వంతో నిండిన చరిత్ర ఉన్నా కూడా, రాజకీయమైన పరిష్కారం లేకుండా ఈ ఘర్షణ ముగియదు. పశ్చిమం ఒక వైపు, రష్యా మరోవైపు నిలబడ్డ ఈ శతాబ్దపు యుద్ధానికి శాంతి ఒక్క చర్చతో కాదు... చరిత్రను అర్థం చేసుకున్నపుడే వస్తుంది.

చారిత్రక దృష్టికోణం నుంచి పరిశీలిస్తే ఈ యుద్ధం ఒక లోతైన సమస్య. సోవియట్ యుగం తర్వాత ఏర్పడే రాజకీయ వ్యవస్థ ఎలా ఉండాలి, సమాజం ఎలా రూపుదిద్దుకోవాలి అనే అంశాలపై జరుగుతున్న పోరాటమిది. ప్రచ్ఛన్న యుద్ధానంతర కాలంలో ఏర్పడిన ఏకధ్రువ ప్రపంచ వ్యవస్థకు పుతిన్ విసిరిన సవాలులో భాగమే ఈ యుద్ధం. అందువల్ల, ఈ ఘర్షణకు పరిష్కారం కేవలం ఉక్రెయిన్ స్థానిక స్థాయిలో సాధ్యపడదు. అంతర్జాతీయ స్థాయిలో, విశాలమైన చట్రంలో మాత్రమే దీనికి పరిష్కారం సాధ్యమవుతుంది. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడం అనేది స్థానికం కాదు, ప్రపంచ స్థాయిలో చర్చించాల్సిన అంశం. అయితే వర్తమాన సందర్భంలో అది సాధ్యమయ్యేలా లేదు. ఉక్రెయిన్ నాటో సభ్య దేశమైతే అనివార్యంగా రష్యాకు పక్కలో బల్లెం అవుతుందనేది వాస్తవం. అటువంటి పరిస్థితిని నివారించుకోవటం రష్యాకు అత్యవసరం. అమెరికాతో పాటు ఐరోపా దేశాలన్నీ రష్యాకు వ్యతిరేకంగానే ఉన్నాయి. సోవియట్ యూనియన్ కాలంలో రష్యా పాల్పడిన చారిత్రక తప్పిదాలు దాన్ని ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ఐరోపా దేశాల అవకాశవాదంతో పాటు, రష్యా చారిత్రక తప్పిదాలు ఉక్రెయిన్‌కి శక్తినిస్తున్నాయి. జర్మన్ తాత్త్వికుడు నీషె అన్నట్లు అవకాశవాద శక్తులనుంచి వస్తున్న సహాయంతో ఉక్రెయిన్ నిలబడగలదా? ఉక్రెయిన్–రష్యా యుద్ధం పునాది చరిత్రలో ఉంది. సోవియట్ పాలన నుంచి వచ్చిన బాధలు, రాజకీయ అణచివేతలు, జాతి గుర్తింపు కోసం సాగిన పోరాటాలే నేటి నిరీక్షణగా మారాయి. ఈ సంఘర్షణకు సరళమైన పరిష్కారం లేదు. ఇది కేవలం ఒక దేశ భవిష్యత్తుకే కాదు, యూరప్ భద్రతా నిర్మాణం, ప్రపంచ శాంతి స్థిరతలకు సంబంధించిన సవాల్. శాంతికి మార్గం చరిత్రను అర్థం చేసుకోవడంలోనే ఉంది ం అదే అబద్ధాల తండ్రీ అయిన తక్కువ

# భారత్ "పచ్చ బంగారం": ఐసిపివి 25444



మనదేశం ముఖ్యంగా మన తెలంగాణ నేల అన్నం పెట్టే వ్యవసాయానికి పెట్టింది పేరు. మన రైతన్నలు పండించే పప్పు ధాన్యాలు లక్షలాది మందికి ఆహారం, బలం. కానీ, ఒక చేదు నిజాన్ని ఒప్పుకోవాలి. ప్రపంచంలోనే ఎక్కువ పప్పు ధాన్యాలు పండించే దేశం మనదే అయినా, కందిపప్పు విషయంలో మాత్రం మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం. ఏటా దాదాపు 15 లక్షల టన్నుల కందిపప్పును దిగుమతి చేసుకోవడానికి 800 మిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నాం. ఇది మన ఆహార భద్రతకు, అన్నదాతల జీవితాలకు పెద్ద సవాలు. దీనికి తోడు, రోజురోజుకీ మారిపోతున్న వాతావరణం, అకాల వర్షాలు, ఊహించని ఎండలు వ్యవసాయాన్ని మరింత గందరగోళంలో పడేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది సెమీ–అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) ఓ అద్భుతమైన కందిపప్పు వంగడాన్ని తీసుకొచ్చింది. దాని పేరే ఐసిపివి 2544. ఇది నిజంగా మన వ్యవసాయానికి ఓ కొత్త దారి చూపబోతోంది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా తీవ్రమైన వేడిని తట్టుకునే, ఫోటో–థర్మో ఇన్‌సెన్సిటివ్ కందిపప్పు రకం ఇది. అంటే, ఇది 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండే ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. అంతేకాదు, కేవలం 125 రోజుల్లోనే కోతకు వస్తుంది. ఇప్పటివరకు కొన్ని నెలలకే పరిమితమైన కందిపప్పును సంవత్సరం పొడవునా పండించే అవకాశం కలగడం ఒక పెద్ద విప్లవం అనొచ్చు.



**విజయ గాథ – ఆవిష్కరణల ప్రతిరూపం:**

ఐసిపివి 25444 అనేది సాధారణ రకం కాదు, ఇది ఓ అసాధారణ వంగడం. దీని ముఖ్య లక్షణం దాని అద్భుతమైన వేడి నిరోధకత. వేసవిలో మండుటెండల్లో కూడా దీన్ని పండించుకోవచ్చు. ఇది "ఫోటో–థర్మో ఇన్‌సెన్సిటివ్" కావడం వల్ల, పంట పెరుగుదల పగటిపూట సూర్యరశ్మి లేదా ఉష్ణోగ్రతలపై ఆధారపడదు. గతంలో కందిపప్పును కొన్ని సీజన్లలో మాత్రమే పండించడానికి ఇదే కారణం. కర్ణాటక, ఒడిశా, మన తెలంగాణలో చేసిన పరీక్షల్లో ఇది హెక్టారుకు 2 టన్నుల దిగుబడినిచ్చింది. ఇది మన దేశ వాతావరణ పరిస్థితుల్లో ఎంత బాగా పండుతుందో దీని ద్వారా అర్థమవుతుంది. ఈ అద్భుతం అనుకోకుండా జరిగింది కాదు. ఇది ఇక్రిశాట్ 2024లో రూపొందించిన "ప్రపంచంలోనే మొట్టమొదటి కందిపప్పు స్పీడ్–బ్రీడింగ్ ప్రోటోకాల్" ఫలితం. ఈ కొత్త పద్ధతి పంటల అభివృద్ధి కాలాన్ని గణనీయంగా తగ్గించింది. సాధారణంగా కొత్త వంగడాలను అభివృద్ధి చేయడానికి 15 సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు కేవలం ఐదేళ్లలోనే పూర్తి చేయొచ్చు. ఈ ప్రోటోకాల్ వల్ల శాస్త్రవేత్తలు సంవత్సరానికి నాలుగు సార్లు పంటలను పండించి, ఆధునిక జన్యు సాంకేతికతలను ఉపయోగించి విత్తన ఉత్పత్తిని, జన్యు విశ్లేషణను వేగవంతం చేస్తున్నారు. "అవసరం, సంకల్పం" ఉంటే సైన్స్ ఏమైనా సాధించగలదని ఇది నిరూపిస్తుంది.

**భవిష్యత్ ప్రణాళికలు, విస్తృత ప్రయోజనాలు:**

ఐసిపివి 25444 రాకతో మన కందిపప్పు కొరతను తీర్చడానికి, వ్యవసాయ రంగం మరింత బలంగా మారడానికి రెండు రకాల వ్యూహాలు అమలు చేయవచ్చు. ఒకటి, ఇప్పటికే ఉన్న సాగు భూముల్లో ఎక్కువ దిగుబడి కోసం ఈ కొత్త రకాన్ని ఉపయోగించడం (నిలువు విస్తరణ). రెండోది, ఇంకా పండించని భూముల్లోకి, ముఖ్యంగా వేసవి కాలంలో ఖాళీగా ఉండే భూముల్లోకి సాగును విస్తరించడం (క్షితిజ సమాంతర విస్తరణ). దీని వేడిని తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలపరిమితి రబీ (శీతాకాలం)లో వరి కోత తర్వాత మిగిలిన పొలాల్లో, సాగునీటి సౌకర్యాలున్న ఖాళీ వేసవి భూముల్లో పండించడానికి ఎంతో అనుకూలం. ముఖ్యంగా, సాగునీటి వ్యవస్థల చివర ఉండే 20 నుండి 30 లక్షల హెక్టార్ల "టెయిల్–ఎండ్ కమాండ్ ఏరియాస్" లో ఇది పెద్ద మార్పు తీసుకురాగలదు. ఈ ప్రాంతాల్లో నీటి కొరత వల్ల రెండో పంటలు సరిగా పండవు. ఇక్కడ హెక్టారుకు 1.5 నుండి 2 టన్నుల దిగుబడినిచ్చే కందిపప్పును పండించడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా గతంలో నిరుపయోగంగా ఉన్న కాలాలను కూడా లాభదాయకంగా మార్చుకోవచ్చు.

ఏడాది పొడవునా కందిపప్పు పండించగలిగే అవకాశం మన వ్యవసాయానికి గొప్ప వరం. ఇది రైతులకు పంటల మార్పిడిలో స్వేచ్ఛనిస్తుంది, ఆదాయ మార్గాలను పెంచుతుంది. ఒక సీజన్ పంట పాడైతే వచ్చే నష్టాన్ని తగ్గిస్తుంది. వాతావరణ మార్పులు, ఊహించని వాతావరణ పరిస్థితుల్లో ఈ బలం మనకు చాలా అవసరం. దేశీయంగా కందిపప్పు ఉత్పత్తి పెరిగితే, మార్కెట్లో ధరలు స్థిరంగా ఉంటాయి, వినియోగదారులకు కూడా అందుబాటులో ఉంటాయి. ఇది మన దేశ ఆహార భద్రతను బలోపేతం చేస్తుంది. అంతేకాదు, కందిపప్పు దిగుమతులపై ఏటా ఖర్చు చేసే 800 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. ఈ సొమ్మును ఇతర ముఖ్యమైన అభివృద్ధి పనులకు ఉపయోగించవచ్చు.

**సవాళ్లు, మన ముందున్న మార్గం:**

ఐసిపివి 25444 అద్భుతమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ, దీనిని దేశవ్యాప్తంగా విస్తృతంగా అమలు చేయడానికి కొన్ని సవాళ్లను అధిగమించాలి. చాలా మంచి దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో ఉన్నా, మన దేశంలో కందిపప్పు ఉత్పత్తి ఇంకా నిలకడగా లేదు. దీనికి కారణం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన సాగు విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు చేరకపోవడమే.

అడ్డుగా నిలిచే కొన్ని ముఖ్యమైన సమస్యలు:

నాణ్యమైన విత్తనాల సరఫరా కొరత, జీవన ఎరువుల వాడకంలో సవాళ్లు, ఎక్కువ శ్రమతో కూడిన సాగు, పంట కోసిన తర్వాత వచ్చే సమస్యలు వంటి మౌలిక సదుపాయాల కొరతలు వెంటాడతాయి.

అంతేకాకుండా చాలామంది రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన లేదు. ధరల్లో హెచ్చుతగ్గులు కూడా వారి సాగు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి.

**పరిష్కారాలు:**

ఈ పంటపై పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, మనం సమగ్ర విధానాన్ని అవలంబించాలి. రైతన్నలకు కొత్త పద్ధతుల గురించి వివరించడానికి బలమైన వ్యవసాయ విస్తరణ సేవలు అవసరం. వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాలి. మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచాలి. రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి, మెరుగైన సాగు విధానాలతో, విత్తన సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసి 15 లక్షల హెక్టార్లకు సాగును విస్తరించాలి. ఇక్రిశాట్ వంటి పరిశోధనా సంస్థలు, వాణిజ్య విత్తన కంపెనీల మధ్య బలమైన భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ఇలాంటి ఆవిష్కరణలు నిరంతరం కొనసాగడానికి, విస్తృతంగా రైతులకు చేరడానికి చాలా ముఖ్యం. ఐసిపివి 25444 కేవలం ఒక కొత్త వంగడం కాదు. ఇది మన శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం. మన దేశ వ్యవసాయ భవిష్యత్తుకు ఓ ఆశాకిరణం. కందిపప్పుకు ఉన్న కాలపరిమితిని తొలగించి, ఇది నిజంగా "అన్ని కాలాల కందిపప్పు"గా మారబోతోంది. వేడిని తట్టుకునే దీని శక్తి, వేగంగా పండే దీని గుణం మన దేశ కందిపప్పు కొరతకు ఓ చక్కటి పరిష్కారం.

**అండగా నిలవాలి:**

ఆర్థిక ప్రయోజనాలకు మించి ఈ వంగడం మన దేశ ఆహార భద్రతను పెంచుతుంది. వాతావరణ మార్పులను తట్టుకునే శక్తిని మన వ్యవసాయానికి ఇస్తుంది. ఇది రైతులకు ఎక్కువ విలువనిచ్చే, మార్పులకు అనుగుణంగా ఉండే పంటను అందిస్తుంది. అనూహ్య వాతావరణ మార్పుల కాలంలో, ఇది వారికి ఎక్కువ ఆదాయ మార్గాలను, స్థిరత్వాన్ని ఇస్తుంది. మన దేశం వాతావరణ మార్పుల సవాళ్లను, ఆహార అవసరాలను ఎదుర్కొంటున్నప్పుడు ఇటువంటి ఆవిష్కరణలు కేవలం వ్యవసాయ పురోగతులు మాత్రమే కావు. అవి మన దేశానికి మరింత సురక్షితమైన, సంపన్నమైన, స్థిరమైన భవిష్యత్తుకు పునాదులు. ఈ "పచ్చ బంగారం" మన పొలాలను సుసంపన్నం చేసి మన రైతన్నలకు అండగా నిలుస్తుందని ఆశిద్దాం.

–జనక మోహన రావు దుంగ
8247045230

# ఇరాన్–ఇజ్రాయెల్ ఘర్షణ భారత ఆర్థిక వ్యవస్థకు ముప్పు

## హార్ముజ్ జలసంధి మూతపడితే నిత్యావసరాల ధరలే కాదు... దేశం స్థిరతే దెబ్బతింటుందా?

గడచిన పదేళ్లలో ఎన్నో తీరని సవాళ్లను దాటుకొని, కరోనా కష్టకాలాన్ని అధిగమించి, నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్‌కు ఇప్పుడు మరో పెను భయంకరమైన ముప్పు ముందుంది. ఇది దేశవాళీ సమస్య కాదు, దేశ సరిహద్దులు దాటి వెలుపల పుట్టిన ప్రమాదం ం ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ఉద్రిక్తతలు. ఈ ఉద్రిక్తతలు దేశ ఆర్థిక వ్యవస్థను ఏ మేరకు ఊగిసలాడించగలవో ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ముడిచమురు ఆధారంగా నిలబడిన భారత ఆర్థిక నిర్మాణానికి హార్ముజ్ జలసంధి ఒక కీలక మూలం. ప్రపంచ చమురు రవాణాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. ఇది మూసివేయబడితే ఒక్కసారిగా ముడిచమురు ధరలు 130 డాలర్లకు చేరే అవకాశముంది.

ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఎదురయ్యే ప్రధాన సమస్యలు:ముడిచమురు దిగుమతి వ్యయం పెరగడం ద్రవ్యోల్బణం, రూపాయి పతనం

**కరెంట్ అకౌంట్ లోటు పెరుగుదల**

ప్లాస్టిక్, కెమికల్స్, ఎల్పీజీ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం:అంతే కాక, ఎగుమతి, దిగుమతి రంగాలలో వాణిజ్య మార్గాల్లో మార్పులు వల్ల ఒక కంటైనర్ ఖర్చు %వి500–వి%1000 పెరగడం, ఎల్పీజీ, ఎరువుల ధరలు పెరగడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం పడుతుంది.

భారత వ్యాపార సంబంధాలు:

ఇజ్రాయెల్‌తో ఏడాదికి %వి%6–7 బిలియన్

ఇరాన్‌తో సుమారు %వి%2 బిలియన్

బాస్మతీ బియ్యం ఎగుమతుల్లో ఇరాన్ 12.6% వాటాతో ఉండడం కూడా ఈ దౌత్య సంక్షోభాన్ని ఆహార రంగానికి దగ్గర చేస్తుంది.

విమానయాన రంగం నుంచి స్టాక్ మార్కెట్ వరకు ఎక్కడా భద్రత గ్యారంటీ కాదు. పెట్టుబడిదారులు భద్రత కోసం బంగారం, వెండి వైపు పరుగులు తీస్తే... మార్కెట్ కుప్పకూలే అవకాశం కూడా లేదు కాదు.

భారత ప్రభుత్వానికి ఇప్పుడు మూడు ప్రధాన కార్యక్రమాలు అత్యవసరం:


**వ్యూహాత్మక ఇంధన నిల్వలు సిద్ధం చేయడం**

హార్ముజ్ మూతపడితే ధరలకు రెక్కలు! గడిచిన దశాబ్ద కాలంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఇటీవల ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించిన భారతదేశానికి ప్రస్తుతం ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల పెను ప్రమాదం పొంచి ఉన్నది. కరోనా వంటి గడ్డు పరిస్థితిని సైతం దాటుకొని సాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనంపై పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. గడిచిన దశాబ్ద కాలంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఇటీవల ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించిన భారతదేశానికి ప్రస్తుతం ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల పెను ప్రమాదం పొంచి ఉన్నది. కరోనా వంటి గడ్డు పరిస్థితిని సైతం దాటుకొని సాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనంపై పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, ప్రపంచశక్తిగా ఎదుగుతున్న మన దేశ ఆర్థికవ్యవస్థపై ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధప్రభావం ఎంతవరకు ఉంటుంది? ఏయే రంగాలపై దీని ప్రభావం పడనున్నది? వ్యాపార, వాణిజ్య ద్వైపాక్షిక సంబంధాలపై ఎటువంటి ప్రభావం పడబోతున్నది? వంటివి ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నలు. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం మొదటగా ముడిచమురు రంగం మీద పడనున్నది. మన దేశం చమురు అవసరాల్లో సుమారు 80 శాతం దిగుమతులే. మొత్తం చమురు దిగుమతుల్లో 46 శాతం, 70 శాతం ఎల్పీజీ పశ్చిమాసియా నుంచే భారత్ దిగుమతి చేసుకుంటున్నది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగితే, రానున్న రోజుల్లో ముడిచమురు ధరలు భారీగా పెరిగే ఆస్కారం ఉంది. అంతేకాదు, ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు 20 శాతం ఇరాన్ ఆధీనంలోని 'హార్ముజ్' జలసంధి మార్గంలో జరుగుతున్నది. యుద్ధం వల్ల ఇరాన్ ఈ జలసంధిని మూసేస్తే ముడిచమురు ధరలు సుమారు 120 డాలర్ల నుంచి 130 డాలర్లకు పెరగవచ్చని అంచనా. అయితే, అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడం లేదు. కానీ, ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి భారత్ దిగుమతి చేసుకునే చమురు హార్ముజ్ జలసంధి గుండా వస్తున్నది. ఈ జలసంధి మూతపడితే ముడిచమురు ధరలకు రెక్కలు వచ్చినట్టే. గణాంకాల ప్రకారం.. ఒక బ్యారెల్ ముడిచమురు ధర 10 డాలర్లు పెరిగితే, మన దేశ జీడీపీ వృద్ధి సుమారు 0.3 పాయింట్లు తగ్గుతుంది. అలాగే, ద్రవ్యోల్బణం 0.4 శాతం పెరుగుతుంది. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, డిమాండుకు సరిపడా చమురు సరఫరా పడిపోవడం, అంతర్జాతీయంగా ధరలు పెరగడం ఒక సమస్య కాగా, డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ పడిపోవడం మరొక సమస్య. ఫలితంగా దేశీయ చమురు కంపెనీల దిగుమతి వ్యయం పెరుగుతుంది. తద్వారా, కరెంటు అకౌంట్ లోటు కూడా పెరిగే ప్రమాదం ఉన్నది. ముడిచమురుతో పరోక్షంగా సంబంధమున్న ప్లాస్టిక్, ప్రత్యేక రసాయనాలు, రంగులు, టైర్లు, ఇతర రంగాలు కుదేలవుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అది సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేస్తుంది. చమురుపైనే కాకుండా, మనదేశ ఎగుమతి, దిగుమతి వాణిజ్యంపై కూడా ఇరాన్–ఇజ్రాయెల్ ప్రభావం పడుతుంది. అరేబియా ద్వీపానికి అవతల ఉన్న యెమెన్‌లోని హౌతీలు ఇరాన్‌కు మద్దతుగా ఎర్రసముద్రం, సూయజ్ కాలువను మూసివేస్తే భారత నౌకలు మన ఎగుమతి దిగుమతులకు 'కేఫ్ ఆఫ్ గుడ్‌హెూప్' మార్గం ఎంచుకోవడం ద్వారా ప్రయాణ సమయం 15 నుంచి 20 రోజులకు చేరుకుంటుంది. తద్వారా ఒక్కో కంటైనర్‌కు సుమారు 500 నుంచి 1000 డాలర్ల వరకు ఖర్చు పెరుగుతుంది. ఫలితంగా ఎగుమతి, దిగుమతి వర్తక వ్యయం సుమారు 50 శాతం పెరగవచ్చు. ముఖ్యంగా ఎల్పీజీ, ఎరువుల ధరలు పెరగడం ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థపై ప్రభావం పడుతుంది. భారత్‌కు ఇరాన్–ఇజ్రాయెల్ దేశాలతో సుమారు 5 బిలియన్ డాలర్ల వ్యాపార సంబంధాలున్నాయి. ఇరుదేశాలకు భారత్ వివిధ రకాల వస్తువుల ఎగుమతితో పాటు దిగుమతి కూడా చేసుకుంటున్నది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇజ్రాయెల్‌కు భారత్ ఎగుమతుల విలువ సుమారు 4.5 బిలియన్ డాలర్లు కాగా, దిగుమతుల విలువ 2 బిలియన్ డాలర్లు. అలాగే, 2024–25లో 2.1 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 1.6 డాలర్ల దిగుమతులు ఇరుదేశాల మధ్య జరిగాయి. ఇజ్రాయెల్‌కు భారత్ ఆసియాలోనే రెండవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక ఇరాన్‌తో కూడా మన దేశానికి మంచి వాణిజ్య సంబంధాలే ఉన్నాయి. 2023–24లో 1.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 0.62 బిలియన్ డాలర్ల దిగుమతులు, 2024–25లో 1.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 0.44 బిలియన్ డాలర్ల దిగుమతులు జరిగాయి. భారత్ నుంచి బాస్మతీ బియ్యాన్ని ఎక్కువగా కొనుగోలు చేసే దేశాలలో సౌదీ అరేబియా, ఇరాక్, ఇరాన్ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మొత్తం మన దేశ బాస్మతీ బియ్యం ఎగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 12.6 శాతం.

ఈ ఘర్షణల ప్రభావం విమానయాన రంగంపై కూడా పడుతుంది. పరిస్థితి ఇలాగే ఉంటే పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం, వెండి వంటి లోహాల వైపు మళ్లిస్తారు.



# హరే శ్రీనివాస



దాదాపు రెండేళ్ళపాటు టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ అధికారిగా... స్వామి వారి ప్రథమ సేవకుడిగా తాను చేసిన విశేష కార్యక్రమాలను వివరిస్తూ డాక్టర్ కె.వి.రమణాచారి రచించిన గ్రంథం 'హరే శ్రీనివాస!'. ఇందులో 'శ్రీనివాసుడునాకు జవాబిచ్చాడు' మొదలు 'వెంకటాద్రి దిగి వెంకటాద్రి ఎక్కి వరకూ'... ఇరవై రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల శీర్షికలు వాటిని చదవాలన్న ఉత్సుకతను పాఠకుల్లో రేకెత్తిస్తాయి. "ఎందుకు ఈ భక్తులందరూ వందలాది కిలోమీటర్ల దూరం రైళ్ళు, బస్సులు, కార్లు, కాలినడక... ఇలా ఇన్ని రకాలుగా ఆపసోపాలు పడుతూ తిరుపతి వస్తున్నారు?..." అనే ప్రశ్నతో ఈ గ్రంథం ప్రారంభం అవుతుంది. "నిన్నే తమ సర్వస్వంగా భావిస్తున్న భక్తులు నిన్ను దర్శించాలని ఇంత కష్టపడి, ఇంత దూరం వస్తే నువ్విచ్చే దర్శనం లిప్తకాలమా?..." అనే ప్రశ్నను... తను టి.టి.డి. ఈవో కాకముందు డాక్టర్ రమణాచారిగారు తనలోతాను అనేకసార్లు వేసుకున్నారట. అలాగే "సర్వశక్తిమంతుడివి కదా! నీ భక్తుల దగ్గరకు నీవే వెళ్ళి, సంతృప్తికరమైన దర్శనంతో వాళ్ళను తరింపజేయవచ్చు కదా! స్వామే భక్తుల దగ్గరకు ఎందుకు వెళ్ళకూడదు?..." ఇది భక్తుడిగా ఆయన స్వామివారికి వేసిన ప్రశ్న. టి.టి.డి. ఈవోగా బాధ్యతలు స్వీకరించాక ఆ ప్రశ్న ఆయనలో మళ్ళీ ఉదయించింది. దానికి స్వామి ఇచ్చిన సమాధానం ఏమిటి? అది ఇచ్చిన పద్ధతి ఏమిటి? 'చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర'కు బీజం ఎలా పడింది? వీటన్నిటికీ జవాబులు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఆ సర్వాంతర్యామి సేవకుడిగా తన అనుభవాలను ఆసక్తికరంగా, సభక్తికంగా ఈ పుస్తకంలో డాక్టర్ రమణాచారి నిక్షిప్తం చేశారు. డాక్టర్ రమణాచారి తలపెట్టి విజయవంతం చేసిన చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర, అఖండ హరినామ సంకీర్తన, నిత్యకళ్యాణం, పుస్తక, ప్రసాదం, దివ్య భారతి, ఎస్వీబీసీ, శ్రీ అన్నమాచార్య ఆరువందల జయంతి వేడుక, పాలకమండలి అమృతోత్సవం... ఇలా ఎన్నో కార్యక్రమాలు, ప్రాజెక్టుల గురించి చదువుతూ ఉంటే... ఆయన భక్తి తత్పరత, పాలనానుభవం, కార్యదక్షత ఎంతటివో అర్థమవుతుంది. ఈ గ్రంథం చదవడం ప్రారంభిస్తే... పూర్తి అయ్యేవరకూ ఆగలేం. రచన అటువంటిది. విషయం భగవంతునిది. రచయిత పండిత, సంప్రదాయ కుటుంబానికి చెందినవారు. ఎం.ఏ. తెలుగు చేసి, పిహెచ్.డి. పట్టా పుచ్చుకున్నావారు. వీరి రచనలో చదివించే లక్షణం ఉంది. పఠనాసక్తిని పెంచే విధంగా శీర్షికలు ఉన్నాయి. తన ఆలోచనను చెప్పి, దాన్ని అమలుపరిచే క్రమంలో ఎదురైన సమస్యలను వివరిస్తున్న సందర్భంలో... పాఠకుని మనసు మరింత వేగంగా పరిగెడుతుంది. 'సమస్య ఎలా పరిష్కారమవుతుంది? దైవకార్యం ఎట్లా విరబూసి పరిమళిస్తుంది?' అనే ఆసక్తిని పెంచే విధంగా రచన సాగింది. పుస్తకం ముగించినప్పుడు అనిపిస్తుంది... 'ఇంతలోనే నూట ఎనభై పుటలు చదివేసినామా!' అని. డాక్టర్ కె.వి.రమణాచారి ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి పాఠకులకు అందించిన ప్రసాదం ఈ 'హరే శ్రీనివాస!' గ్రంథం.

## 73 ఏళ్ల వయసులో ఏకబిగిన 51 పుషప్స్.. కుర్రాళ్లకు షాకిచ్చిన గవర్నర్!



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సెలబ్రిటీల నుంచి రాజకీయవేత్తల వరకూ అందరూ యోగాసనాలు వేస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు తమ యోగా ఫొటోలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. యోగా డేను పునస్కరించుకొని తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి ( ఒక వీడియో విడుదల చేశారు. అలాఅనీ ఆయన మిగతా వాళ్లలా చిన్నపాటి ఆసనాలు, వ్యాయమాలు చేయలేదు. తన వయసు వారు సైతం అవాక్కయ్యేలా ఏకబిగిన 51 పుషప్స్ చేసి ఔరా అనిపించారు.తద్వారా రాష్ట్రానికి తొలి పౌరుడిగానే కాదు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలోనూ తాను ముందువరుసలోనే ఉంటానని చాటారు. గవర్నర్ ఉత్సాహంగా పుషప్స్ తీస్తుంటే అక్కడున్నవాళ్లంతా చప్పట్లు కొడుతూ అభినందించారు. ఇక ఆ వీడియో చూసినవాళ్లు 'వామ్మో 73 ఏళ్ల వయసులో ఇంత ఫిట్‌గా ఉన్నారేంటీ?' అని నోరెళ్లబెడుతున్నారు. కొందరేమో 'మీది మామూలు బాడీ కాదు సార్' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## డీఆర్డీవో అభివృద్ధి చేసిన బరాక్ మిస్సైల్ సిస్టమ్ వాడుతున్న ఇజ్రాయిల్



**టెల్ అవివ్ -నవభూమి:** ఇజ్రాయిల్‌పై ఇరాన్ మిస్సైళ్లతో దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ దాడుల్ని తిప్పికొట్టేందుకు బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌(ను ఇజ్రాయిల్ విని యోగిస్తున్నది. మానవం హిత ఏరియల్ వాహనాలతో పాటు మిస్సైళ్లను కూడా ఆ బరాక్ సిస్టమ్ సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌తో పాటు భారత్‌కు చెందిన డీఆర్డీవో కూడా ఆ సిస్టమ్ అభివృద్ధిలో పాత్ర పంచుకున్నది. ఇద్దరూ సంయుక్తంగా బరాక్ సిస్టమ్‌ను డెవలప్ చేశారు. వైమానిక ముప్పులను ఎదుర్కొనేందుకు దీన్ని తయారు చేశారు. యూఏవీలు, క్రూయిజ్ మిస్సైళ్లతో పాటు ఎయిర్‌బోర్న్ టార్గెట్లను బరాక్ సిస్టమ్ ఎదుర్కోగలదు.బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఓ అత్యాధునిక వ్యవస్థ. షార్ట్ టు మీడియం రేంజ్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థను ఇజ్రాయిల్ డెవలప్ చేసింది. నౌకలను రక్షించుకునేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. రేడార్ ద్వారా సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ ను ఆ సిస్టమ్ రిలీజ్ చేస్తుంది. ఒకేసారి మల్టిపుల్ టార్గెట్లను అడ్డుకునే సామర్థ్యం బరాక్ సిస్టమ్‌కు ఉన్నది. బరాక్-8 మిస్సైల్ సిస్టమ్‌ను ఎంఆర్-సామ్ అని కూడా పిలుస్తారు. ఇజ్రాయిల్‌తో పాటు ఇండియాకు చెందిన డీఆర్డీవో దీన్ని సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఆ సిస్టమ్‌కు అవసరమైన డుయల్ ఫేస్ రాకెట్ మోటార్ లాంటి సంక్లిష్టమైన పరికరాలను డీఆర్డీవో డెవలప్ చేస్తున్నది.ఇటీవల ఆపరేషన్ సింధూర్ సమయంలో బరాక్ సిస్టమ్‌ను ఇండియా వాడింది. పాకిస్థాన్‌కు చెందిన ఫతా-2 మిస్సైళ్లను దీంతో అడ్డుకున్నారు. ఫతా మిస్సైల్‌తో ఢిల్లీని పాక్ టార్గెట్ చేసింది. అయితే హర్యానాలోని సిర్సాలో దాన్ని చిత్తు చేశారు. ఇజ్రాయిలీ మూలాలు ఉన్న బరాక్ సిస్టమ్‌తో హైపర్‌సోనిక్ బాలిస్టిక్ మిస్సైళ్లను కూడా ధ్వంసం చేయవచ్చు అని తెలుస్తోంది. ఇజ్రాయిలీ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఐరన్ డోమ్ కీలకమైంది. దాంతో పాటు యారో మిస్సైల్స్ కూడా కీలకమైనవే. కానీ బరాక్ సిస్టమ్ వల్ల.. ఎలాంటి వైమానిక దాడినైనా తిప్పికొట్టవచ్చు. ఎయిర్‌క్రాఫ్ట్, క్రూయిజ్ మిస్సైళ్లు, సీ టు సీ మిస్సైల్స్, రాకెట్లు, బాలిస్టిక్ మిస్సైళ్లను బరాక్ సిస్టమ్ చిత్తు చేస్తుంది.

## యోగా డేన శీర్షాసనం, పద్మాసనం.. నార్వే దౌత్యాధికారి పోస్ట్ వైరల్



**న్యూఢిల్లీ-నవభూమి:**పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా వేడుకగా జరుగుతోంది. పలు దేశాల ప్రముఖులు యోగాసనాలు వేస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. భారత్‌లో పెద్ద సంబురంలా యోగా డే సాగుతున్న వేళ.. నార్వే దౌత్యాధికారి సైతం ఆసనాలు వేస్తున్న ఫొటోలను ఆన్‌లైన్‌లో పంచుకున్నారు. ఇండియాలో ఆ దేశ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మే ఎలిన్ స్టెనర్ ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా రెండు కఠినమైన ఆసనాలు వేసింది.
నిరుడు మే ఎలిన్ భారత్‌లో నార్వే దౌత్యాధికారిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి మనదేశ సంస్కృతి, సంప్రదాయాల మీద ఇష్టం పెంచుకున్న ఆమె.. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పునస్కరించుకొని ఆసనాలు వేశారు. వీటిలో ఒకటి శీర్షాసనం కాగా.. శీర్షాసనంలో ఉంటూనే ఆమె పద్మాసనం కూడా వేయడం విశేషం. 'శీర్షాసనం వేసిన తీరు.. అది ఎలా ముగిసిందో చూడండి' అంటూ తన ఫొటోలను పంచుకున్నారామె.

## జులై 15 వరకూ.. అంతర్జాతీయ రూట్లలో సర్వీసులు నిలిపివేసిన ఎయిర్ ఇండియా




**న్యూఢిల్లీ-నవభూమి:** టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా సమస్యల వలయంలో చిక్కుకొన్నది. మొన్న జరిగిన విమాన ప్రమాదం ఘటన మరవకముందే ఈ సంస్థకు చెందిన పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో సంస్థ ఎయిర్ ఇండియా విమానాల్లో రక్షణ తనిఖీలు చేపడుతోంది. ఈ క్రమంలో నిర్వహణపరమైన ఇబ్బందులతో జాతీయ, అంతర్జాతీయంగా నడిచే పలు విమాన సర్వీసులను సంస్థ రద్దు చేస్తోంది.వైడ్‌బాడీ విమాన కార్యకలాపాలను జులై మధ్య వరకూ తగ్గించనున్నట్లు ఇటీవలే ఎయిర్‌లైన్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. దాదాపు 15 శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగానే నేటి నుంచి జులై 15 వరకూ ఉత్తర అమెరికా, యూకే, యూరప్, ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా మార్గాల్లో అంతర్జాతీయ విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. 16 అంతర్జాతీయ రూట్లలో విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ప్రభావిత మార్గాల్లో గోవా(మోపా)-లండన్(గాత్విక్) %AI%145/146 విమాన సర్వీసు కూడా ఉంది. ఇది వారానికి మూడుసార్లు నడుస్తుంది.

## మూడు లక్షల మందితో యోగా.. విశాఖలో కొత్త గిన్నిస్ రికార్డు!

**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర-2025 కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ఈ యోగాంధ్ర వేడుక అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ కార్యక్రమంలో 3 లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొని చరిత్ర సృష్టించారు. దీంతో గతంలో సూరత్‌లో నిర్వహించిన యోగా రికార్డును యోగాంధ్ర అధిగమించింది. విశాఖలోని రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు లక్షలాది మంది ప్రజలు ఒకే మార్గంలో యోగాసనాలు వేసి ఈ అద్భుతమైన రికార్డును నమోదు చేశారు. 2023 గుజరాత్‌లోని సురత్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో 1,53,000 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఇదే అత్యధిక మంది పాల్గొన్న యోగా సెషన్‌గా రికార్డులో ఉండగా.. తాజాగా ఈ రికార్డును యోగాంధ్ర అధిగమించింది.

# పెన్షన్లు భారీగా పెంచిన సీఎం




**న్యూఢిల్లీ-నవభూమి:**వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు నెలవారీ అందజేసే సామాజిక పెన్షన్లపై బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ శుభవార్త చెప్పారు. ప్రస్తుతం అందజేస్తోన్న రూ.400 పింఛన్లను రూ.1,100 పెంచుతున్నట్టు సీఎం నితీష్ కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో అమలవుతోన్న సామాజిక భద్రతా పథకాలపై కీలక ప్రణాళికలు ప్రకటించారు. వాటిలో ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలకు పెన్షన్‌ను రూ. 400 నుంచి రూ. 1,100కి పెంచారు. ఈ పెంపు వచ్చే నెల నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. శుక్రవారం పాట్నాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు నితీశ్ కుమార్ ప్రకటన చేశారు.15 సంవత్సరాలలో కోటి రూపాయలు సంపాదించాలా? రూల్ 15-15-30 తో సాధ్యమే!
"ప్రస్తుతం ఇస్తోన్న రూ. 400కి బదులుగా ప్రతినెల రూ. 1,100 పెన్షన్ అందుతుంది.. జులై నుంచి ప్రతి నెల 10న లబ్ధిదారుల ఖాతాల్లో ఈ మొత్తం జమ చేస్తాం. దీని ద్వారా 1,09,69,255 మంది లబ్ధిదారులకు ప్రయోజనం లభిస్తుంది" అని నితీష్ అన్నారు. 'వృద్ధులు మన సమాజానికి మూర్తిమత్వమైన విలువలు. వారు గౌరవంగా జీవించేలా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత' అని సీఎం నితీష్ కుమార్ అన్నారు. దీనికి ముందు పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఎన్నికైన ప్రతినిధుల వేతనాల పెంపునకు బిహార్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జిల్లా పరిషత్ అధ్యక్షులకు రూ. 20,000 నుంచి రూ. 30,000లకి, ఉపాధ్యక్షులకు రూ. 10,000 నుంచి రూ. 20,000కి, సర్పంచులకు రూ. 5,000 నుంచి రూ. 7,500కు పెంచింది.

**ఎన్నికల కోసమే అంతా?**

ఈ ఏడాది చివరిలో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పింఛన్లను పెంచుతూ నితీష్ నిర్ణయం తీసుకున్నారు. అధికారం నిలబెట్టుకోవాలని జనతా దళ్ (యునైటెడ్) నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి.. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి నుంచి ఈసారి గట్టిపోటీని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో నితీష్ కుమార్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇటీవలే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద గ్రామసభ నాయకులు (ముఖియాలు) రూ. 10 లక్షల విలువ వరకు ప్రాజెక్టులను స్వయంగా ఆమోదించే అధికారం కల్పించారు. గతంలో ఇది రూ. 5 లక్షలు మాత్రమే.

**మోదీ ప్రచారం**

ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం బిహార్‌లో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. శుక్రవారం సివాన్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వరాలు కురిపించారు. అలాగే, 'భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోంది. ఈ మార్గంలో బీహార్ కీలక పాత్ర పోషించనుంది' అని మోదీ అన్నారు. 22 పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, 6 కొత్త రహదారి ప్రాజెక్టులు, రైలు మౌలిక వసతుల ప్రాజెక్టు, వందేభారత్ సహా రెండు కొత్త రైళ్లు ప్రకటించారు.

### అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత
## మిస్సైన మ్యూజిక్ డైరెక్టర్ జాడ లభ్యం



**అహ్మదాబాద్-నవభూమి:** అహ్మదాబాద్‌లో జరిగిన దురదృష్టకర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో ప్రముఖ గుజరాతీ మ్యూజిక్ డైరెక్టర్ మహేష్ జిరావాలా అలియాస్ మహేష్ కలావాడియా కూడా ఉన్నారని అధికారికంగా నిర్ధారణ అయ్యింది. ఇన్నాళ్లు విమాన ప్రమాదం జరిగిన తర్వాత అదృశ్యం అయ్యాడనుకున్న ఈయన కూడా అదే ప్రమాదంలో అసులు బాశారు. ముఖ్యంగా డీఎన్ఏ పరీక్షల ద్వారా వైద్య సిబ్బంది ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఆపై ఆయన కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందించగా.. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వార్త గుజరాతీ చిత్ర పరిశ్రమలో మరియు ఆయన అభిమానులలో తీవ్ర విషాదాన్ని నింపింది.దాదాపు 10 రోజుల క్రితం అహ్మదాబాద్‌లో సంభవించిన ఈ విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ప్రమాదం జరిగినప్పటి నుండి జిరావాలా ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన కాసేపటికే ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ అవడం, ఆయన కన్పించకుండా పోవడంతో.. ఆయనకేమైందోనని భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలోనే ఆయన ప్రమాదంలో చనిపోయి ఉండచ్చుని భావించిన పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టారు. ఎంతకైనా మంచదని చెప్పి.. డీఎన్ఏ శాంపిల్స్ ఇవ్వమని వివరించారు. ఒకవేళ ప్రమాదంలో ఆయనకేమైనా అయిందేమనని నిర్ధారించుకోవ డానికి మాత్రమే అలా చేయమన్నారు. ఎందుకంటే ప్రమాదంలో చనిపోయిన వారందరి మృతదేహాలు పూర్తిగా గుర్తు పట్టలేని విధంగా మారిపోయాయి. ఇలా చిత్ర నిర్మాత మృతదేహానికి పరీక్ష చేయగా.. కుటుంబ సభ్యుల శాంపిల్స్‌తో మ్యాచ్ అయ్యాయి. ఇలా ఆయన మృతదేహాన్ని నిర్ధారించిన వైద్యులు కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. ఆపై ఆయన మృతదేహాన్ని అందజేశారు. అతడి మృతి వార్త తెలుసుకున్న భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఇన్నాళ్లూ బతికే ఉంటాడేమోనని భావించిన తమకు.. తీరని దుఃఖాన్ని మిగిల్చి వెళ్లిపోయాడని వివరిస్తున్నారు.మహేష్ జిరావాలా గుజరాతీ సినిమా రంగంలో సుప్రసిద్ధుడు. ఆయన అనేక విజయవంతమైన పాటలను రూపొందించి, పరిశ్రమ అభివృద్ధికి గణనీయమైన కృషి చేశారు. ఆయన చేసిన పాటలు, మ్యూజిక్ విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు పొందేవి. ఆయన మరణం గుజరాతీ సినిమాకు తీరని లోటు అని సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయన జ్ఞాపకార్థం గుజరాతీ చిత్ర పరిశ్రమ నివాళు లర్పించింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు ప్రార్థిస్తున్నారు. ఈ సంఘటన గుజరాత్ రాష్ట్రానికే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమకు కూడా ఒక తీరని విషాదాన్ని మిగిల్చింది. మరోవైపు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఈ విమాన ప్రమాదం దేశంలో విమానయాన భద్రత ప్రమాణాలపై తీవ్ర చర్చకు దారితీసింది.

## సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అవినీతి ఆరోపణలు



**కర్ణాటక-నవభూమి:**సొంత పార్టీ ఎమ్మెల్యే ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేయడం కన్నడ నాట సంచలనంగా మారింది. ఇప్పటికే పలు ఆరోపణలు ఎదుర్కొంటోన్న కర్ణాటకలోని సిద్ధరామయ్య సర్కారు.. సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యే విమర్శలు గుప్పించడంతో మరింత ఇరకాటంలో పడింది. హౌసింగ్ శాఖలో అవినీతి జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పటేల్ ఆగ్రహంతో మాట్లాడిన ఆడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. రాష్ట్రాన్ని దోచేస్తున్నారని ఆరోపణలు గుప్పిస్తోంది.వైరల్ అవుతోన్న ఆడియో క్లిప్‌లో అలంద్ ఎమ్మెల్యే బీఆర్ పటేల్.. గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ప్రయివేట్ సెక్రటరీ సర్ఫరాజ్ ఖాన్‌తో మాట్లాడుతున్నట్లు వినిపిస్తోంది. రాజీవ్ గాంధీ హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్మెల్యేల సిఫార్సులను పట్టించుకోవడం లేదని, ఇళ్ల కేటాయింపులో లంచాలు తీసుకుంటున్నాయని పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు ఏం చెక్ చేస్తారు? ఇది నాకు ఎదురైన అనుభవం... ఇది నా మంత్రి, నా పార్టీ ప్రభుత్వంపై ఆరోపణ... లంచం ఇచ్చినట్టు ఆధారాలు ఎప్పటికీ బయటపడవు..... నా పక్కనున్న అఫ్జల్‌పూర్ నియోజకవర్గంలో డబ్బులు ఇచ్చివారికి ఇళ్లను కేటాయించారు" అని బీఆర్ పాటిల్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు.
తన నియోజకవర్గంతో పాటు పక్కనే ఉన్న మిగతా ప్రాంతాల్లో 100-200 ఇళ్ల చొప్పున కేటాయించారని, మొత్తంగా 950 ఇళ్లకు లెక్క తెలిందని చెప్పారు. 'నేను నోరు తెరిస్తే ప్రభుత్వం వణికిపోతుంది' అని హెచ్చరించడం స్పష్టంగా వినిపిస్తోంది.
ఈ ఆడియో క్లిప్‌పై మీడియా ప్రశ్నించగా.. 'ఆ వాయిస్ నాదే అంటూ' పాటిల్ చెప్పడం గమనార్హం. అయితే, అంతకు మించి స్పందించేందుకు ఆయన నిరాకరించారు. 'ఈ విషయం మీద ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కలుస్తాను' అని అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ఈ ఆరోపణల గురించి తనకు ఏమీ తెలియదని అన్నారు.మరో మంత్రి సతీష్ జారి?హొళి స్పందిస్తూ.. 'ఇది ఆఫ్ ది రికార్డా? రికార్డర్‌దా అనేది పరిశీలిస్తాం. అయినప్పటికీ, ఆయన మాట్లాడినట్టయితే ప్రభుత్వం దానిపై విచారణ జరుపుతుంది' అన్నారు. ఈ ఆడియో క్లిప్‌తో ప్రతిపక్ష బీజేపీకి మరో అస్త్రం లభించినట్టయ్యింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో పని జరగాలంటే ముడుపులు సమర్పించాల్సిందే అనడానికి పాటిల్ వ్యాఖ్యలు ఆధారమని బీజేపీ సీనియర్ నేత, విపక్ష డిప్యూటీ లీడర్ అరవింద్ బెల్లాద్ అన్నారు.
ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో తొక్కిసలాట.. నలుగురు మృతి, 10 మందికి తీవ్ర గాయాలు'లంచం ఇచ్చిన వాళ్లకే ఇళ్ళు కేటాయించారని పాటిల్ చాలా స్పష్టంగా.. బహిరంగంగా ఆరోపించారు. ఆయన ఉదాహరణలు కూడా ఇచ్చారు. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ ఇదే పద్ధతి. ఇది వేలం మాదిరి. ఎవరు అత్యధికంగా చెల్లిస్తారో, వారి పని జరుగుతుంది... ఏ విచారణలోనూ ఏమీ బయటపడదు. వారందరూ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు' దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఇద్దరికీ అవినీతి గురించి తెలుసని ఆరోపించారు. ముడా కుంభకోణం వ్యవహారం సిద్ధరామయ్యను ఇరకాటంలో పెట్టిన సంగతి తెలిసిందే.ఈ ఆడియో ప్రస్తుతం కర్ణాటక రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. ప్రభుత్వ చర్యలు, విచారణ ఫలితాలు ఏవిధంగా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా, బీజేపీ మాత్రం ఈ అంశాన్ని ఉపయోగించుకునే

### 17 ఏళ్ల కొడుకు పెళ్లి కోసం పిల్లను చూసి..
## ఆమెనే పెళ్లి చేసుకున్న యూపీ వ్యక్తి



**న్యూఢిల్లీ-నవభూమి:**షకీల్ అనే వ్యక్తికి ఆరుగురు పిల్లలు. ముగ్గురు పిల్లలకు తాతయ్య కూడా. అయితే 22 ఏళ్ల అమ్మాయితో ఇటీవల తరుచూ మాట్లాడడం మొదలుపెట్టాడు. కూతురుకు పెళ్లి చేసే క్రమంలో ఆయేషా అనే అమ్మాయితో పరిచయం ఏర్పడినట్లు షకీల్ భార్య షబానా తెలిపింది. షకీల్‌ను ప్రశ్నించగా, తన కుమారుడి పెళ్లి కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పాడు. అయితే కుమారుడు అమన్ వయసు, అమ్మాయి వయసు తేడా ఎక్కువ ఉన్న దృష్ట్యా.. ఆ పెళ్లి వద్దు అని షబానా కుటుంబం వాదించింది. కానీ బలవంతంగా ఆ పెళ్లి చేసేందుకు షకీల్ వత్తిడి చేశాడు. తండ్రి ప్రవర్తన పట్ల చికాగు చెందిన కుమారుడు.. షకీల్ ఫోన్‌ను చెక్ చేశాడు. అభ్యంతరకరమైన కాంటెంట్ ఉన్న నేపథ్యంలో కుమారుడు ఆ పెళ్లికి నిరాకరించాడు.సీన్ కట్ చేస్తే, ఓ పనిమీద గతవారం ఢిల్లీకి వెళ్లాడు షకీల్. కుమారుడి కోసం చూసిన అమ్మాయినే పెండ్లి చేసుకున్నట్లు అతను తన కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ అమ్మాయి తనకు కోడలుగా వస్తుందనుకున్నాను, కానీ తన భర్తకు భార్య అవుతుందని అనుకోలేదని షబానా చెప్పింది. ఈ ఘటన పట్ల ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు. ఎవరైనా ఫిర్యాదు ఇచ్చేందుకు ముందుకు వస్తే చర్యలు తీసుకుంటామని బోటా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అమర్ సింగ్ రాథోడ్ తెలిపారు.

## ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే.. ఏడేళ్ల జైలుశిక్ష, 10 లక్షల ఫైన్




**బెంగళూరు - నవభూమి:** కర్నాటక సర్కారు ఫేక్ వార్తలకు చెక్ పెట్టనున్నది. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. సమాచార దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు.. ఒకవేళ ఎవరైనా ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తే, వాళ్లకు ఏడేళ్ల జైలుశిక్ష, పది లక్షల జరిమానా విధించనున్నారు. దీనిపై కర్నాటక సర్కారు ముసాయిదాను తయారు చేసింది. కర్నాటక మిస్‌ఇన్ఫర్మేషన్ అండ్ ఫేక్ న్యూస్ యాక్ట్ ముసాయిదాను రెండేళ్ల క్రితం రూపొందించారు. అయితే గత వారం దాన్ని క్యాబినెట్ ముందు ప్రవేశపెట్టారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌ను నియంత్రించేందుకు కర్నాటక సర్కారు ప్రత్యేక కోర్టులను కూడా ఏర్పాటు చేస్తున్నది. త్వరగా కేసులను పరిష్కరించేందుకు ఈ చర్యలు చేపట్టింది. ప్రతి స్పెషల్ కోర్టుకు ఓ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తారు.

## షాకింగ్ ఘటన.. ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిపై దాడి చేసి లాక్కెళ్లిన చిరుత



**అహ్మదాబాద్-నవభూమి:** అడవిలో ఉండాల్సిన క్రూర మృగాలు ఇటీవలే కాలంలో జనావాసాల్లోకి ప్రవేశిస్తున్నాయి. అటవీ సమీప గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తాజాగా తమిళనాడు రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అటవీ సమీప గ్రామంలోని ఓ ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారిపై చిరుతపులి దాడి చేసి అడవిలోకి లాక్కెళ్లింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోయంబత్తూర్ జిల్లా వాల్పరై పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రోష్ణి అనే నాలుగేళ్ల చిన్నారి తన ఇంటి ఆవరణలో ఆడుకుంటోంది. అదే సమయంలో అడవిలో నుంచి వచ్చిన చిరుతపులి బాలికపై దాడి చేసింది. అనంతరం అడవిలోకి లాక్కెళ్లింది. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అటవీ అధికారులు బాలిక కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. సెర్చ్ లైట్లు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్‌లతో కూడిన బృందాలు ప్రాంతంలో గాలింపు చేపడుతున్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొంది.

## తుంగభద్రకు వరద ఉధృతి..

**న్యూఢిల్లీ-నవభూమి:**తుంగభద్ర జలాశయానికి(వరదనీటి చేరిక రోజురోజుకు పెరుగుతోంది. ఇప్పటికే రోజూ 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఇది రెండురోజుల నుంచి భారీగా పెరుగుతుండటంతో గత ఏడాది కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేట్ మరమ్మతు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. క్రస్ట్‌గేట్ల బలహీనత దృష్ట్యా ఈ ఏడాది 80 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేలా బోర్డు తీర్మానం చేసింది. దీంతో 105 టీఎంసీల నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకే కుదించి జలాశయం భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జలాశయం ఎగువన ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడంతో వరదనీరు వచ్చి చేరుతోంది.ఎగువన ఉన్న శివమొగ్గ, అగుంబి, శృంగేరి లాంటి ప్రాంతాలతో పాటు జలాశయం పరివాహక ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. సాధారణంగా మే మాసంలో ఏ మాత్రం నీటిలభ్యత ఉండదు. ఈ ఏడాది మే మాసంలోనే 10 టీఎంసీల దాకా నీరు వచ్చి చేరింది. ఇప్పటి వరకు జలాశయంలో దాదాపు 40 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో బోర్డు ఆయా కాలువలకు నీటి విడుదలపై దృష్టి పెట్టి ఆయా రాష్ట్రాల వాటాల నీటిని తీసుకోవాలని ఒత్తిడి చేయడం ప్రారంభించింది. దీంతో 27న నీటి విడుదలపై సమావేశం ఏర్పాటు చేసుకుని బోర్డుకు స్పష్టత ఇవ్వనున్నట్లు కర్ణాటక అధికారుల నుంచి తెలిసింది. ఆంధ్ర వాటా నీటి విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.ఆగిపోయిన మరమ్మతులు గత ఏడాది 19వ నెంబర్ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోవడంతో దాని స్థానంలో కొత్తగేటును ఏర్పాటు చేసేందుకు బోర్డు టెండర్లు పిలిచి ఏజెన్సీకి అప్పగించింది. ఎగువ నుంచి వరదనీరు జలాశయంలో వచ్చి చేరుతుండటంతో మరమ్మతు పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. 40 టీఎంసీల నిల్వకు వరదనీరు చేరుకోవడంతో పనులు చేయడం సాధ్యం కాదని ఏజెన్సీ నిర్వాహకులు ఆపినట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఏడాది క్రస్ట్‌గేట్ స్థానంలో అమర్చిన శాశ్వత బ్లాక్ గేట్ పూర్తిగా ఏడాది పాటు అలాగే ఉంచేసే పరిస్థితి నెలకొంది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
ఆదివారం
22, జూన్, 2025

# గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు.. భారత్ మౌనం వీడాలన్న సోనియా గాంధీ



**న్యూఢిల్లీ-నవభూమి:** గాజా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమం పట్ల భారత్ మౌనంగా ఉండడాన్ని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ తప్పుపట్టారు. భారత్ తన స్వరాన్ని కోల్పోవడమే కాదు, విలువల్ని సరెండర్ చేసినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు. ద హిందూ ఆంగ్ల దినపత్రికలో సోనియా రాసిన వ్యాసాన్ని పబ్లిష్ చేశారు. ఇండియాన తన స్వరాన్ని వినిపించేందుకు ఇంకా ఆలస్యం కాలేదన్న టైటిల్‌తో ఆ ఐటమ్‌ను రాశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ అంశంపై గతంలో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయడంలో కేంద్రంలోని మోదీ సర్కారు విఫలమైనట్లు ఆమె పేర్కొన్నారు.

భారత్ తన వైఖరిని స్పష్టం చేయడంలో ఆలస్యాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఇప్పటికైనా ఆలస్యం కాలేదని, భారత్ తన నిర్ణయాన్ని స్పష్టంగా తెలుపాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పశ్చిమాసియాలో ఉన్న ఉద్రిక్త పరిస్థితులను తగ్గించేందుకు దౌత్యపరమైన చర్చలు చేపట్టాలని ఆమె తన వ్యాసంలో సూచించారు. పశ్చిమాసియా అంశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధ్వంసకర వైఖరిని ఆమె ఖండించారు.

# అమెరికాకు ఎవరూ శాశ్వత మిత్రులు కారు.. అంతా వ్యాపారమే




**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విమర్శలు గుప్పించారు. 'అమెరికా తమ ప్రయోజనాల కోసం ఏమైనా చేయగలదు.. వారు నిజంగా ఏ దేశానికీ శాశ్వత మిత్రులు కారు' అని అన్నారు. ట్రంప్, పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌కు వైట్ హౌస్‌లో ఇచ్చిన విందుపై మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికా అధ్యక్షుడు తన ఇష్టానుసారంగా ఆహ్వానాలు ఇస్తాడు.... మనం ఆయన్ను ఎవరిని భోజనానికి పిలవాలి, ఎవరిని పిలవకూడదో చెప్పలేం. మేము ఆలోచించేది ఏంటే అమెరికా అధ్యక్షుడు మనకెంతో ప్రత్యేక మిత్రుడు అనుకుంటాం. కానీ స్పష్టంగా చెప్పాలంటే అమెరికా తనకు ప్రయోజనాలు కలిగే చోటే నిలుస్తుంది.. ఇది ఓ రకంగా వ్యాపారమే' అని సీఎం అబ్దుల్లా వ్యాఖ్యానించారు. పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ట్రంప్ లంచ్ ఆహ్వానంపై విమర్శలు వస్తోన్న విషయం తెలిసిందే. తన తండ్రి ఫరూఖ్ అబ్దుల్లాతో కలిసి వందే భారత్ రైలులో జమ్మూ వరకు ప్రయాణించి మళ్లీ అందులోనే ఒమర్ అబ్దుల్లా తిరిగొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రయాణం బాగోలేదంటే, మళ్లీ రైల్లో ఎలా వచ్చేవాడ్ని? వెయిటింగ్ లిస్టు మొదలైందంటేనే ఇది ఎంత ప్రజాదరణ పొందిందో అర్థం అవుతుంది.. దీని సామర్థ్యాన్ని, ఫ్రీక్వెన్సీని పెంచాలి.. కొన్ని రోజుల్లోనే ఇది విజయవంతమైన సేవగా మారింది' అని అన్నారు. కశ్మీర్‌కు ఇటీవలే వందేభారత్ రైలును మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే.

అలాగే, ఇరాన్-ఇజ్రాయేల్ యుద్ధంపై శాంతికి పిలుపునిచ్చారు. "ఈ బాంబుల దాడులు కొనసాగడం మంచిది కాదు... ఇరాన్ అణు బాంబును తయారుచేయగలదని అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు కూడా అంతకుముందు స్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ, ఇజ్రాయేల్ కొన్ని నెలల్లోనే దాడికి దిగింది. ఈ యుద్ధం ఆగాలి. సమస్యలు చర్చలు ద్వారానే పరిష్కరించాలి" అని ఆయన అన్నారు. ఇజ్రాయేల్ దాడులతో ఇరాన్‌లో చదువుతున్న విద్యార్థులపై భద్రతపై ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. 'వారి ఒక్కసారిగా తీసుకొచ్చే అవకాశం లేదు. విమానాశ్రయాలు, పోర్టులు మూసేశారు... మొదట రోడ్డు మార్గంలో బాంబు దాడులు జరగని నగరాలకు తరలిస్తున్నాం, అక్కడి నుంచి అర్మేనియా గుండా తీసుకొస్తున్నాం. ఈ రోజు 300-400 మంది విద్యార్థులు తిరిగి వస్తున్నారు. వీరిలో చాలా మంది జమ్ము కశ్మీర్‌కు చెందినవారే. వాళ్లను సురక్షితంగా ఇంటికి తీసుకువస్తాం' అని పేర్కొన్నారు.

లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలపై ప్రశ్నకు ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. "నేను ఎప్పుడూ లెఫ్టినెంట్ అధికారాలు గురించి ఎప్పుడూ మాట్లాడలేదు.. మీరు జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్ చట్టాన్ని చూస్తే ఎల్జీ బాధ్యత భద్రత, శాంతి భద్రత వ్యవస్థపై మాత్రమేనని చెప్పినప్పటికీ, మేము రూపొందించిన బిజినెస్ రూల్స్‌కు ఆయన సంతకం చేసి పంపాలి. అప్పుడు స్పష్టత వస్తుంది. మిగతా అన్ని అధికారులు మాకే ఉంటాయి' అని సమాధానం ఇచ్చారు.

## భారత్ ఇకపై ఉగ్రవాద బాధితురాలిగా ఉండదు.. రాజ్‌నాథ్



**న్యూఢిల్లీ-నవభూమి:** దాయాది పాకిస్థాన్‌కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదం విషయంలో భారత్ స్పష్టమైన వైఖరితో ఉందన్నారు. ఇకపై ఉగ్రవాదానికి భారత్ బాధితురాలిగా మిగిలిపోదని వ్యాఖ్యానించారు. ఉగ్ర చర్యలకు వ్యూహాత్మకంగా బదులిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్ తో బలమైన సందేశం పంపామన్నారు. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. ఇది కేవలం విరామం మాత్రమే' అని అన్నారు. %జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్‌లో నార్తర్న్ కమాండ్ వద్ద సైనికులతో ఆయన ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు, వారిని పోషిస్తున్న వారికి గట్టి సందేశం ఇచ్చాం. ఇకపై భారత్ ఉగ్రవాద బాధితురాలిగా ఉండదని, బలమైన వ్యూహంతో స్పందిస్తుందని శక్తివంతమైన సందేశాన్ని పంపాం' అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడంలో సాయుధ దళాలు, నిఘా సంస్థల కృషిని ఆయన ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, సరిహద్దు దాటి ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చే వారికి ఓ హెచ్చరిక అని తెలిపారు. భారత్ ఇకపై ఉగ్రవాదాన్ని సహించదని స్పష్టం చేశారు. దేశ ఐక్యత, సమగ్రతకు హాని కలిగిస్తే తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు.

## ఇక ఆ వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయరు.. జూలై ఒకటి నుంచి ఢిల్లీలో ఆ రూల్ అమలు



**న్యూఢిల్లీ-నవభూమి:**కాలం చెల్లిన వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోయరాదన్న కొత్త నిబంధనలను ఢిల్లీలో అమలు చేయనున్నారు. స్థానిక వాహనాలకే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ఢిల్లీకి వచ్చే వెహికిల్స్ కు పెట్రోల్, డీజిల్ పోయరాదు అని నిర్ణయించారు. ఎండ్ ఆఫ్ లైఫ్(ఈఓఎల్) వాహనాలకు ఈ నిబంధన వర్తించనున్నది. రిజిస్ట్రేషన్ చేసి పదేళ్లు దాటిన డీజిల్, 15 ఏళ్ల దాటిన పెట్రోల్ వాహనాలకు.. ఢిల్లీలో ఇంధనం పోయరు. జూలై ఒకటో తేదీ నుంచి ఈ కొత్త రూల్ అమలులోకి రానున్నట్లు కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్మెంట్(సీఏక్యూఎం) పేర్కొన్నది. ఏప్రిల్‌లోనే ఢిల్లీలో ఉన్న పెట్రోల్ పంపులకు మార్గదర్శకాలు జారీ చేశారు. జూలై ఒకటి నుంచి ఈఓఎల్ వాహనాలకు ఇంధనం పోయకూడదని ఆదేశించారు.ఢిల్లీలో సుమారు 520 పెట్రోల్ బంకులు ఉన్నాయి. దాంట్లో 500 బంకుల్లో ఆటోమేటెడ్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. మిగితా వాటిల్లో జూన్ 30వ తేదీగా ఆ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పదేళ్లు దాటిన డీజిల్, 15 ఏళ్లు దాటిన పెట్రోల్ వాహనాలను ఆ కెమెరాలను గుర్తుపట్టేస్తాయి. ఢిల్లీతో పాటు అత్యధిక సంఖ్యలో వాహనాలు తిరిగే పరిసర ప్రాంతాలైన గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతం బుద్ నగర్, సోనిపట్‌లో కూడా నవంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధన వర్తింపచేయనున్నారు. ఈ ప్రాంతాల్లో ఏఎన్పీఆర్ కెమెరాలను అక్టోబర్ 31వ తేదీ లోగా ఏర్పాటు చేయనున్నారు.ఎన్సీఆర్ ప్రాంతంలో ఉన్న మిగితా జిల్లాలకు మరింత అదనపు సమయాన్ని కేటాయించారు. 2026, మార్చి 31వ తేదీ వరకు ఆ జిల్లాలకు మినహాయింపు కల్పించారు. ఆ జిల్లాల్లో ఉన్న పెట్రోల్ బంకులు అప్పటి వరకు కెమెరాలను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈఓఎల్ వాహనాలకు అక్కడ ఇంధన పోయరు. ఈఓఎల్ బస్సులు ఇండియాలో ఎక్కడ రిజిస్ట్రేషన్ అయినా.. వాటికి ఆయల్ పోయరని సీఏక్యూఎం సభ్యుడు వీరేందర్ శర్మ తెలిపారు. ఈ రూల్‌ను అమలు చేసేందుకు 100 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సిద్దంగా ఉన్నట్లు చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించే పెట్రోల్ స్టేషన్లపై కఠన చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు.ఢిల్లీలో 62 లక్షల ఈఓఎల్ వాహనాలు ఉన్నాయి. వాటిల్లో 41 లక్షలు టూవీలర్లే. ఎన్సీఆర్ ప్రాంతంలో ఈఓఎల్ వాహనాల సంఖ్య 44 లక్షలు ఉంటుందని సీఏక్యూఎం తెలిపింది. వాహన్ డేటాబేస్ నుంచి ఏఎన్పీఆర్ కెమెరాల ఈఓఎల్ వాహనాలను గుర్తిస్తాయని శర్మ తెలిపారు.

## కాపురంలో చిచ్చు పెట్టిన సెల్ ఫోన్

**బెంగళూరు-నవభూమి:** మొబైల్ ఫోన్ వల్ల లాభాలు ఎన్ని ఉన్నాయో.. అంతకంటే ఎక్కువగా నష్టాలే ఉన్నాయి. ఒకసారి సెల్‌ఫోన్ అడిక్షన్‌లోకి వెళ్లిపోతే.. బయటపడటం చాలా కష్టం. సెల్ ఫోన్ అధికంగా వాడటం వల్ల ఆరోగ్యం మాత్రమే కాదు బంధాలు కూడా దెబ్బ తింటున్నాయి. సెల్ ఫోన్లు కాపురాల్లో కూడా చిచ్చు పెడుతున్నాయి. తాజాగా, ఓ వ్యక్తి తన భార్య ప్రాణాలు తీశాడు. భార్య సెల్ ఫోన్ ఎక్కువగా వాడుతోందన్న కోపంతో గొడపడి ఆమెను చంపేశాడు. ఈ సంఘటన కర్ణాటకలో గురువారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. కర్ణాటక, ఉడిపిలోని కొలంబ గ్రామానికి చెందిన 42 ఏళ్ల గణేష్ పూజారికి.. అదే ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల రేఖకు 8 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణేష్ పూజారి పెయింటర్‌గా పని చేస్తుండగా.. రేఖ పెట్రోల్ బంక్‌లో పని చేస్తోంది. రేఖ ఎక్కువ సేపు మొబైల్ ఫోన్ వాడుతూ ఉండేది. ఇది గణేష్‌కు నచ్చేది కాదు. ఆమెతో గొడవపెట్టుకునే వాడు. సెల్ ఫోన్ విషయంలో భర్త వేధింపులు రోజురోజుకు ఎక్కువ అవటంతో రేఖ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.పోలీసులు గణేష్‌కు కౌన్సిలింగ్ ఇచ్చి పంపేశారు. పోలీసులు చెప్పినా అతడిలో మార్పు రాలేదు. గురువారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత అతడు ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవ పెట్టుకున్నాడు. గొడవ సందర్భంగా భార్యను కత్తితో పొడిచి చంపేశాడు. భార్యను చంపేసిన తర్వాత అక్కడినుంచి పారిపోయాడు. రేఖ మర్డర్ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### ఎయిరిండియా హ్యాంగర్ ఆఫర్ తిరస్కరించిన బ్రిటన్..

# ఆరుబయటే ఫైటర్ జెట్ పార్కింగ్!



**న్యూఢిల్లీ-నవభూమి:**సాంకేతిక సమస్యతో కేరళలో వారం రోజుల కిందట అత్యవసరంగా ల్యాండైన ప్రపంచంలో అత్యంత ఖరీదైన బ్రిటన్‌కు చెందిన ఎఫ్-35బీ ఫైటర్ జెట్ హ్యాంగర్‌లో పార్క్ చేయలేదు. దీనికి సంబంధించిన ప్రత్యేక సాంకేతికతను ఇతరులకు తెలియకుండా ఉంచాలనే ఉద్దేశంతో బ్రిటన్ నేవీ ఎయిరిండియా ఇచ్చిన ఆఫర్‌ను తిరస్కరించింది. జూన్ 14న ఇంధనం తక్కువగా ఉండటంతో ఈ యుద్ధ విమానం తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ప్రస్తుతం దీనిని ఆరుబయటే పార్కింగ్ చేశారు.బ్రిటన్ నేవీకి చెందిన ఎఫ్-35బీ యుద్ధ విమానాన్ని అమెరికా తయారు చేసింది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఈ విమానంలో అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉన్నాయి. హెచ్ఎమ్ఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ స్ట్రైక్ గ్రూప్‌లో భాగమైన దీనిని ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మోహరించారు. ఇది భారతీయ నేవీతో కలిసి నావికాదళ విన్యాసాల్లో పాల్గొంది. జూన్ 14న విమానంలో ఇంధనం తక్కువగా ఉందని సంకేతాలు రావడంతో పైలట్ కేరళలో ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఈ విషయాన్ని ఆ మర్నాడు ధ్రువీకరించింది. "అవసరమైన సాయం చేస్తామని" ప్రకటించింది. అప్పటి నుంచి విమానాన్ని ఆరుబయటే ఉంచారు. హైడ్రాలిక్ వ్యవస్థలో సమస్యను పరిష్కరించడానికి బ్రిటన్ నిపుణులు, పైలట్ ప్రయత్నిస్తున్నారు. విమానానికి భద్రతను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. యుద్ధ విమానం పౌర విమానాశ్రయంలో కనిపించడంతో ప్రయాణికులు ఆసక్తిగా చూస్తున్నారు. విమానాన్ని హ్యాంగర్‌లో ఉంచడానికి ఎయిర్ ఇండియా సహాయం చేయడానికి ముందుకు వచ్చింది. కానీ బ్రిటన్ నేవీ సున్నితంగా తిరస్కరించింది. అయితే, చివరి తనిఖీల సమయంలో విమానాన్ని హ్యాంగర్‌కు తరలించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు ఉండటంతో ఇతర దేశాలు ఈ టెక్నాలజీని సమీక్షించే అవకాశాన్ని బ్రిటన్ నివారించాలని భావించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అందువల్లే, ఎయిర్ ఇండియా హ్యాంగర్‌లో పార్క్ చేయాలన్న ఆఫర్‌ను రాయల్ నేవీ తిరస్కరించిందని తెలిపాయి. 'ప్రొటెక్టెడ్ టెక్నాలజీస్' పై ఉన్న భద్రతా ఆందోళనలు తరలింపులో జాప్యానికి దారితీసినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని అత్యాధునిక యుద్ధవిమానాలలో ఒకటి కావడంతో దానిని చూసేందుకు ఏవియేషన్ ప్రేమికులు, సాధారణ ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

మరోవైపు, సోషల్ మీడియాలో దీనిపై అనేక రకాల మీమ్స్, ఫన్నీ పోస్టులు పెడుతున్నారు. అంతేకాదు, ఈ అత్యంత శక్తివంతమైన యుద్ధ విమానాన్ని ప్రముఖ ఆన్‌లైన్ ఈ కామర్స్ సైట్ అమ్మకానికి పెట్టారంటూ నెట్టింట్ ఓ పోస్ట్ వైరల్ అయ్యింది. దీని ధరను 4 మిలియన్ల డాలర్లుగా నిర్ణయించినట్టు ఫేక్ పోస్టులు సృష్టించడం గమనార్హం.

# పాకిస్థాన్‌కు అత్యాధునిక చైనా J-35 జెట్



**న్యూఢిల్లీ-నవభూమి:**గతేడాది నవంబరులో ఐదో తరం రెండో యుద్ధ విమానం జీ-35ను చైనా ఆవిష్కరించిన విషయం తెలిసిందే. రెండు ఇంజిన్లు కలిగిన ఈ సూపర్‌సోనిక్ మల్టీ-రోల్ జెట్..యాక్టివ్ ఎలక్ట్రానిక్ స్కాన్డ్ అర్రే, ఎలక్ట్రో-ఆప్టికల్ టార్గెటింగ్ సిస్టమ్, ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ వ్యవస్థలు సహా అత్యాధునిక అవియోనిక్స్ కలిగి ఉంటుంది. చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్,.. ఈ యుద్ధ విమానాన్ని అమెరికాకు చెందిన ఖరీదైన -35తో పోల్చుతూ,. స్టెల్త్ కంబాట్ ఫ్రేమ్‌వర్క్‌లలో పనిచేస్తుంది.. దీని లక్ష్యం గగనతలంలో ఆధిపత్యం చెలాయించడం. శత్రువులకు చెందిన అత్యాధునిక ఫైటర్ జెట్లు, భూ లేదా ఉపరితల వైమానిక రక్షణ దళాలు, అలాగే యుద్ధ విమానాలు, బాంబర్లు, క్రూయిజ్ క్షిపణుల సహా శత్రు వైమానిక లక్ష్యాలను అడ్డుకోవడంపై దృష్టి పెడుతుంది' అని పేర్కొంది.అయితే, ఈ అత్యాధునిక యుద్ధ విమాలను పాకిస్థాన్‌కు చైనా అందజేయనుంది. పాకిస్థాన్ వద్ద ఇప్పటికే JF-17, జీ-10జ% వంటి 20కిపైగా చైనా యుద్ధ విమానాలు ఉన్నాయి. తాజా నివేదికల ప్రకారం.. చైనాకు చెందిన 40 J-35 జెట్‌లను పాకిస్థాన్ కొనుగోలు చేయనుంది.. అందులో మొదటి విడత ఈ ఏడాది అందజేయనుంది.. దీంతో స్టెల్త్ యుద్ధ విమానాలు కలిగిన అరుదైన దేశాల జాబితాలో పాక్ చేరుతుంది. పాకిస్థాన్‌కు ఎగుమతులకు అనువైన జీ-31లను కూడా చైనా నుంచి కొనుగోలు చేస్తోంది. వీటికి కూడా స్టెల్త్ ఫీచర్లు ఉంటాయని తెలుస్తోంది.

**భారత్ ఆందోళన ఎందుకు?**

భారత్ వద్ద ప్రస్తుతం ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం లేదు. పాక్ స్టెల్త్ ఫైటర్లను ప్రవేశపెట్టడం వల్ల వైమానిక దళం సమతౌల్యతో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అమెరికాకు చెందిన ఎఫ్-35 స్థాయిలోనే చైనా జీ-35 0.001 చ .మీ. దీని వల్ల భారత రాడార్లు ముఖ్యంగా సరిహద్దుల్లో వీటిని గుర్తించడం ఆలస్యం అవుతుంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టామంటే అది మన రాడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలే కారణం.

**భారత్ ఏఎంసీఏ ప్రాజెక్ట్**

భారత్ అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌కి ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. కానీ ఈ యుద్ధవిమానం 2034-35 నాటికి మాత్రమే భారత గగనతలంలో సేవలకు సిద్ధమవుతుంది. ఈ లోపు పాక్ వాయుసేనలోకి J-35ల చేరితే భారత వైమానిక దళానికి సవాల్‌గా నిలవొచ్చు. అలాగే, రూ.30 వేల కోట్లతో భారత సైన్యానికి అత్యాధునిక క్షిపణి వ్యవస్థ క్యూఆర్ శామ్‌ను రక్షణ శాఖ సమకూర్చనుంది.

**రఫేల్‌లతో ఆధిపత్యం**

భారత వైమానిక దళం ఇప్పటికే ఫ్రాన్స్ నుంచి కొనుగోలుచేసిన అత్యాధునిక రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి. 2031 నాటికి 60కిపైగా రఫేల్ విమానాలు భారత గగనతలంలో సేవలు అందిస్తాయి. కానీ J-35 రాకతో ఆ ఆధిపత్యం కొంతవరకు తగ్గవచ్చు. వైమానికి దళ రిటైర్డ్ గ్రూప్ కెప్టెన్ అజయ్ అహ్లావత్ మాట్లాడుతూ.. 'పాక్ జె-35ను పొందడం గమనార్హం. వాటి పనితీరుతో బహుశా మన వైమానిక దళం ప్రభావితం కావచ్చు. J-35, Su-57 వంటి మనకు మంచివి కావు. మనకు సరైన మార్గం AMCA మాత్రమే. దీనిని నేషనల్ మిషన్ మోడ్‌లో వెంటనే ముందుకు తీసుకెళ్లాలి' అని అన్నారు.

### జమ్ముకశ్మీర్ నుంచి న్యూయార్క్ వరకూ..

## యోగాసనాలు వేసిన ప్రముఖులు, పౌరులు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ యోగా దినోత్సవం సంబురంగా సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల ప్రముఖులు, పౌరులు యోగాసనాలు వేస్తూ సందడి చేశారు. జమ్ముకశ్మీర్ నుంచి టోక్యో, న్యూయార్క్ సిటీ వరకూ ఎక్కడ చూసినా యోగముద్రలో ఉన్న జనంతో కోలాహల వాతావరణం కనిపించింది. ప్రధాని నరేంద్ర మోడీ ( విశాఖపట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డెహ్రాడూన్‌లో యోగా డేలో ఆసనాలు వేశారు.



జపాన్ ప్రధాని భార్య యొషికొ ఇషిబాటోక్యోలో వేలాది మందితో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్‌లో బాలీవుడ్ వెటరన్ అనుపమ్ ఖేర్( ఉత్సాహంగా యోగాసనాలు వేస్తూ కనిపించారు.

సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే భారత సైనికులు సైతం యోగా డేలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సరిహద్దు భద్రతా దళానికి చెందిన సోల్జర్స్ అమృత్‌సర్‌లోని అట్టారీ సరిహద్దు వద్ద పలు యోగాసనాలు వేస్తూ.. కాసేపు ధ్యానముద్రలో ఉండిపోయారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్, రక్షణ శాఖ మంత్రివర్యులు రాజ్‌నాథ్ సింగ్‌లు కూడా యోగ చేస్తూ ప్రశాంతంగా గడిపారు.

శనివారం ఉదయం విశాఖ సాగర తీరంలో 'ఒకే భూమి.. ఒకే ఆరోగ్యం కోసం యోగా' అనే థీమ్‌తో జరిగిన యోగాంధ్ర వేడుకలో పాల్గొన్న ప్రధాని.. ప్రపంచానికి శాంతి సందేశం వినిపించారు. 'ఈ రోజుల్లో యోగా అనేది ప్రతిఒక్కరికి అవసరం. వయసు, దేశం విదేశం వంటి తారతమ్యాలు లేకుండా ప్రతి పౌరుడు యోగా చేయాలి. దాంతో, మనలోని ప్రశాంతత.. అంతర్జాతీయ విధానంగా మారే అవకాశముంది' అని మోడీ తెలిపారు.

# అమెరికా వీసా ఇంటర్వ్యూలు రీస్టార్ట్.. వాటికి మాత్రం డేంజర్




**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికాలో చదువుకోవాలని కలలు కంటున్న విదేశీ విద్యార్థులకు, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు శుభవార్త. కొన్నాళ్లుగా ఆగిపోయిన అమెరికాస్టూడెంట్ వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ మళ్లీ మొదలైంది. అయితే, అమెరికా ఒక కొత్త రూల్ తీసుకొచ్చింది. అదేంటంటే, వీసా కోసం అప్లై చేసే ప్రతి విద్యార్థి సోషల్ మీడియా ఖాతాలను తప్పకుండా చెక్ చేస్తారు. ఈ కొత్త గైడ్‌లైన్స్‌ను అమెరికా విదేశాంగ శాఖ తాజాగా విడుదల చేసింది.

**సోషల్ మీడియా వెట్టింగ్ అంటే ఏంటి?**

ఈ "సోషల్ మీడియా వెట్టింగ్" అనేది అమెరికాలోకి రావాలనుకునే ప్రతి వ్యక్తిని పక్కాగా పరిశీలించడానికి ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. వీసా అప్లికేషన్ పెట్టుకున్న విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను అమెరికా కాన్సులర్ అధికారులు చాలా జాగ్రత్తగా, క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. దీని కోసం అప్లై చేసే వాళ్లు తమ సోషల్ మీడియా అకౌంట్స్‌లో ఉండే ప్రైవసీ సెట్టింగ్స్‌ను మార్చుకుని, వాటిని పబ్లిక్ ఆప్షన్‌లో పెట్టుకోవాలి. అప్పుడే అధికారులు వాటిని చెక్ చేయగలరు. ఈ ఏడాది మే చివరి వారం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా అప్లై చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూలను ఆపేశారు. సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం, అందుకే వీసాలు ఆపామని అప్పట్లో విదేశాంగ శాఖ చెప్పింది. ఇప్పుడు ఆ సన్నాహాలు పూర్తవడంతో, సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేస్తూ వీసా అపాయింట్‌మెంట్ ప్రక్రియను మళ్ళీ స్టార్ట్ చేశారు.

**ఎందుకు ఈ సోషల్ మీడియా చెకింగ్?**

వీసా అప్లై చేసిన విద్యార్థులకు పర్మిషన్ ఇవ్వొచ్చా లేదా అని తెలుసుకోవడానికి, వాళ్ల ఆన్‌లైన్ యాక్టివిటీస్‌ను అధికారులు చెక్ చేస్తారు. ఇదే 'సోషల్ మీడియా వెట్టింగ్'. విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైల్స్ చూసిన తర్వాతే వీసా ఇస్తారు. దీని వెనుక ఉన్న కారణం ఏంటంటే, దేశ భద్రతకు సంబంధించి ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనేది అమెరికా ఉద్దేశం.

ఉదాహరణకు, ఎవరైనా స్టూడెంట్ తమ సోషల్ మీడియా అకౌంట్‌లో పాలస్తీనా జెండాను పోస్ట్ చేస్తే, ఆ వ్యక్తిని మరింత డీటెయిల్‌గా పరిశీలిస్తారు. వాళ్ల వల్ల దేశ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతే వారిని అమెరికాలోని యూనివర్సిటీల్లో చదువుకోవడానికి అనుమతిస్తారు. అప్పుడే వాళ్లకి స్టూడెంట్ వీసా వస్తుంది. అంటే, మీ సోషల్ మీడియా పోస్టులు, లైక్స్, షేర్స్ అన్నీ వాళ్లు చూస్తారన్నమాట. కాబట్టి, అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులు తమ సోషల్ మీడియా ఖాతాలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి! అనవసరమైన, వివాదాస్పద పోస్టులు ఉంటే ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

అయితే మేఘా వేమూరి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తాను ఎదుర్కొంటున్నది పాలస్తీనా ప్రజల కష్టాలతో పోలిస్తే చాలా తక్కువ అని.. వారి ఆశయానికి తాను సహాయపడాలంటే ఇంకా ఎక్కువ భరించగలనని తెలిపారు. తనకు తన కుటుంబం అండగా నిలిచిందని.. ఎంఐటీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో రెండో రోజు తమను అనుమతించకపోవడంతో తాను ఏ మాత్రం నిరాశపడలేదని ఆమె తేల్చి చెప్పారు. పాలస్తీనా మారణహోమంలో భాగస్వామి అయిన ఒక సంస్థ వేదికపై తాను నడవాల్సిన అవసరం లేదని భావిస్తున్నానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే ఎలాంటి అర్హత లేకుండా లేదా సరైన ప్రక్రియ లేకుండా నిర్దిష్ట విధానాన్ని ఉల్లంఘించారన్న సూచన లేకుండా తనను శిక్షించడానికి ఎంఐటీ అధికారులు తమ పరిధిని దాటినందుకు తాను నిరాశ చెందినట్లు ఆమె తెలిపారు. ఎంఐటీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో న్యూరోసైన్స్ గ్రాడ్యుయేట్ అయిన మేఘా వేమూరి.. తన లింక్డిన్, ఎక్స్ ఖాతాలను తొలగించారు.



## తేమతో తళుక్కుమనేలా





తేమతో నవనవలాడే చర్మం అందరి సొంతం కాదు. కొందరి చర్మం ఎన్ని జాగ్రత్తలు పాటించినా తేమ కోల్పోయి, పొడిబారిపోతూ ఉంటుంది. అలాంటి చర్మం కలిగిన వాళ్లు మేక్‌పతో లోపాన్ని సరిదిద్దుకోవచ్చు. మృతకణాలు తొలగించి చర్మం మీద మృతకణాలు పేరుకుపోయినా, చర్మం గరుకుగా మారి, పొడిబారిపోతుంది. కాబట్టి ఎప్పటికప్పుడు మృతకణాలను తొలగిస్తూ ఉండాలి. అందుకోసం చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తూ, నునుపుగా మార్చుకోవాలి. అందుకోసం ఉపయోగించే స్క్రబ్ చర్మానికి హాని కలిగించనిదై ఉండాలి.

చర్మానికి తేమను అందించి, మేక్‌పకు అనువుగా మార్చడం కోసం తప్పనిసరిగా హైడ్రేటింగ్ సీరం వాడుకోవాలి. ఈ సీరంను క్రమం తప్పక వాడితే, చర్మంలో జీవ కళ ఉట్టిపడడంతో పాటు, సుతిమెత్తగా, కాంతివంతంగా తయారవుతుంది.

ప్రైమర్ ఫౌండేషన్‌కు ముందు ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. ఇలా చేయడం వల్ల మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. అలాగే చర్మంలోని తేమ తరిగిపోకుండా కాపాడుతుంది.

# ఉప్పొంగే కెరటం






చదువంటే ఇష్టం. నృత్యం అంటే ప్రాణం. సెయిలింగ్ కోసం అన్నిటినీ పక్కన పెట్టారు నేత్ర కుమనన్. ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తొలి మహిళా సెయిలర్‌గా చరిత్రకెక్కారు. ఇప్పుడు ప్యారిస్‌లో పతకాల పంట పండించడానికి సిద్ధమయ్యారు.

"ఎన్నో క్రీడలతో, కళలతో నాకు పరిచయం ఉంది. కొన్నిటిలో ప్రావీణ్యం కూడా ఉంది. కానీ అవేవీ సెయిలింగ్ స్థాయిలో సవాల్ విసరలేదు" అంటారు నేత్రా కుమనన్. తమిళనాడులోని చెన్నైకి చెందిన ఈ 26 ఏళ్ళ అమ్మాయి ప్యారిస ఒలింపిక్స్‌లో... సెయిలింగ్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది ఆమెకు రెండో ఒలింపిక్స్. 2020లో టోక్యో ఒలింపిక్స్‌కు ఎంపికై, సెయిలింగ్‌లో భారత్ తరఫున పోటీ పడిన తొలి మహిళగా నిలిచారు. ఈసారి కూడా ఆ విభాగంలో మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక మహిళ ఆమే కావడం విశేషం.

**అదే బాగా నచ్చింది...**

"మా నాన్న వి.సి.కుమరన్ పారిశ్రామికవేత్త. అమ్మ శ్రీజ హెచ్‌ఆర్ రంగ నిపుణురాలు. ఏటా వేసవి సెలవుల్లో నన్ను, నా తమ్ముడు నవీన్‌ను ఏదో ఒక సమ్మర్ క్యాంపులో చేర్చేవారు. పన్నెండేళ్ళకే అనేక అంశాల్లో నేను ప్రావీణ్యం సాధించాను. 2009లో 'తమిళనాడు సెయిలింగ్ అసోసియేషన్' ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌లో సెయిలింగ్ నాకు పరిచయమయింది" అంటున్న నేత్ర... రెండుసార్లు నేషనల్ ఛాంపియన్‌గా, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచారు. "అప్పటి నుంచే సెయిలింగ్‌ను ఒక కెరీర్‌గా తీసుకున్నాను. దాని కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచీ నేను మెరిట్ స్టూడెంట్‌ను. కానీ సెయిలింగ్‌వల్ల నా చదువుకు చాలాసార్లు బ్రేక్ పడింది. నా ఫ్రెండ్స్ కన్నా నాలుగేళ్ళు వెనుకబడ్డాను. ఈ మధ్యే మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఇప్పుడు ఎంబీఏ చేస్తున్నాను. అయితే.. ఒకటి సాధించాలంటే రెండోది వదులుకోవాలి. ఇక... భరతనాట్యం అంటే నాకు ప్రాణం. పద్మభూషణ్ అలర్మేల్ వల్లి దగ్గర ఆరేళ్ళకు పైగా శిక్షణ పొందాను. సింగపూర్, వియత్నాం, ఇండోనేషియాల్లో జరిగిన గ్లోబల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ కాంపిటిషన్స్‌లో బహుమతులు పొందాను. సెయిలింగ్ కోసం అది కూడా పక్కన పెట్టాల్సి వచ్చింది" అంటారు నేత్ర.

**అదే ప్రధానం**

భారత్‌లో సెయిలింగ్ ను ఎంచుకొనే మహిళల సంఖ్య చాలా తక్కువ. ఈ కోణంలో చూసినప్పుడు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న నేత్ర ప్రత్యేకత ఏమిటనేది స్పష్టమవుతుంది. "ఒంటి చేత్తో, ఒక చిన్న డింగీ లాంటి బోటును నడిపే 'లేజర్ రేడియల్' కేటగిరీ' సెయిలర్‌ని నేను. సముద్రం, గాలి, ఉష్ణోగ్రత, అలలు... ఇలా ప్రకృతిలోని ప్రతదాన్నీ అర్థం చేసుకోవాలి. ఇది మానసిక క్రీడ. ఏదీ మన నియంత్రణలో ఉండదు. మనం ప్రకృతితో పోటీ పడలేం. క్షణాల వ్యవధిలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే గెలుపు, ఓటములను పెద్దగా పట్టించుకోను. మనం ఎంత పోటీ ఇస్తున్నామనేదే ప్రధానం" అంటారు నేత్ర. 2021లో శిక్షణ ప్రారంభించిన ఆమె... 2014 నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. 2014, 2018 ఆసియా క్రీడల్లో వరుసగా ఏడు, అయిదు స్థానాల్లో నిలిచారు. 2015 క్లాస్ ఛాంపియన్‌షిప్‌లో, 2021, 2022 ఏషియన్ ఛాంపియన్‌షిపలలో రెండు స్వర్ణాలను, ఒక రజతాన్ని గెలిచారు. 2021లో అమెరికాలోని మియామీలో జరిగిన 'హెంపెల్ సెయిలింగ్ వరల్డ్ కప్ సిరీస'లో కాంస్య పతకం గెలిచి, ఆ ఘనత సాధించిన మొదటి భారతీయురాలిగా నిలిచారు. 2022 'యూరోపా కప్'లో కాంస్యం సాధించారు.

**అప్పుడు ఒత్తిడికి గురయ్యా...**

సెయిలింగ్ అభ్యాసం ప్రారంభించిన రెండేళ్ళలోనే ఆమె పతకాలు గెలవడం మొదలెట్టారు. 2015, 2016ల్లో వరుసగా నేషనల్ టైటిల్స్ అందుకున్నారు. ఆ తరువాత మెరుగైన శిక్షణ కోసం ఇజ్రాయిల్, ఇటలీ తదితర దేశాలకు వెళ్ళారు. 2017లో 'యాచ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ఆమెను 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్'కు ఎంపిక చేసింది. "వివిధ దేశాల్లో పెద్దగా ప్రాచుర్యం లేని క్రీడల్లో యువతను, ప్రత్యేకించి మహిళలను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన కార్యక్రమం ఇది" అని చెబుతారామె. 2020లో 'హెంపెల్ వరల్డ్ కప్ సిరీస'లో కాంస్య పతకం సాధించాక... స్పెయిన్‌లోని 'గ్రాన్ కనారియా సెయిలింగ్ అకాడమీ'లో చేరి... తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్నారు. "ఆమెను చూస్తే ఉప్పొంగే కెరటంలా అనిపిస్తుంది. ఎంత కష్టమైనా లక్ష్యాన్ని సాధించాలనే తపన ఆమెలో కనిపిస్తుంది" అంటూ కోచ్‌ల ప్రశంసలు అందుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో 35వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. "తీవ్రమైన ఒత్తిడికి గురి కావడమే దానికి కారణం. కానీ మన దగ్గర పెద్దగా ప్రాచుర్యం లేని ఈ క్రీడ మీద దేశం దృష్టిపడేలా చేసినందుకు సంతోషంగా ఉంది.. ఈసారి మరింత మెరుగ్గా రాణించడానికి శాయశక్తులా కృషి చేస్తాను" అని చెప్పారు నేత్ర. ఇప్పుడు ఆమెకు మరో అవకాశం రానే వచ్చింది. ఏప్రిల్‌లో జరిగిన క్వాలిఫయర్‌లో సత్తా చాటి... 'వరల్డ్ సెయిలింగ్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్' కోటాలో ప్యారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికయ్యారు. "ఇప్పుడు మరింత సన్నద్ధంగా ఉన్నాను. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనేది **నా ఆశయం" అంటున్నారు నేత్ర.**

స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్ లాంటి క్రీడలే కాదు, భరతనాట్యం, పెయింటింగ్ లాంటి కళలు, కరాటే, కలరిపయట్టు లాంటి యుద్ధ క్రీడల్లోనూ నేత్రకు ప్రావీణ్యం ఉంది.

## యోగమే సనాతన జీవన శైలి మార్గం






యోగా మన సనాతన సంప్రదాయంలో ప్రధాన జీవనాడి. మనిషిని భౌతికంగా దృఢంగా మారుస్తూనే, మానసిక శక్తిని ప్రచోదనం చేసే దివ్యమైన ఔషధం ఇది. ఎటువంటి పరికరాలూ, ప్రత్యేక పరిసరాలూ అవసరం లేకుండా, కేవలం శరీర భంగిమలను మార్చడం ద్వారా ఆరోగ్యాన్ని అందిపుచ్చుకునే అద్భుత రహస్యం యోగా సాధనలో దాగుంది. పేద, ధనిక భేద రహితంగా ఎవరైనా ఆచరించే యోగా మానవజాతికి తరగని నిధి. అంతేకాదు, సయాటికా, స్పాండిలైటిస్, డయాబెటిస్‌లాంటి నేటి జీవనశైలి రోగాలకూ అందులో మందు ఉందంటే%ా% వేల ఏండ్లనాటి యోగా మనదాకా రావడం వెనుక కారణమేంటో అర్థం చేసుకోవచ్చు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఏటా ఒక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేస్తుంటారు. ఆ ఏడాది లక్ష్యాలు, ఉద్దేశాలను అది తెలియజేస్తుంది. 2025 సంవత్సరానికి 'యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' అన్న నినాదాన్ని ముందుకు తెచ్చారు. ఇది భూమిని కాపాడుకుంటూ ఆరోగ్యాన్నీ కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. యోగా దినోత్సవం సందర్భంగా కొన్ని విలువైన యోగాసనాలు మీకోసం..

తాడాసనం..ఇది నిలబడి వేసే ఆసనం. నిటారుగా నిలబడి కాళ్లు రెండూ దగ్గరగా ఉంచి, చేతులను నిటారుగా ఉంచాలి. ఇప్పుడు రెండు చేతులనూ కలిపి అరచేతులు బయటి వైపునకు వచ్చేలా తిప్పాలి. అలాగే రెండు చేతుల్నీ పైకి నిటారుగా ఎత్తాలి. ఇదే సమయంలో మడమలనూ ఎత్తి మునివేళ్ల మీద పది పదిహేను సెకండ్లు నిలబడాలి. లాభాలు: నిరంతరం కూర్చుని ఉండే మన జీవనశైలి వల్ల శరీరం సరైన భంగిమలో ఉండదు. దాన్ని సరిచేయడానికి అంటే, శరీరాన్ని నిటారుగా ఉంచడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే ఎదిగే పిల్లలు ఈ ఆసనం వేస్తే ఎత్తు పెరుగుతారు. శరీరంలో ఉండే ఎముకలన్నీ చురుగ్గా మారతాయి.

వృక్షాసనం..నిటారుగా నిలబడి చేతులను కూడా సమంగా ఉంచాలి. తర్వాత ఒక బిందువును చూస్తూ కుడికాలిని చేతితో ఎత్తి పాదాన్ని ఎడమ తొడమీద ఉంచాలి. తర్వాత ఊపిరి తీసుకుంటూ రెండు చేతులూ పైకి ఎత్తి నమస్కార భంగిమలో కొద్ది సెకండ్లపాటు నిలబడాలి. శ్వాస వదులుతూ చేతులు కాళ్లు సాధారణ స్థితికి తెచ్చుకోవాలి. ఇలాగే రెండో కాలుతోనూ చేయాలి.

లాభాలు: ఇది క్రమం తప్పకుండా చేయడం వల్ల కాళ్లు బలపడతాయి. ఏకాగ్రత పెరుగుతుంది. శరీర సమతుల్యత ఏర్పడుతుంది. వెన్నునొప్పి, సయాటికాలాంటి సమస్యల నుంచి ఉపశమనం



లభిస్తుంది.

జాను శీర్షాసనం..ముందుగా సుఖాసనంలో కూర్చోవాలి. కుడికాలును ముందుకు కాకుండా పక్కగా (45 డిగ్రీల కోణం) చాపాలి. ఎడమకాలును చిత్రంలో చూపిన విధంగా వెనక్కి మలిచి పిరుదుకు ఆనించాలి. రెండు కాళ్ల పొజిషన్ టిక్ ( ) మార్కులా ఉండాలి.

ఇప్పుడు రెండు చేతులు ముందుకు సమాంతరంగా తీసుకొని కుడివైపునకు కొద్దిగా వంగాలి. నిదానంగా వంగుతూ కుడిచేతితో కుడికాలి వేళ్లను పట్టుకోవాలి. ఎడమ చేతిని నిటారుగా పైకి అనాలి.

అరచేతిని చూసేలా తల పైకెత్తాలి. ఈ ఆసన స్థితిలో 20 సెకండ్లపాటు ఉండాలి. ఊపిరి నెమ్మదిగా తీసుకుంటూ, వదలాలి. యథాతథ స్థితికి వచ్చిన తర్వాత కుడికాలిని వెనక్కి వంచి, ఎడమకాలును పక్కకు చాపాలి.

ఎడమ చేతితో కాలి వేళ్లను పట్టుకోవాలి. కుడిచేతిని పైకి అనాలి. అరచేతిని చూసేలా తల పైకెత్తాలి. ఈ భంగిమలో మరో 20 సెకండ్లు ఉండాలి.

లాభాలు: ఈ ఆసనం వేయడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. క్లోమ గ్రంథి (పాంక్రియాస్) మీద ఒత్తిడి పడటం వల్ల మధుమేహం అదుపులోకి వస్తుంది. కడుపుతో ఉన్నప్పుడు చాలామందికి షుగర్ వస్తుంది. దాని ప్రభావం గర్భిణి ఆరోగ్యం మీదే కాదు గర్భస్థ శిశువుపైనా పడుతుంది. అలాంటి వాళ్లకూ ఇది ఎంతో మేలుచేస్తుంది.

వజ్ర త్రికోణాసనం..ముందుగా వజ్రాసన స్థితిలో కూర్చోవాలి. అంటే, రెండు కాళ్లను వెనక్కి ముడుచుకొని, పాదాలు పిరుదుల కిందికి తీసుకోవాలి. ఇప్పుడు శరీరాన్ని కాస్త లిఫ్ట్ చేయాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి.

ఇప్పుడు నిదానంగా మోకాళ్లపై పైకి లేచి.. శ్వాస తీసుకోవాలి. ఊపిరి వదులుతూ కుడికాలును చిత్రంలో చూపించిన విధంగా పక్కకు జరపాలి. కుడిచేతిని కుడి మోకాలిపై ఉంచాలి. ఎడమ చేతిని నిటారుగా పైకెత్తాలి. మోచేయి ఎడమవైపు చూసే విధంగా ఉండాలి. ముఖాన్ని కాస్త పైకెత్తి ఎడమ అరచేతిపై దృష్టి నిలపాలి.

ఈ ఆసనస్థితిలో ఐదారుసార్లు నిదానంగా శ్వాసక్రియ కొనసాగించాలి.

తర్వాత మళ్లీ వజ్రాసన స్థితికి వచ్చి రెండోవైపు కూడా ఇదే విధంగా ఆసనం కొనసాగించాలి.

లాభాలు: వజ్ర త్రికోణాసనం వల్ల కటి ఎముకలు బలంగా తయారవుతాయి. కిడ్నీకి రక్త ప్రసరణ మెరుగవుతుంది. వెన్నెముక దృఢత్వం పెరుగుతుంది. సయాటికా నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. గర్భిణులు ఇలాంటి ఆసనాలు సాధన చేయడం వల్ల కాన్పు తర్వాత వాళ్ల శరీరంలో జరిగే మార్పులకు అడ్డుకట్ట వేయవచ్చు. ఆరోగ్యంగానూ ఉండవచ్చు.

నావాసనం..ముందుగా కాళ్లను చాపి మోకాళ్లను కొద్దిగా దగ్గరకు తీసుకోవాలి.

భుజాలు, వీపు నిటారుగా ఉంచి మోకాళ్ల మీద చేతులు పెట్టి కాస్త వెనక్కి వంగాలి.

ఇప్పుడు శ్వాస తీసుకుంటూ మోకాళ్ల కింద చేతులు పెట్టి పాదాలను గాలిలోకి లేపాలి.

ఇప్పుడు చేతుల్ని తీసేసి మోకాళ్ల పక్కగా నిటారుగా ఉంచాలి.

లాభాలు: నావాసనం చేసినప్పుడు కడుపు మీద ఒత్తిడి ఎక్కువగా పడుతుంది. ఇది పొట్ట ఎక్సర్‌సైజ్‌లలో ఒకటి. పొట్ట చదునుగా ఉండాలన్నా, కడుపు కండరాలు బలపడాలన్నా ఈ ఆసనం ఉపయోగపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరిచేందుకు సహకరిస్తుంది.

ఎన్నో లాభాలు..రోజూ క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల లెక్కకు మిక్కిలి లాభాలు ఉన్నాయి. ప్రాణశక్తిని ఉద్దీపింపజేసి, ఎముకలు, కండరాలను బలోపేతం చేస్తుంది. ఒంటిని వింటిలా వంచే సామర్థ్యం పట్టుబడితే ఇక శరీరం ఎంత చురుగ్గా ఉంటుంది అన్నదీయోగా ద్వారా తెలుసుకోవచ్చు.

నిరంతరం ఉత్సాహంగా ఉంటారు.

సానుకూల దృక్పథం అలవడుతుంది.

ఒత్తిడి తగ్గుతుంది.

యవ్వనంగా కనబడతారు.

తల, నడుము నొప్పులు, మైగ్రెయిన్‌లాంటివి ఉపశమిస్తాయి.

మంచి నిద్ర సొంతమవుతుంది.

## లెహెంగా ఎంచుకునే ముందు



పెళ్లి వేడుకల నుంచీ సంగీత్, మెహందీ, హల్దీ వంటి ప్రత్యేక వేడుకల వరకు లహంగా ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. మహిళల అందాన్ని, శైలి సొగసును ఆవిష్కరించే వస్త్రం ఇది. అయితే సరైన లహంగా ఎంచుకోవడం అనేది ఒక కళ. అందులో శరీరాకృతి, చర్మవర్ణం, సందర్భం, ఫ్యాబ్రిక్, రంగు, బడ్జెట్ అనేది పాత్ర పోషిస్తాయి. ఈ రచన ద్వారా మీకు సరిపోయే లహంగా ఎంపికలో మార్గదర్శకత్వం అందించబోతున్నాం. వేడుకేదైనా సరే ఆడంబరంగా కనిపించాలంటే లెహెంగాలు సరైన ఎంపిక. కానీ ఎండాకాలంలో వాటిని వేసుకోవడమంటే కాస్త చిరాకే. ముఖ్యంగా పెళ్లి కోసం ఎంచుకుంటుంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లి లెహెంగా గేరా ఎక్కువగా ఉండటం కోసం ఇప్పుడు కాన్‌కాన్‌లు వాడుతున్నారు. అవి దాదాపుగా నెట్‌తో తయారుచేసినవే. పైగా మందంగా, ఎక్కువ లేయర్లతో కూడా ఉంటాయి. ఇవి చల్లని వాతావరణానికి ఫరవాలేదు కానీ ఎండాకాలంలో అయితే మాత్రం వాటిని కుట్టించుకోకపోవడమే మేలు. ఎలాంటి డ్రెస్ అయినా సరే లేయర్‌లలో వేసుకోవడం ఫ్యాషన్. కానీ, వాటివల్ల చెమట ఇబ్బంది తప్పదు. పైగా కూర్చోవడం, నిల్చోవడం కూడా కష్టమే. ఒకవేళ లేయర్లు కావాలనుకుంటే అన్నీ ఒకే పొడవులో కాకుండా కొన్ని పొడుగ్గా, మరికొన్ని చిన్నగా ఉండేలా చూసుకోవచ్చు. వాటిని కూడా కాస్త తేలికగా ఉండే మల్ వస్త్రంతో కుట్టించుకుంటే మేలు. ఇది బరువుగా ఉండదు. చూడటానికి గేరా ఎక్కువున్నట్లు కనిపించేలా చేస్తుంది. చెమట కూడా పీల్చుకోగలుగుతుంది. లి స్టోన్‌వర్క్, ఎంబ్రాయిడరీ, జరీ వర్క్.. ఇవన్నీ లెహెంగా బరువును మరింత పెంచుతాయి. కాబట్టి సందర్భాన్ని బట్టి అలాంటివి ఎంచుకుంటేనే మంచిది. లేదంటే ఆడంబ్బ విభిన్న ప్రింట్లున్న వస్త్రాలను కాస్త ముదురు రంగుల్లో ఎంచుకోవచ్చు. ఇవి చూడటానికి ఆడంబరంగా, వేసుకోవడానికి సౌకర్యంగానూ ఉంటాయి. ఇక వీటిమీదకు సాదాసీదాగా ఉండే బ్లవుజు ఎంచుకుంటే సరిపోతుంది. లెహెంగా కోసం ఎలాంటి వస్త్రం ఎంచుకుంటున్నామన్నది కూడా ముఖ్యమే. ఈ కాలంలో తేలికగా ఉండే షిఫాన్, జార్జెట్, ఆర్గాంజా... లాంటివి బాగుంటాయి. వీటిని లేయర్లుగా కుట్టించుకున్నా కూడా ఎలాంటి అసౌకర్యం ఉండదు. వీలైతే దుపట్టాని కూడా లెహెంగాతో కలిపి కుట్టించుకునే ప్రయత్నం చేయొచ్చు. సందర్భాన్ని బట్టి లహంగా శైలులు ప్రతి వేడుకకు వేర్వేరు లహంగా స్టైల్‌ను ఎంపిక చేసుకోవాలి:

పెళ్లి రోజు: రెడ్, గోల్డ్, హెవీ జరీ వర్క్‌తో కూడిన సంప్రదాయ లహంగా.

ఎంగేజ్‌మెంట్ / సంగీత్: మెటాలిక్ టోన్లు, మిర్రర్ వర్క్.

హల్దీ / మెహందీ: పసుపు, ఆకుపచ్చ రంగుల్లో ఫ్లోరల్ ప్రింట్ లహంగాలు.

రిసెప్షన్: ట్రెయిల్ కలిగిన వెడింగ్ గౌన్ లహంగా.

## ఫ్యాషన్ ప్రియుల కోసం అజియో బిగ్ బోల్డ్ సేల్



భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ఫ్యాషన్ సంస్థ అజియో తమ వినియోగదారులకు శుభవార్త అందించింది. జూలై 1 నుంచి జూలై 5, 2021 వరకు ఫ్యాషన్ శ్రేణి అమ్మకం బిగ్ బోల్డ్ సేల్ నిర్వహిస్తోన్నట్లు ప్రకటించింది. పేరుకు తగ్గట్టుగానే అజియో బిగ్ బోల్డ్ సేల్ ఫ్యాషన్‌కు సంబంధించి ఇప్పటి వరకు లేని భారీ, బోల్డెస్ట్ సేల్ తోపాటు 2500 ప్లస్ బ్రాండ్లకు చెందిన 6,00,000 స్టైల్స్‌పై 50–90 శాతం వరకు ఆఫ్ పొందవచ్చని తెలిపింది. దేశంలోని ప్రతీ కస్టమర్ కొనుగోలు చేసేందుకు వీలుగా ఇప్పటి వరకు చూడని ధరలు, ప్రతీ గంటకు స్పెషల్ డీల్స్, రివార్డులు, పాయింట్లను అజియో బిగ్ బోల్డ్ సేల్ అందిస్తోంది. ప్రపంచఖ్యాతి గాంచిన బ్రాండ్లు నైకీ, ప్యూమా, అడిడాస్, లివైస్, యూనైటెడ్ కలర్స్ ఆఫ్ బెనెటన్‌కు చెందిన స్టైల్స్ అతి తక్కువ ధరలో పొందవచ్చు. ఈ మెగా ఈవెంట్ ద్వారా ఫ్యాషన్ ప్రపంచపు సుందరి సోనమ్ కపూర్, ఫ్యాషన్ ఐకాన్స్ గురు రణధావ, శృతి హాసన్, కాజల్ అగర్వాల్, మౌనీ రాయ్ అమ్మకాలను ఉత్తేజితం చేస్తారు. ప్రతీ ఒక్కరికీ ఏదో ఒకటి అందించేలా పాపులర్ శ్రేణులైన టీ–షర్ట్స్, జీన్స్, కుర్తాలు, స్నీకర్స్‌పై 50 నుంచి 90 శాతం వరకు ఆఫ్ సహా అన్ని స్టైల్స్‌పై తగ్గింపు ధరలను చూడవచ్చు. ధరల తగ్గింపు మాత్రమే కాదు,

ఈ సేల్ సందర్భంగా అనేక ప్రముఖ ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌ను అజియో ప్రారంభిస్తోంది. దేశంలోని ఫ్యాషన్ ప్రియులకు సరైన వేదికగా నిలుస్తున్న అజియో, స్త్రీలు, పురుషుల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన దుస్తులు, యాక్సెసరీ కలెక్షన్స్ అందిస్తోంది.



## కనుచూపు మేర పచ్చని పైరులా నేటి స్టాక్ మార్కెట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల మధ్య గత కొన్ని సెషన్లలో భారత మార్కెట్లలో అస్థిరమైన ట్రేడింగ్ సెషన్ చూశాం. అయితే, ఇవాళ శుక్రవారం నిఫ్టీ, సెన్సెక్స్ తదితర మార్కెట్ సూచీలు ఒక అద్భుతమైన బ్రేక్అవుట్‌ను చూశాయి. నిఫ్టీ ఏకంగా ఇవాళ 319 పాయింట్లు అధికంగా పైకి ఎగసింది. ఈ ఉదయం సానుకూల సంకేతాలతో మొదలైన తర్వాత, మార్కెట్ సెషన్ ప్రారంభంలో బాగా పెరిగింది. సెషన్ మధ్యలో నుండి చివరి వరకు అప్‌సైడ్ మొమెంటం కొనసాగింది. ఇలాగే కదిలి నిఫ్టీ గరిష్ట స్థాయిల దగ్గర ముగిసింది.మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,046.30 పాయింట్లు లేదా 1.29 శాతం పెరిగి 82,408.17 వద్ద ఉంది. నిఫ్టీ 319.15 పాయింట్లు లేదా 1.29 శాతం పెరిగి 25,112.40 వద్ద స్థిరపడింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. మెటల్, పిఎస్‌యు బ్యాంక్, రియాల్టీ, పవర్, టెలికాం, క్యాపిటల్ గూడ్స్ 1-2 శాతం పెరిగాయి. దాదాపు అన్ని రంగాల సూచీలు ఇవాళ గ్రీన్‌లో ఉన్నాయి. జియో ఫైనాన్షియల్, ఎం అండ్ ఎం, భారతీ ఎయిర్‌టెల్, భారత్ ఎలక్ట్రానిక్స్, ట్రెంట్ నిఫ్టీలో అత్యధిక లాభాలను ఆర్జించగా.. హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, మారుతి సుజుకి, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వంటి సంస్థలు నష్టపోయాయి.గత మూడు సెషన్లలో డౌన్ నారో రేంజ్ మూమెంట్ ఏర్పడిన తర్వాత రోజువారీ చార్ట్‌లో ఇవాళ లాంగ్ బుల్ క్యాండిల్ పడింది. ఈ మార్కెట్ గమనం నిర్ణయాత్మక అప్‌సైడ్ బ్రేక్అవుట్‌ను సూచిస్తుంది. వీక్లీ చార్టులో నిఫ్టీ గత వారం


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11
హైదరాబాద్
ఆదివారం
22 । జూన్ । 2025


## భారత్‌లో తొలి టెస్లా షోరూం.. జూలై నుంచి మోడల్ వై ఈవీల అమ్మకాలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఎలక్ట్రానిక్ కార్ల తయారీలో దిగ్గజంగా పేరొందిన టెస్లా కంపెనీ భారత్‌లో అడుగుపెట్టనుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించేందుకు టెస్లా యాజమాన్యం సిద్ధమవుతోంది. జూన్‌లో ముంబై కేంద్రంగా 'మోడల్ వై రేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీ' కార్లను అమ్మేందుకు సన్నాహకాలు చేస్తోంది. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ షో రూం ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని న్యూయార్క్‌లోని బ్లూమ్‌బర్గ వార్తా కథనం పేర్కొంది.
ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో అమెరికా పర్యటన సమయంలోనే భారత్‌లో టెస్లా విస్తరణకు బీజం పడిందని సదరు మీడియా సంస్థ తెలిపింది. ఆటోమొబైల్ రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌కు ఈసారి భారత్‌ను ఎంచుకుంది. యూరప్, చైనాలో అమ్మకాలు పడిపోవడంతో ఇండియాలో సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఉంది ఎలాన్ మస్క్ చెందిన ఈ సంస్థ.అందులో భాగంగానే ముంబైలో తమ తొలి షోరూం ప్రారంభించడానికి టెస్లా ఏర్పాట్లు చకచకా చేస్తోంది. వచ్చే నెలలో అమ్మకాలకు సర్వం సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే చైనా, అమెరికాల నుంచి సూపర్ చార్జర్లు, కార్ యాక్సెసరీస్, ఇతర విడిభాగాలను పెద్ద సంఖ్యలో దిగుమతి చేసుకుందని బ్లూమ్‌బర్గ్ తమ కథనంలో వెల్లడించింది. అంతేకాదు మోడల్ వై రేర్ వీల్ డ్రైవ్ ఎస్‌యూవీలను చైనాలోని షాంఘైలో ఉన్న తమ ఫ్యాక్టరీ నుంచి భారత్‌కు తీసుకువచ్చింది టెస్లా. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది.

## కీలక రంగాలు కుదేలు.. గడిచిన 9 నెలల్లో ఇదే కనిష్ఠం




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలోని కీలక రంగాలు కుదేలయ్యాయి. గత నెలలో గడిచిన 9 నెలల్లోనే కనిష్ఠానికి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది మే నెలలో కేవలం 0.7 శాతంగానే ఉన్నట్టు శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టులో మైనస్ 1.5 శాతంగా ప్రధాన మౌలిక రంగాల వృద్ధిరేటు నమోదవగా, ఆ తర్వాత ఇప్పుడే అంత దారుణంగా కీలక పరిశ్రమల పనితీరు కనిపించింది. ఇక నిరుడు మే నెలలో 6.9 శాతంగా కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధిరేటు ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 1 శాతంగా ఉన్నది. అంతకుముందు ఫిబ్రవరి, మార్చి నెలల్లో వరుసగా 3.4 శాతం, 4.5 శాతంగా గణాంకాలు నమోదయ్యాయి.
ఇదీ సంగతి..ఎనిమిది కీలక రంగాల్లో నాలుగింటి పరిస్థితి అధ్వానంగా ఉన్నది. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత నిరాశపర్చింది. దీంతో సిమెంట్, ఉక్కు, బొగ్గు, రిఫైనరీ రంగాల్లో ఉత్పాదకత పెరిగినా ఓవరాల్‌గా కోర్ ఇండస్ట్రీ ఇండెక్స్ నిలబడలేకపోయింది. దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వాటానే 40.27 శాతంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో దేశ జీడీపీ నేలచూపులు చూస్తున్న ప్రస్తుత తరుణంలో కీలక రంగాల పనితీరు అంతంతమాత్రంగానే ఉంటుండటం.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఆర్థిక వృద్ధిరేటుపైనా అనుమానాలను రేకెత్తిస్తున్నది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే) కీలక రంగాల వృద్ధిరేటు 0.8 శాతంగా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల్లో 6.9 శాతంగా నమోదైంది.

**ఐఐపీ డౌన్**

కీలక రంగాల ఉత్పాదక సూచీ గత నెలలో తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఐఐపీ గణాంకాలూ ఈసారి నిరాశాజనకంగానే ఉంటాయని దేశీయ ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే మే నెలలో ఐఐపీ గణాంకాలు 1.5 శాతం నుంచి 2.5 శాతంగా ఉండొచ్చని పేర్కొన్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 2.7 శాతంగా నమోదైంది. మార్చితో పోల్చితే 1.2 శాతం తగ్గింది. నాడు 3.9 శాతంగా ఉన్నది.

## సన్ టీవీలో ఇంటి పోరు

**చెన్నై-నవభూమి:** దక్షిణాదిలో బలమైన నెట్‌వర్క్ కలిగిన సన్ టీవీ గ్రూప్ ప్రమోటర్ల కుటుంబంలో అగ్గి రాజుకుంది. సన్ టీవీ గ్రూప్ అధినేతగా ఉన్న తన అన్న కళానిధి మారన్, వదిన కావేరి మారన్ కుట్ర, మోసపూరితంగా 2003లో 12 లక్షల షేర్లను ఏకపక్షంగా కేటాయించుకోవడం ద్వారా కంపెనీలో మెజారిటీ వాటాలను చేజిక్కించుకున్నారని చెన్నై సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు, ఆయన సోదరుడు దయానిధి మారన్ ఆరోపించారు. అంతేకాకుండా కళానిధి, కావేరి మారన్‌తో పాటు వారి సన్నిహితులైన కంపెనీకి చెందిన మరో ఆరుగురికి లీగల్ నోటీసులు జారీ చేశారు. సన్ టీవీ గ్రూప్ పూర్తిగా తన ఆజమాయిషీ లో ఉంచుకునేలా కళానిధి మోసపూరిత చర్యలకు పాల్పడినట్లు దయానిధి ఆ నోటీసుల్లో ఆరోపించారు.ఏకపక్షంగా 12 లక్షల షేర్ల బదిలీ: 2003లో సన్ టీవీ నెట్‌వర్క్ షేర్ల విలువ ఒక్కొక్కటి సుమారు రూ.2,500 నుంచి రూ.3,000 మధ్యన ఉంటే, తన అన్న, వదిన ఆ 12 లక్షల షేర్లను కేవలం రూ.10 ముఖ విలువకే ఏకపక్షంగా కేటాయించుకున్నట్టు దయానిధి మారన్ తెలిపారు.

# ఆ ట్రాన్సాక్షన్ల ద్వారా డబ్బు సంపాదిస్తున్నారా?




**న్యూఢిల్లీ-నవభూమి:** క్రిప్టో కరెన్సీ ద్వారా డబ్బు సంపాదిస్తున్నారా? అయితే మీరు కచ్చితంగా పన్ను కట్టాలి. లేకపోతే ఆదాయపు పన్ను శాఖ మీకు నోటీసులు పంపవచ్చు. అంతేకాదు, అవసరమైతే మీ ఇళ్లల్లో సోదాలు కూడా చేయవచ్చు. మీరు మీ ఆదాయపు పన్ను రిటర్న్‌లో క్రిప్టో లావాదేవీల వివరాలు చూపించకపోయినా ఇబ్బందులు తప్పవు. ఆదాయపు పన్ను శాఖ 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి చాలా మందికి నోటీసులు పంపింది. పన్ను ఎందుకు కట్టలేదని ప్రశ్నిస్తూ ఈ-మెయిల్స్ కూడా పంపింది. మీరు విదేశీ ఎక్స్ఛేంజీలను ఉపయోగిస్తే షెడ్యూల్ ఎఫ్ఏ (%ఖీూ%) నింపడం మర్చిపోవద్దు. ఆదాయపు పన్ను శాఖ ఇప్పుడు చాలా సీరియస్‌గా ఉంది. ఎందుకంటే వాళ్ల దగ్గర మీ క్రిప్టో లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఉంది.మీరు ఏ ఎక్స్ఛేంజీ ద్వారా లావాదేవీలు చేసినా సరే, ఆ సమాచారం వాళ్లకు తెలుస్తుంది. మీరు బైనాన్స్ లాంటి విదేశీ ఎక్స్ఛేంజీలను వాడుతుంటే, మీ ఐటీఆర్‌లో వీడీఏ షెడ్యూల్‌తో పాటు షెడ్యూల్ ఎఫ్ఏ కూడా నింపాలి. షెడ్యూల్ ఎఫ్ఏ అంటే విదేశీ ఆస్తుల వివరాలు. ఈ రూల్స్‌ను పాటించకపోతే పన్ను అధికారుల నుండి మీకు ఇబ్బందులు వస్తాయి.పన్ను శాఖ ఎందుకు ఇంత కఠినంగా వ్యవహరిస్తోంది? క్రిప్టో ఎక్స్ఛేంజీల నుంచి.. టీడీఎస్‌రిటర్న్‌ల నుంచి ఆదాయపు పన్ను శాఖ డేటాను సేకరించింది. ఆ డేటాను పూర్తిగా విశ్లేషించింది. పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్‌లలో చూపించిన వివరాలకు, వాస్తవ లావాదేవీల డేటాకు చాలా తేడాలు ఉన్నాయని గుర్తించింది. చాలామంది పన్ను కట్టాల్సిన అవసరం లేదని అనుకున్నారు. లేదా ఎలా కట్టాలో తెలియక తప్పు చేశారు. అందుకే పన్ను శాఖ 'నుడ్జ్' ప్రచారం కింద నోటీసులు పంపుతోంది. ఇది చర్య తీసుకునే ముందు ఒక అవకాశం మాత్రమే. మీ తప్పు తెలుసుకొని సరిదిద్దుకోవడానికి ఇది ఒక అవకాశం. "పన్ను శాఖ వద్ద అవసరమైన మొత్తం సమాచారం ఉన్నప్పటికీ, మీకు నిజం చెప్పడానికి మరో అవకాశం ఇస్తున్నట్లుగా ఇది పనిచేస్తుంది."నోటీసు వస్తే ఏం చేయాలి? మీకు నోటీసు వస్తే భయపడాల్సిన అవసరం లేదు. కానీ వెంటనే చర్యలు తీసుకోవాలి. మీరు వర్చువల్ డిజిటల్ అసెట్ ద్వారా డబ్బు సంపాదిస్తే, 30% పన్ను కట్టాలి. మీరు కొన్న ఖర్చును మాత్రమే మినహాయించవచ్చు. ఈ లావాదేవీల నుండి వచ్చే నష్టాలను మాత్రం సర్దుబాటు చేయలేరు.మీరు వెంటనే మీ రిటర్న్‌లను చెక్ చేసుకోవాలి. మీ లావాదేవీల వివరాలను సేకరించాలి. ఏదైనా తప్పు ఉంటే, సెక్షన్ 139 కింద అప్‌డేటెడ్ రిటర్న్ ఫైల్ చేయాలి. అదనపు పన్నును వడ్డీతో పాటు కట్టాలి. టీడీఎస్ సర్టిఫికేట్‌లు, ఎక్స్ఛేంజ్ స్టేట్‌మెంట్‌లు జాగ్రత్తగా ఉంచుకోవాలి.హార్డ్‌వేర్ వాలెట్‌లు కూడా సురక్షితం కాదు. సోదాల సమయంలో పన్ను శాఖ హార్డ్‌వేర్ క్రిప్టో వాలెట్‌లను కూడా తీసుకుంటుంది. ఈ వాలెట్‌లు ప్రైవేట్ వాల్ట్‌ల లాంటివి. వీటిని వినియోగదారులే కంట్రోల్ చేస్తారు. ఎక్స్ఛేంజీలలో ఉన్న క్రిప్టోల గురించి అందరికీ తెలుస్తుంది. కానీ హార్డ్‌వేర్ వాలెట్‌లలో ఉన్న వాటి గురించి ఎవరికీ తెలియదు. మీరు వీటిని ఐటీఆర్‌లో చూపించకపోతే, సెక్షన్ 69A కింద లెక్క చూపని ఆదాయంగా పరిగణిస్తారు.
మీరు విదేశీ ప్లాట్‌ఫామ్‌ల నుంచి క్రిప్టో పొందితే, దానిని షెడ్యూల్ ఎఫ్ఏలో కచ్చితంగా చూపించాలి. లేకపోతే బ్లాక్ మనీ చట్టం కింద జరిమానా పడుతుంది. మీరు వాలెట్ గురించి చెప్పకపోయినా, అది పన్ను విధించదగిన హోల్డింగ్‌గా పరిగణిస్తారు. క్రిప్టో ఆదాయాన్ని దాస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి. కాబట్టి జాగ్రత్తగా ఉండండి.మీకు ఈ కొత్త రూల్స్ గురించి ఏమైనా డౌట్స్ ఉంటే, వెంటనే తెలుసుకోండి. లేదంటే మీరు ఇబ్బందుల్లో పడవచ్చు. పన్ను కట్టడం తప్పనిసరి. మీ ఆదాయాన్ని నిజాయితీగా చూపించండి. ప్రభుత్వానికి సహకరించండి. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది.

## 8వ వేతన సంఘం.. ఉద్యోగుల కనీస జీతం రూ. 51 వేలకు పెంపు!




**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు , పెన్షనర్ల జీతాలు, పెన్షన్లు సవరించనున్నారు. ఈ సవరించిన జీతాల విధానం 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ పెంపుదలపై అందరి దృష్టి ఉంది. దీని ద్వారా ఉద్యోగుల కనీస ప్రాథమిక జీతం రూ. 18 వేల నుంచి సుమారు రూ. 51,480కిబీ కనీస పెన్షన్ రూ. 9,000 నుంచి సుమారు రూ. 25,740కి పెరిగే అవకాశం ఉంది. జీతాలతో పాటు అలవెన్సులు, తగ్గింపుల్లో కూడా మార్పులు ఉండొచ్చు. 8వ వేతన సంఘం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను సవరించడానికి ప్రభుత్వం తీసుకున్న ఒక ముఖ్యమైన నిర్ణయం. దీని ద్వారా ఉద్యోగుల జీతాలు పెరగడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతుంది.ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ అనేది జీతాల శ్రేణిని తిరిగి లెక్కించడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన గుణకం. 7వ వేతన సంఘం దీనిని 2.57గా నిర్ణయించింది. ఇప్పుడు 8వ వేతన సంఘం దీనిని 2.86కి పెంచే అవకాశం ఉంది. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ పెరిగితే ఉద్యోగుల జీతాలు గణనీయంగా పెరుగుతాయి. "ఇది ఆమోదం పొందితే.. కనీస ప్రాథమిక జీతం రూ. 18 వేల నుంచి సుమారు రూ. 51,480కి పెరుగుతుంది. అలాగే, కనీస పెన్షన్ రూ. 9 వేల నుంచి సుమారు రూ. 25,740కి పెరుగుతుంది" అని నివేదికలు చెబుతున్నాయి.జీతాలతో పాటు ఇతర అలవెన్సులు కూడా మారే అవకాశం ఉంది. ఉద్యోగుల స్థానాలు, వారి ఉద్యోగ అవసరాలను బట్టి ఇంటి అద్దె భత్యం , ప్రయాణ భత్యం వంటివి కూడా అప్‌డేట్ అవుతాయి. ఒకే పే గ్రేడ్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా వారి పోస్టింగ్‌ను బట్టి జీతంలో మార్పులు ఉండొచ్చు.జీతాలు పెరిగితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ వంటి వాటికి చేసే కాంట్రిబ్యూషన్స్ కూడా పెరుగుతాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు ప్రాథమిక జీతం, డీఏలో 10 శాతం ఎన్‌పీఎస్‌కు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం 14 శాతం జమ చేస్తుంది. జీతాలు పెరిగితే ఈ రెండు పథకాల కింద నెలవారీ విరాళాలు కూడా పెరుగుతాయి. జీతం శ్లాబ్‌లకు లింక్ అయిన సీజీహెచ్ఎస్ ఛార్జీలు కూడా కొత్త వేతన శ్రేణులకు అనుగుణంగా పెరుగుతాయి.
వివిధ పే గ్రేడ్‌లలో జీతాలు ఎలా ఉండబోతున్నాయో కొన్ని అంచనాలు ఉన్నాయి.
- గ్రేడ్ 2000 (లెవెల్ 3): ప్రాథమిక జీతం రూ. 57,456, స్థూల జీతం రూ. 74,845, నికర జీతం రూ. 68,849.
- గ్రేడ్ 4200 (లెవెల్ 6): ప్రాథమిక జీతం రూ. 93,708, స్థూల జీతం రూ. 1,19,798, నికర జీతం రూ. 1,09,977.
- గ్రేడ్ 5400 (లెవెల్ 9): ప్రాథమిక జీతం రూ. 1,40,220, స్థూల జీతం రూ. 1,81,073, నికర జీతం రూ. 1,66,401.
- గ్రేడ్ 6600 (లెవెల్ 11): ప్రాథమిక జీతం రూ. 1,84,452, స్థూల జీతం రూ. 2,35,920, నికర జీతం రూ. 2,16,825.

ఇవి కేవలం అంచనాలు మాత్రమే. వేతన సంఘం సిఫార్సులు, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల తర్వాత ఈ జీతాలు మారొచ్చు.

## గత ఏడాది భారత్‌లో కొత్తగా 39000 మిలియనీర్లు



**ముంబై-నవభూమి:** ప్రపంచంలో ఆర్థిక వ్యత్యాసాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి. ఇదే సమయంలో డాలర్ మిలియనీర్ల (10 లక్షల డాలర్లు) సంఖ్యా పెరిగి పోతోంది. గత ఏడాది మన దేశంలో కొత్తగా 39,000 మంది ఈ జాబితాలో చేరారు. దీంతో మన దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య 9.17 లక్షలకు చేరింది. అయితే చైనాలో ఉన్న 63 లక్షల మిలియనీర్లతో పోలిస్తే మన దేశంలో ఉన్న మిలియనీర్ల సంఖ్య తక్కువే. 2023తో పోలిస్తే భారత్‌లో మిలియనీర్ల సంఖ్య 4.4 శాతం పెరిగింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ యూబీఎస్ తన తాజా 'గ్లోబల్ వెల్త్' నివేదికలో ఈ విషయం వెల్లడించింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోల్చినా మన దేశంలోనే డాలర్ మిలియనీర్ల సంఖ్య ఎక్కువ.2024 నాటికి 119 లక్షల కోట్ల డాలర్లకు చేరిన ప్రపంచ మిలియనీర్ల ఆస్తుల విలువ
గత ఏడాది అమెరికాలో గంటకు 1,000 మంది చొప్పున ఏడాదిలో 3.79 లక్షల మంది కొత్త మిలియనీర్లు
ప్రపంచ మిలియనీర్లలో 40 శాతం మంది అమెరికన్లు
మిలియనీర్ల పెరుగుదలలో టర్కీ, యూఏఈ, రష్యా తర్వాత భారత్‌కు నాలుగో స్థానం
ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న 56 దేశాల్లో భారత్‌కు ఎనిమిదో స్థానం
భారత్‌లోని మొత్తం ఆస్తుల్లో ఫైనాన్షియల్ (ఆర్థిక) ఆస్తుల వాటా 20 శాతం మాత్రమే
వచ్చే పాతికేళ్లలో ఒక తరం నుంచి మరో తరానికి 83 లక్షల కోట్ల డాలర్ల ఆస్తుల బదిలీ. ఈ విషయంలో అమెరికాకు అగ్రస్థానం. భారత్‌కు ఏడో స్థానం
గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు సగటున 4.6 శాతం చొప్పున పెరిగితే అమెరికాలో 11 శాతం చొప్పున పెరుగుదల.

## యూఎస్ స్టాక్ మార్కెట్‌లో ఎన్ఆర్ఐల పెట్టుబడులకు
# కొత్త ద్వారం - ఆర్థ గ్లోబల్ మల్టిప్లైయర్ ఫండ్

**ముంబై-నవభూమి:** ప్రముఖ పెట్టుబడి సంస్థ ఆర్థ భారత్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్స్, తన కొత్త హెడ్జ్ ఫండ్ ఆర్థ గ్లోబల్ మల్టిప్లైయర్ ఫండ్ ను ప్రకటించింది. ఈ ఫండ్ ముఖ్యంగా ఎన్ఆర్ఐలు , ఓసీఐలు , పీఐఓలు మరియు ఇతర విదేశీ భారతీయ పెట్టుబడిదారుల కోసం రూపొందించబడింది. అమెరికా మార్కెట్‌లో వ్యూహాత్మక పెట్టుబడులకు ఇది ఒక సులువైన మార్గాన్ని అందిస్తుంది.
అమెరికా మార్కెట్‌లో ఉత్సాహకర అవకాశాలు
"యుఎస్ స్టాక్ మార్కెట్, ఎంఎస్‌సీఐ వరల్డ్ ఇండెక్స్‌లో దాదాపు 74 శాతం ప్రాతినిధ్యం కలిగి ఉంది. ఇది ఇతర మార్కెట్ల కంటే ఎక్కువకాలంగా మెరుగైన రాబడులు ఇస్తోంది," అని సచిన్ సావ్రికర్, ఆర్థ భారత్ మేనేజింగ్ పార్ట్నర్ తెలిపారు.
"ప్రపంచంలోని అతి పెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈక్విటీ మార్కెట్ అయిన అమెరికాలో, ఒక వైవిధ్యభరితమైన వ్యూహం ద్వారా పెట్టుబడి పెట్టేందుకు ఈ ఫండ్ గ్లోబల్ భారతీయులకు ఓ అవకాశాన్ని కల్పిస్తోంది.'

**గణనీయమైన విభాగాలపై దృష్టి**

ఈ ఫండ్ ముఖ్యంగా లిక్విడ్ స్టాక్స్, ఈవెంట్ ఆధారిత వ్యూహాలు, డెరివేటివ్‌లు వంటి రంగాలలో పెట్టుబడులు పెడుతుంది. దాని దృష్టి ఈ ఆరు అమెరికన్ మార్కెట్ థీమ్లపై ఉంటుంది:
టెక్నాలజీ -రిటైల్
వినియోగ వస్తువులు (స్టేపుల్స్) -డిస్క్రిషనరీ
కృత్రిమ మేధస్సు వినూత్నత

**ఆర్థిక సేవలు**

ఆరోగ్య సంరక్షణ - బయోటెక్నాలజీ
పునరుత్పాదక శక్తి -క్లీన్ ఎనర్జీ
- నిపుణుల అనుభవంతో ఫండ్ నిర్వహణ

ఈ ఫండ్ మేనేజర్ నచికేత సావ్రికర్ గారు, గత 24 సంవత్సరాలుగా గ్లోబల్ ఫైనాన్స్ రంగంలో అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఆయన ఐఐఎం అహ్మదాబాద్ నుండి ఎంబీఏ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అంతేకాక, సిఎఫ్ఎ చార్టర్ హోల్డర్ కూడా."ఈక్విటీ స్టాక్స్, ఇండెక్స్ ఫ్యూచర్స్, వాలాటిలిటీ ఇండెక్స్ వంటి సాధనాల ద్వారా పెట్టుబడులను వేయడం ద్వారా మార్కెట్ దిశపై ఆధారపడకుండా స్థిరమైన రాబడులు అందించడమే మా లక్ష్యం," అని ఆయన వివరించారు.

**రిటైల్‌కు కాదు - లెవరేజ్ ఫండ్**

ఈ ఫండ్ 50 శాతం నుండి 150 శాతం లెవరేజ్ సామర్థ్యంతో కూడినది. ఇది అధునాతన పెట్టుబడిదారుల కోసం మాత్రమే రూపుదిద్దుకుంది. రిటైల్ వినియోగదారులు దీనికి అర్హులు కారు. సులభంగా నిల్వ ఉండే, త్వరిత లిక్విడిటీ కలిగిన పెట్టుబడుల ఆధారంగా దీన్ని నిర్మించారు.

## హైదరాబాద్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్




**హైదరాబాద్-నవభూమి:**జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియల్టీ జాయింట్ వెంచర్ సంస్థ.. జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా.. హైదరాబాద్, కోకాపేట్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్ పేరుతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నియోపోలిసలో 7.34 ఎకరాల విస్తీర్ణంలో 63 ఫ్లోర్లతో కూడిన ఐదు టవర్లు, మొత్తం 1,189.. 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వామి కర్తీశ్ రెడ్డి వెల్లడించారు. రూ.3,169 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు ఎస్‌బీఐ రూ.900 కోట్ల నిధులను సమకూర్చిందని సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్ వెల్లడించారు.
63 ఫ్లోర్లతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్
ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు ఓబెన్ ఎలక్ట్రిక్ సిరీస-ఏ ఫండింగ్‌లో భాగంగా మొత్తం రూ.100 కోట్లు సమీకరించింది. ఇందులో భాగంగా జనవరి నెలలో రూ.50 కోట్లు సమీకరించగా మే నెలలో మరో రూ.50 కోట్ల నిధులను సేకరించింది. హీలియోస్ హోల్డింగ్స్, శారద ఫ్యామిలీ ఆఫీస్, కే ఫ్యామిలీ నుంచి ఈ మొత్తాలను సమీకరించింది. తాజా నిధులతో కంపెనీ ఇప్పటి వరకు సమీకరించిన నిధులు రూ.200 కోట్లకు చేరాయి.టెక్స్‌టైల్ రంగంలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు గాను జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎసడీసీ)తో వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.425 కోట్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంయుక్తంగా సర్టిఫికెట్ జారీ చేయనున్నాయి. వెల్‌స్పన్ తన టెక్స్‌టైల్ యూనిట్లలో వీరికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:**భౌగోళికంగా ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువలో ట్రేడ్ అవుతున్నాయి. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 21న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 00, 470కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 090కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర ఈ రోజు దాదాపు రూ.600 వరకు తగ్గిందిఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 00, 620కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 92, 240కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 470కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 090కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ. 100 మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.
దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)
హైదరాబాద్‌లో రూ. 1, 00, 470, రూ. 92, 090
విజయవాడలో రూ. 1, 00, 470, రూ. 92, 240
ఢిల్లీలో రూ. 1, 00, 620, రూ. 92, 660
ముంబైలో రూ. 1, 00, 470, రూ. 92, 090
వడోదరలో రూ. 1, 00, 520, రూ. 92, 140
కోల్‌కతాలో రూ. 1, 00, 470, రూ. 92, 090
చెన్నైలో రూ. 1, 00, 470, రూ. 92, 090
బెంగళూరులో రూ. 1, 00, 470, రూ. 92, 090
కేరళలో రూ. 1, 00, 470, రూ. 92, 090
పుణెలో రూ. 1, 00, 470, రూ. 92, 090
ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)
హైదరాబాద్‌లో రూ. 1, 19, 900
విజయవాడలో రూ. 1, 19, 900
ఢిల్లీలో రూ. 1, 09, 900
చెన్నైలో రూ. 1, 19, 900
కోల్‌కతాలో రూ. 1, 19, 900
కేరళలో రూ. 1, 19, 900
ముంబైలో రూ. 1, 09, 900
బెంగళూరులో రూ. 1, 09, 900
వడోదరలో రూ. 1, 09, 900
అహ్మదాబాద్‌లో రూ. 1, 09, 900

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

12 | హైదరాబాద్ | ఆదివారం | 22 । జూన్ । 2025




# సీనియర్ భామలు క్షణం ఖాళీ లేకుండా!

హీరోలకు ఉన్నంత లాంగ్ కెరీర్ హీరోయిన్లకు ఉండదు. ఫాం..ఫేం ఉన్నంత కాలమే చలామణీ అయ్యేది. ఒక్కసారి ఫాం కోల్పోతే తిరిగి కోలుకోవడం అన్నది అంత వీజీ కాదు. దాదాపు అసాధ్యంగానే పరిగణించాలి. కానీ బాలీవుడ్ లో కొంతమంది భామలు ఇలాంటి ఫేజ్ లు అన్నింటిని దాటుకుని కొంత మంది సీనియర్ భామలు ఇప్పటికీ అదే ఛరిష్మాతో ఇంట్రస్ట్రీలో కొనసాగుతున్నారు. వయసుతో పాటు అవకాశాలు కూడా పెరుగుతున్నాయి.సాహసానికి వయసు అడ్డంకి కాదంటూ ఎలాంటి పాత్ర వచ్చినా నో చెప్పకుండా నటిస్తున్నారు. వాళ్లే టబు, కాజోల్, రాణీ ముఖర్జీ, విద్యాబాలన్, కరీనా కపూర్ వంటి భామలు ఇప్పటికీ గొప్ప కెరీర్ ని కొనసాగిస్తున్నారు. మేటి నాయికలతో పోటీ పడి మరి అవకాశాలు అందుకుంటున్నారు. అవకాశాలు అందు కోవడంలో స్ట్రాటజీ కూడా భిన్నంగా కనిపిస్తుంది. టబు బాలీవుడ్ తె రపై మెరుస్తోన్న వైనం గురించి చెప్పాల్సిన పనిలేదు.50 ఏళ్లు దాటినా ఎక్కడా తగ్గలేదు. బోల్డ్ అండ్ రొమాంటిక్ పాత్రల విషయంలోనూ ఏమాత్రం రాజీ పడకుండా నటిస్తోంది. ఇటీవల రిలీజ్ అయిన %-%హౌస్ ఫుల్ 5తోనూ అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ బ్యూటీ బూత్ బంగ్లాలో నటిస్తోంది. అలాగే విద్యాబాలన్ భూల్ భులయ్య 3 తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాలేదు. కానీ కమిట్ అయిన కొన్ని చిత్రాలున్నాయి. అవి పట్టాలెక్కాల్సి ఉంది.కాజోల్ కూడా అంతే దూకుడు చూపిస్తోంది. లస్ట్ స్టోరీస్ -2 దో పత్తిమా లాంటి చిత్రాలతో మంచి విజయాలు అందుకుంది. ఇటీవల రిలీజ్ అయిన హౌస్ ఫుల్ 5లోనూ నటించింది. ప్రస్తుతంక్వీన్ ఆఫ్ క్వీన్స్ అనే లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో నటిస్తోంది.



# హాలీవుడ్ వద్దు టాలీవుడ్ బెస్ట్.. పీసీ మైండ్ గేమ్



బాలీవుడ్ నుంచి అకస్మాత్తుగా నిష్క్రమించింది ప్రియాంక చోప్రా. ఒక అమెరికన్ గాయ కుడిని పెళ్లాడి, అటుపై హాలీవుడ్ లో వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్ లలో నటించింది. కానీ ఉన్నట్టుండి నేరుగా భారతదేశవ్యాప్తంగా మార్మోగుతున్న ఆస్కార్ విన్నింగ్ టాలీవుడ్ వైపు దృష్టి సారించింది. ఇక్కడ దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సినిమాకి సంతకం చేసింది. తనను వెతుక్కుంటూ వచ్చిన అవకాశాన్ని అస్సలు కాదను కోలేదు. దీనికి కారణం... ఏమై ఉంటుంది? అంటే అవునని చెప్పలేం. ప్రియాంక చోప్రా హాలీవుడ్ కి వెళ్లినా అక్కడ సంతృప్తికరమైన కెరీర్ ని సాగించలేదని కూడా అర్థం చేసుకోవాలి. పెద్ద స్టార్ల సరసన అవకాశాలు దక్కినా, అవన్నీ రొటీన్ గా సాగాయి. ఇటీవలి సినిమాల్లోను క్వాంటికో, సిటాడెల్ సిరీస్ లలో చూసేసిన పాత్రలనే పీసీ రిపీట్ చేస్తోంది. ఈ సిరీస్ లలో నెగెటివ్ షేడ్ ఉన్న పాత్రలను పోషించిన ప్రియాంక చోప్రా యాక్షన్ మోడ్ లో కనిపించింది. ఇప్పుడు మరోసారి హెడ్స్ ఆఫ్ స్టేట్ సినిమాలోను పీసీ ఇదే తరహా పాత్రలో కనిపిస్తోంది. ఇదంతా చూస్తుంటే పీసీ ఉన్నట్టుండి మార్పు కోరుకుందనే అర్థమవుతోంది. ఇప్పుడు మహేష్ - రాజమౌళి సినిమాతో ఈ గ్యాప్ని ఫుల్ ఫిల్ చేసుకోవాలని భావిస్తోంది. కొన్నేళ్లుగా భారతదేశంలో సినీపరిశ్రమలన్నీ ఒకే పరిశ్రమగా రూపాంతరం చెందుతున్నాయి. బాలీవుడ్ లో సినిమా తీసినా టాలీవుడ్ స్టార్లు నటిస్తున్నారు. టాలీవుడ్ లో సినిమా చేసినా టాలీవుడ్ స్టార్లు కనిపిస్తున్నారు. దీనివల్ల భిన్నత్వంలో ఏకత్వం సాధ్యమవుతోంది. ఇక హిందీ చిత్రసీమకు ధీటైన బడ్జెట్లతో తెలుగు, కన్నడం, తమిళంలో సినిమాలు తీస్తున్నారు గనుక ఇప్పుడు హీరోయిన్లకు ఏదో ఒక పెద్ద పరిశ్రమపై ఆధారపడాల్సిన అవసరం అసలే లేదు. అందువల్ల ప్రియాంక చోప్రా నేరుగా టాలీవుడ్ లో అడుగుపెట్టింది. బాలీవుడ్ అగ్ర కథానాయకులతో అవకాశాల కోసం కూడా అసలు వేచి చూస్తున్నట్టే కనిపించడం లేదు. బాలీవుడ్ లో తనకు అవకాశాలు రాకుండా కుట్ర జరిగింది! అని బహిరంగంగా ప్రకటించిన ప్రియాంక చోప్రా, ఇప్పుడు ఈ కొత్త అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తెలివిగా సౌతిండియన్ సినిమాలలో కీలక భూమిక పోషిస్తుందేమో చూడాలి.

# పాపం.. ఈ హీరోయిన్ జీవితంలోను లవ్ బ్రేకప్



ఈ మధ్య చాలా మంది హీరోయిన్స్ తమ జీవితంలో జరిగిన కొన్ని విషయాలని నిర్మొహమాటంగా భయటపెట్టేస్తున్నారు. తాజాగా తెలుగమ్మాయి అనన్య నాగళ్ల తన లవ్ బ్రేకప్ గురించి చెప్పి అందరు అవాకయ్యేలా చేసింది.అలానే తన కెరీర్ పరంగా ఒడిదుడుకులు, సవాళ్లను స్వీకరించడం అలవాటు చేసుకున్నానని తెలియజేసింది. ప్రశంసలతోపాటు విమర్శలను సైతం తట్టుకున్నానంటూ పేర్కొంది. అయితే జీవితంలో ప్రేమలో విఫలమైనప్పుడు మాత్రం చాలా బాధ పడ్డట్టు చెప్పిన అనన్య నాగళ్ల.. ఆ బాధను తట్టుకోలేకపోయానని అన్నారు. సినిమాల్లోకి వచ్చిన కొద్ది కాలానికే బ్రేకప్ జరిగింది. అది నా జీవితాన్ని రెండేళ్ల పాటు వెంటాడింది అని చెప్పింది.

ఆ సమయంలో నా బాధని ఎవరితోనూ చెప్పుకోలేకపోయాను. రాత్రిళ్లు మౌనంగా ఏడ్చేదాన్ని. కానీ ఉదయం లేవగానే నా బాధను మరిచి జిమ్‌కు వెళ్లే దానిని. ఇక షూటింగ్‌కి వెళ్లినప్పుడు కారవ్యాన్‌లోకి వెళ్లి ఏడ్చే దానిని. ఆ తర్వాత ఏమి జరగనట్టు కెమెరా ముందుకు వచ్చే దానిని. ఈ విషయం ఎవరితో పంచుకోలేదు. కేవలం నా స్నేహితులకి మాత్రమే తెలుసు. నా వ్యక్తిగత జీవితంలోని సమస్యల ప్రభావం నా పని మీద పడకుండా జాగ్రత్తపడ్డాను అని అనన్య వివరించారు. ఇక తెలుగులో 100 సినిమాల్లో 20 శాతం మాత్రమే తెలుగమ్మాయిలకి ఛాన్స్‌లు వస్తున్నాయి.. ఇక్కడ 20% అవకాశాలు మాత్రమే ఉన్నాయి కదా అని, తమిళం మలయాళం కన్నడ హిందీ ఇండస్ట్రీలకి వెళితే 80% అవకాశాలు వాళ్లు స్థానిక అమ్మాయిలకి ఇస్తారు.. మనకి 20 శాతమే ఇస్తారు.కాబట్టి దేశం మొత్తంలో ఎక్కడ చూసినా మనం ఆ ఇరవై శాతంలోనే ఆఫర్స్ రాబట్టుకోవాలి అని అనన్య నాగళ్ల ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 2018లో మల్లేశం చిత్రంతో తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించిన అనన్య, ఆ సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు పొందారు. ఇక పవన్ కల్యాణ్ నటించిన వకీల్ సాబ్ చిత్రంలో కీలక పాత్ర పోషించి మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఒక బాలీవుడ్ మూవీ చేస్తున్నట్టు తెలుస్తుండగా, ఈ సినిమాతో అనన్యకి మంచి పేరు వస్తుందట.

తెలుగులో రెండుమూడేళ్ల క్రితమే ఆఫర్లు వచ్చినా.. సాలిడ్ ఎంట్రీ కోసం ఇన్నాళ్లూ ఆలస్యం చేస్తూ వచ్చింది మలయాళమందారం మాళవిక మోహనన్. ఎట్టకేలకు ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'ది రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నది ఈ అందాలభామ. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే మాళవిక మోహనన్.. తన అందమైన ఫొటోలను ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఆ ఫొటోలను చూసిన అభిమానులు

# దెయ్యాలను నేను పెళ్లాడను



రొమాంటిగ్గా స్పందిస్తుంటారు. రీసెంట్‌గా అభిమానులతో తాను జరిపిన ఓ చిట్‌చాట్‌లో మాళవికను ఓ అభిమాని 'నన్ను పెళ్లాడవచ్చుకదా..' అనడిగాడు.. దానికి ఆమె స్పందిస్తూ.. 'నాకు దెయ్యాలంటే భయం.. దెయ్యాలను నేను పెళ్లాడను' అని సమాధాన మిచ్చింది. తనలా ఎందుకు స్పందించిందా! అని అందరూ జుట్టు పీక్కున్నారు. తీరా చూస్తే.. ఆ అభిమాని తన అకౌంట్‌కి తన పేరును కాకుండా 'ఘోస్ట్' అని పేరు పెట్టుకున్నాడు. అందుకే 'దెయ్యాలను నేను పెళ్లాడను' అంటూ ఫన్నీగా స్పందించింది మాళవిక మోహనన్. ఇలా అందమైన ఫొటోలను పోస్ట్ చేయడం, ఆ ఫొటోలను చూ సి ఫిదా అయిన అభిమానులు ఆమెకు 'ఐలవ్యూ' అంటూ కామెం ట్లు పెట్టడం ఆ కామెంట్లకు మాళవిక సరదాగా స్పందించడం ఇవన్నీ మామూలే.

# 49 ఏళ్ల మహేష్ 30 ఏళ్ల సూపర్ స్టార్‌గా!



సూపర్ స్టార్ మహేష్ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానించే పెద్ద స్టార్. అందు లోనూ గాళ్స్ ఫాలోయింగ్ లో నెంబవర్ స్టార్ మహేష్. ఈ విషయంలో మహేష్ ని కొట్టే స్టార్ మరొకరు లేరు. బాలీవుడ్ హీరోయిన్లే మహేష్ బ్యూటీకి ఫిదా అవుతుంటారు. త్వరలోనే పాన్ ఇండియా మార్కెట్ లో కి ఎంటర్ అవుతున్నాడు. ఎస్ ఎస్ ఎంబీ 29 తో ఇండియానే షేక్ చేయబోతున్నాడు. అటుపై అతడి రేంజ్ ఆకాశాన్నే అంటుతుంది. నేరుగా హాలీవుడ్ కి వెళ్లిపోయినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఆ కటౌట్ అలాంటిది. మరి మహేష్ ఏజ్ ఎంతో తెలుసా? ఇప్పుడు అక్షరాలా ఆయన వయసు 49 ఏళ్లు. మరో ఏడాదిలో 50 లోకి అడుగు పెడతాడు. మహేష్ కి ఏజ్ అన్నది జస్ట్ నెంబర్ మాత్రమే. మహేష్ వయసు గురించి ఎక్కడా ఎప్పుడు చర్చకు రాదు. కానీ విదేశాల్లో మహేష్ ఫోటో చూపించి ఇతడు వయసు ఎంత ఉంటుంది? అని విను వీధుల్లో అడిగితే ఏమన్నారో తెలుసా? 27 ఏళు అని ఒకరు...30 అని మరోకరు...25 ఏళ్లు అని మరొకరు చెబుతున్నారు. విదేశీ యులే మహేష్ వయసు కనిపెట్ట లేకపోతున్నారంటే? అతడు ఏ రేంజ్ లో మెయింటెన్ చేస్తున్నాడో చెప్పొచ్చు. నిజానికి మహేష్ ఎవరో వాళ్లెవ్వరికీ తెలియదు. ఎందుకంటే అతడు హాలీవు స్టార్ కాదు కాబట్టి. ఓ 40 మందిని ఇదే ప్రశ్న అడిగితే అంతా 30 ఏళ్ల లోపే చెప్పారు. మహేషా మజాకానా. ప్రస్తుతం మహేష్ ఎస్ ఎస్ ఎంబీ 29 లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని రాజమౌళి తెరకెక్కి స్తున్నాడు. ఇదొక ఆఫ్రికన్ అడ్వెంచర్ థ్రిల్లర్. సాహస యోధుడిగా మహేష్ ఇందులో కనిపించనున్నారు. ఈసినిమా కోసం మహేష్ ప్రత్యేకంగా కొంత శిక్షణ కూడా తీసుకుని బరిలోకి దిగాడు.


# రకుల్- భగ్నానీ 'ఫిట్ ఇండియా కపుల్'



నేటి యోగాంధ్ర, ఫిట్ ఇండియా యోగాథాన్ ఉద్యమాలు దిగ్విజయంగా కొనసాగాయి. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా భారతదేశం ఫిట్ ఇండియా కల్ట్ యోగాథాన్ నిర్వహించడం ద్వారా ఒక అద్భుతమైన ఫిట్‌నెస్ ఉద్యమానికి తెర తీసింది. దేశవ్యాప్తంగా 10లక్షల మంది (1 మిలియన్) సూర్య నమస్కారాలు ఒకేసారి చేసారు. ఒక్క విశాఖ నగరంలో యోగాంధ్ర కార్యక్రమంలో లక్షలాది మంది యోగాథాన్ లో పాల్గొన్నారు. ఢిల్లీ, హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో వేలాది మంది ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆరోగ్యం ఆనందానికి సంబంధించిన ఈ అద్భుత ఈ కార్యక్రమం భారతీయతను ఆపాదించుకున్నది. యోగా ఫిట్‌నెస్ ప్రాముఖ్యతను ప్రపంచానికి మరోసారి తెలియజేస్తూ, అందాల కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆమె భర్త, నటుడు-నిర్మాత జాకీ భగ్నాని దిల్లీలోని వేదికపై సూర్య నమస్కారాలను ప్రదర్శించారు. ఇది ఫిట్‌నెస్‌ను జీవన విధానంగా ప్రచార కార్యక్రమం. ఆరోగ్యంతో మంచి సమతుల్య జీవనవిధాన ప్రచారానికి నాందిగా మారింది. యోగా పుట్టిల్లు అయిన భారతదేశ కార్యక్రమాలపై ప్రచారానికి ఆదర్శ రాయబారులుగా రకుల్- భగ్నానీ జంట కొనసాగుతారు. వారి సహకారానికి గుర్తింపుగా ఈ జంటకు వేదిక వద్ద 'ఫిట్ ఇండియా కపుల్' అనే బిరుదును ప్రదానం చేసారు. భార్యాభర్తలు ఫిట్నెస్ ఫ్రీక్స్, యోగ సాధనతో వారు ఆరోగ్యంతమైన జీవనాన్ని గడుపుతున్నారు. పది మందికి ఆదర్శంగా ఉన్నారు. రకుల్-జాకీ జీవన విధానం అందరికీ స్ఫూర్తినిస్తుందని సన్నిహితులు చెబుతున్నారు. అందుకే వారు ఈ బిరుదు అందుకోవడానికి అర్హులు అని అన్నారు. గత సంవత్సరం ఇదే తరహాలో నటుడు ఆయుష్మాన్ ఖురానాకు 'ఫిట్ ఇండియా ఐకాన్' బిరుదును ప్రదానం చేశారు. ఇప్పుడు రకుల్- భగ్నానీ జంట సోషల్ మీడియా ద్వారా ఈ చొరవను ప్రచారం చేస్తున్నారు. లక్షలాదిగా ఉన్న వారి ఫాలోవర్స్ ను యోగాను స్వీకరించి దేశవ్యాప్తంగా వెల్నెస్ వేడుకలో చేరాలని ప్రోత్సహించడం ఆసక్తిని కలిగిస్తోంది.

# నాగ చైతన్య@ 25:ఫీల్ గుడ్ ఎమోషన్‌తోపాటు యాక్షన్

నాగచైతన్య కార్తీక్‌వర్మ దండు కలయికలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే! చైతన్యకు ఇది 24వ సినిమా. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇటీవల ఫస్ట్ లుక్ కూడా విడుదల చేశారు. అయితే చై ఈ సినిమా చేస్తూనే తన 5వ సినిమా గురించి కూడా రంగం సిద్ధం చేస్తున్నాడు. తనతో 'మజిలీ' చిత్రం తీసిన దర్శకుడు శివ నిర్వాణ చెప్పిన కథకు చైతూ ఓకే చెప్పేశాడట. కొన్నాళ్లుగా ఈ ఇద్దరి మధ్య చర్చలు నడుస్తూనే ఉన్నాయి. అతను చెప్పిన కథతోనే తన 25వ సినిమాగా పట్టాలెక్కిస్తే బాగుంటుందని చైతూ భావిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను



నిర్మించనుంది. ఇప్పటికే నిర్మాతలు హీరోకి, దర్శకుడిగా అడ్వాన్స్ ఇచ్చారని టాక్. దర్శకుడు శివ ప్రస్తుతం డైలాగ్ వెర్షన్ సిద్ధం చేస్తున్నాడు.

వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మజిలి' సినిమా ప్రేక్షకాదరణ పొందింది. ఆ తరవాత నానితో తీసిన టక్ జగదీష్' సరైన ఫలితం ఇవ్వలేదు. అప్పటి నుంచి శివ కథలపై దృష్టి పెట్టాడు. సరైన అవకాశం కోసం ఎదురు చూశారు. ఈసారి కూడా తనదైన శైలిలో ఫీల్ గుడ్ ఎమోషన్‌తోపాటు కాస్త యాక్షన్ కథ రాసుకున్నాడని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఈ యేడాది చివర్లో ఈ సినిమా సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం కార్తీక్ వర్మ నాగచైతన్యతో తీస్తున్న సినిమాకు 'వృషకర్మ' అనే టైటిల్ పరిశీలిస్తునట్లు సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తుంది. స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో చిత్రీకరణ కొంత పూర్తి చేశారు. అక్కడ కొంతమేర షూటింగ్ చేశారు. ప్రస్తుతం మరో కీలక షెడ్యూల్ చేస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది.

# టీమిండియాపై సచిన్, గంగూలీల ప్రశంసలు.. మూడో సెంచరీ ఎవరిదంటూ ప్రశ్న



అంతా యువ క్రికెటర్లే.. టాలెంట్‌కు తక్కువేమీ లేకపోయినా అనుభవరాహిత్యం, పైపెచ్చు ఇంగ్లండ్‌లో కఠిన పరిస్థితులు.. ఇలా జనాలు టీమిండియాపై ఎన్నో సందేహాలు వ్యక్తం చేశారు. వాటన్నిటికీ శుభ్‌మన్ గిల్ జట్టు.. టెస్టు మ్యాచ్ తొలి రోజునే గట్టి సమాధానం ఇచ్చింది. హెడింగ్లీ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మొదటి రోజు ఏకంగా రెండు సెంచరీలతో జట్టుకు ఢోకాలేదన్న భరోసా కల్పించింది.ఆట మొదటి రోజును టీమిండియా 359/3 స్కోరుతో ముగించింది. గిల్ (127 నాటౌట్), జైశ్వాల్ (101) అద్భుత ప్రదర్శనలకు తోడు రిషభ్ పంత్(64) కూడా రాణించాడు. టీమిండియా ప్రదర్శన క్రికెట్ లెజెండ్స్ సచిన్ టెండుల్కర్, గంగూలీలను ఆకట్టుకుంది. 2002లో తాము ఇదే మైదానంలో ఇంగ్లండ్‌ను ఢీకొన్న రోజులను గుర్తుకు తెచ్చింది. ఈ విషయమై సచిన్ తొలుత ఎక్స్ వేదికగా స్పందిస్తూ టీమిండియాపై ప్రశంసలు కురిపించాడు.'కేఎల్ రాహుల్, జైశ్వాల్ ఇన్నింగ్స్ జట్టుకు గట్టి పునాది వేశాయి. యశస్వి, గిల్‌కు సెంచరీలు సాధించినందుకు శుభాకాంక్షలు. రిషభ్ పంత్ ఇన్నింగ్స్ కూడా జట్టుకు కీలకమే. అయితే, తొలి రోజున టీమిండియా బ్యాటింగ్ చూసి నాకు 2002 నాటి హెడింగ్లీ టెస్టు గుర్తొచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో రాహుల్, గంగూలీ, నేను సెంచరీలు సాధించాము. ఆ టెస్టులో విజయం సొంతం చేసుకున్నాము. ఈమారు యశస్వి, శుభ్‌మన్ తమ బాధ్యతను నిర్వర్తించారు. మరి మూడో సెంచరీ ఎవరు సాధిస్తారు?' అని సచిన్ ప్రశ్నించారు. గంగూలీని కూడా ట్యాగ్ చేశాడు.దీనికి సౌరవ్ గంగూలీ కూడా మరింత ఉత్సాహంగా స్పందించాడు. ఈసారి మూడు కాదు నాలుగు సెంచరీలు నమోదు కావొచ్చని అన్నాడు. పంత్ లేదా కరుణ్ వీటిని సాధించొచ్చని చెప్పాడు.

# తొలి టెస్ట్‌లో సత్తా చాటిన్ గిల్.. కోహ్లీ రికార్డు బద్దలు



ఇంగ్లండ్‌తో కఠిన పరిస్థితుల్లో ఎలా రాణిస్తారో అనే అనుమానాల మధ్య తొలి టెస్ట్ ఆడిన టీమిండియా కుర్రాళ్లు అదరగొట్టారు. ఇంగ్లండ్‌తో శుక్రవారం మొదలైన తొలి టెస్ట్ తొలి రోజు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించారు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. అద్భుత శతకం సాధించి జట్టును ముందుండి నడిపించాడు. ఈ నేపథ్యంలో పలు కీలక రికార్డులను కూడా తన పేరిట లిఖించుకున్నాడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ తొలి రోజు శుభ్‌మన్ గిల్ అజేయంగా సెంచరీ చేశాడు. 127 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. గిల్ టెస్ట్ కెరీర్‌లో ఇది ఆరో సెంచరీ. అయితే ఆసియా వెలుపల గిల్ సెంచరీ చేయడం ఇదే మొదటి సారి. కెప్టెన్‌గా తొలి టెస్ట్‌లోనే సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. గిల్ కేవలం 25 సంవత్సరాల 285 రోజుల వయసులో కెప్టెన్‌గా గిల్ సెంచరీ చేశాడు. ఈ క్రమంలో గిల్.. విరాట్ కోహ్లీ (26 సంవత్సరాలు, 34 రోజులు) రికార్డును బద్దలు కొట్టాడు

# రెండేళ్ల తర్వాత పారిస్ డైమండ్ లీగ్ టైటిల్ గెల్చుకున్న నీరజ్ చోప్రా



ఒలింపిక్ పతక విజేత భారత జావెలిన్ త్రో సూపర్‌స్టార్ నీరజ్ చోప్రా రెండేళ్ల తర్వాత తన తొలి పారిస్ డైమండ్ లీగ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. బలమైన ఫీల్డ్‌లో 90 మీటర్ల మార్కును చేరుకోకుండానే జర్మన్ ప్రత్యర్థి జూలియన్ వెబర్‌ను అధిగమించాడు. 27 ఏళ్ల చోప్రా శుక్రవారం రాత్రి తన మొదటి రౌండ్ త్రోలో 88.16 మీటర్లు త్రో చేసి టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఇందులో ప్రతిష్టాత్మక 90 మీటర్ల క్లబ్ నుంచి ఐదుగురు ఉండటం విశేషం.చివరి ప్రయత్నంలో..అతని రెండో త్రో 85.10 మీటర్లు కాగా, అతను తన తదుపరి మూడు ప్రయత్నాలను ఫౌల్ చేసి తన ఆరవ, చివరి ప్రయత్నంలో 82.89 మీటర్లు నమోదు చేశాడు. వెబెర్ తన ప్రారంభ త్రోతో 87.88 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. బ్రెజిల్‌కు చెందిన లూయిజ్ మౌరిసియో డా సిల్వా తన మూడో రౌండ్ ప్రయత్నంతో 86.62 మీటర్లతో మూడో స్థానంలో నిలిచాడు.2022లో నీరజ్ జ్యూరిచ్?లో 88.44మీటర్లతో మొదటి డైమండ్ లీగ్ టైటిల్ సాధించాడు. ఆ తర్వాత మరోసారి రెండు సంవత్సరాల తరువాత మళ్ళీ అదే రోజున టైటిల్ సాధించడం విశేషం. 2024లో బ్రుసెల్స్ ఫైనల్లో 87.86 మీటర్లతో 1సెం. తేడాతో రెండో స్థానంలో నిలిచాడు నీరజ్. ఇలా చూస్తే, అతని నిరంతర శ్రమ, స్థిరమైన పట్టుదల మళ్లీ టైటిల్ సాధించేలా చేశాయి.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**